ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-7-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 168 పేజీలు: 8+16 వెల: 6.50



పృథ్వీ 2, అగ్ని-1 క్షిపణుల పరీక్ష విజయవంతం 2లో

## నగరమా.. సాగరమా!

మారేడ్‌పల్లి, బాలానగర్, ముషీరాబాద్, మరికొన్ని ప్రాంతాల్లో కొద్ది గంటల్లోనే 11 సె.మీ. పైగా వర్షపాతం

కార్ల షోరూంలోకి వరద, చిక్కుకుపోయిన సిబ్బంది

పూర్తి స్థాయికి పెరిగిన హుస్సేన్‌సాగర్ నీటిమట్టం, తెలంగాణ అంతటా బలపడిన రుతుపవనాలు

పలుచోట్ల ట్రాఫిక్ జామ్‌లు

అధికారులు అప్రమత్తంగా ఉండాలని సిఎం ఆదేశం

మరో నాలుగు రోజులు భారీ వర్షాలకు అవకాశం



నగరంలోని పలుప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్‌జామ్‌లు



శుక్రవారం కురిసిన భారీవర్షానికి నగరమంతా సాగరంలా మారిపోయిన దృశ్యం

### హైదరాబాద్‌లో కుండపోత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై18:** భారీ వర్షాలకు తెలంగాణలో పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. మరో నాలుగు రోజుల పాటు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, అసవరమైతేనే బయటకు వెళ్లాలని సూచించింది. ఇక దక్షిణ తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని జిల్లాల్లో 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. కాగా శుక్రవారం హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉప్పల్ హబ్సిగూడ, మియాపూర్ గచ్చిబౌలి మార్గాల్లో, వివిధ కూడళ్లలో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గచ్చిబౌలి బయోడైవర్సిటీ >>2

## టెండర్ల నుంచి టిక్కెట్లదాకా అంతా గోల్‌మాల్





బిసిసిఐ నిధులు సొంత పనుల కోసం!

స్టేడియం కుర్చీలు, జిమ్ పరికరాల టెండర్లలోనూ కోట్లల్లో అవినీతి

హెచ్‌సిఎ అక్రమాలు తేల్చేందుకు రంగంలోకి ఇడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై18:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దృష్టి సారించింది. బిసిసిఐ నుంచి వచ్చిన నిధులను క్రికెట్ అభివృద్ధి కోసం కాకుండా సొంత పనులకు వాడినట్టు ఆరోపణలు ఉన్నాయి. స్టేడియం టెండర్ల నుంచి మొదలుకుని టికెట్ల విక్రయం దాకా అన్నింటిలో గోల్‌మాల్ జరిగినట్లు బయటపడింది. గత 10 ఏళ్లలో బిసిసిఐ నుంచి హెచ్‌సిఎకు రూ.800 కోట్లకుపైగా నిధులు వచ్చాయి. కోట్ల రూపాయలు ఉన్న హెచ్‌సిఎ అకౌంట్‌నుకూడా సొంత ప్రయోజనాలకు వాడారని ఆరోపణలు వచ్చాయి. 2022లో జస్టిస్ లావ్ నాగేశ్వర్‌రావ్ విచారణలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. క్రికెట్ బాల్స్, స్టేడియం చైర్స్, జిమ్ పరికరాలు టెండర్లలలో కోట్ల రూపాయలు అవినీతి జరిగినట్టు ఫోరెన్సిక్ ఆడిట్‌లో నిర్ధారణ అయ్యింది. ఈ వ్యవహారంపై గతంలోనే హెచ్‌సీఏ సభ్యులను ఇడి విచారించింది. తాజాగా హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావ్ కూడా ఇదే రీతిలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. హెచ్‌సిఎలోకి ఎంట్రీ కావడానికి ఎవరెవరికి ఎంత ఇచ్చారో అన్న విషయాలన్నింటినీ ఇడి తేల్చనుంది. ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా టెండర్ల విషయంలోనూ సొంత వాళ్లకే ప్రయోజనాలు చేకూరేలా జగన్ వ్యవహరించినట్లు తేలింది. ఫుడ్ క్యాటరింగ్, స్టేడియంలో స్టాల్స్, టికెట్స్ కేటాయింపులోనూ తన వారికే కట్టబెట్టుకున్నట్టు >>2



శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోల్‌లో స్వయంసంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న సిఎం రేవంత్

## 'పాలమూరు'కు అడ్డుపడొద్దు

ఎపి సిఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా..

రాయలసీమ లిఫ్ట్‌ను రద్దుచేయండి

పాలమూరు బిడ్డే మరో 20 యేళ్లు సిఎం

మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

జటప్రోలులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూలుకు శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్

**మహబూబ్‌నగర్ బ్యూరో. జూలై18, ప్రభాతవార్త:** "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా..పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అడ్డుపడొద్దని, శ్రీశైలం డ్యాం నుంచి రోజుకు 3టిఎంసిల నీటిని తరలించే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని రద్దు చేయాలి" అంటూ సిఎం రేవంత్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ నియోజకవర్గంలోని జటప్రోల్‌లో 200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం జటప్రోల్‌లో మదనగోపాలస్వామి ఆలయంలో సిఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిఎం ప్రసంగించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే కల్వకుర్తి ఎత్తిపోతల, పథకం ప్రారంభమైంది. భీమా,నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ప్రారంభం అయ్యాయి. పాలమూరు -రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులను అడ్డుకోవద్దని పేర్కొన్నారు.

ఒకనాడు చంద్రబాబు పాలమూరును దత్తత తీసుకున్నారని, ఇప్పుడు తమ ప్రాజెక్టులకు అడ్డుపడొద్దని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం నుంచి నాలుగు టిఎంసిల నీళ్ల తీసుకునేది ఉంటే ఇవాలా తొమ్మిదిన్నర టిఎంసిల నీళ్లు తీసుకోవడానికి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుచేసుకున్నారని వివరించారు. రోజుకు మూడు టిఎంసిల నీటిని తరలించే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను రద్దు చేసి చంద్రబాబు నాయుడు తమ ఉదారతను చాటుకోవాలని కోరారు. చంద్రబాబుకు రెండు రాష్ట్రాలకు సమానంగా అభివృద్ధి చేసే ఆలోచన ఉన్నది నిజమైతే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ రద్దు చేయాలని, పాలమూరు - రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, బీమా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు తమకు సహకరించాలన్నారు. పాలమూరు బిడ్డలు విజ్ఞత ఉన్నవారని,అలా చేస్తే చంద్రబాబు మేలు ఎప్పటికీ మర్చిపోరని, వినకపోతే పోరాటం ఎలా చేయాలో తమకు తెలుసని, పోరాటాల ద్వారానే సాధించుకుంటామని, దానికి తానే నాయకత్వం వహిస్తానన్నారు. కెసిఆర్ పదేండ్లు సిఎంగా పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేయలేదని, ఉమ్మడి రాష్ట్రంలో కంటే తెలంగాణ వచ్చాకే పాలమూరుకు ఎక్కువ నష్టం జరిగిందన్నారు. పదేండ్లలో 20లక్షల కోట్లు ఖర్చు చేసిన కెసిఆర్ 25వేల కోట్లు ఖర్చు చేస్తే పాలమూరు రంగారెడ్డి పథకం పూర్తయ్యేదన్నారు. కేవలం ఒక్క ప్రాజెక్టు కాళేశ్వరానికి లక్ష కోట్లు పెట్టి కడితే మూడేండ్లక అది కూలేశ్వరం అయిందని ఎద్దేవాచేశారు. 2034వరకు పాలమూరుబిడ్డ ముఖ్యమంత్రి ఉంటాడన్నారు. >>2



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

## ఒఆర్ఆర్ వద్ద ఘోర ప్రమాదం

లారీని ఢీకొన్నకారు, నలుగురు మృతి

యాదాద్రి దర్శనం చేసుకొని వస్తుండగా దుర్ఘటన

**రంగారెడ్డి అర్బన్, జూలై18, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల ఒఆర్ఆర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో నలుగురు అక్కడిక్కడే మృతి చెందారు. మరోకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రికి తరలించారు. ఈ >>2

## ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టుల మృతి

మృతుల సంఖ్య పేరిగే అవకాశం

భారీగా ఆయుధాలు స్వాధీనం

**చర్ల, జూలై 18, ప్రభాతవార్త :** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ ప్రాంతంలో శుక్రవారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఆరుగురు నక్సల్స్ మృతదేహాలను పోలీసులకు స్వాధీనం చేసుకున్నారు. పలువురు తీవ్ర గాయాలు కాగా ఇంకా మృతదేహాల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు, మృతుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీ నాయకులు ఉండనున్నట్లు పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాగా సంఘటన స్థలం నుంచి ఎకె 47 >>2

## కాంగ్రెస్ అంటే వ్యవసాయం, కరెంటు



శుక్రవారం నాగార్జున సాగర్ మెయిన్ పవర్‌హౌస్‌లో జెన్‌కో ఉద్యోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

కెసిఆర్ హయాంలోని తప్పిదాలకు మూల్యం చెల్లిస్తున్నాం

రైతు భరోసా రూ. 9 వేల కోట్లు పంపిణి చేశాం:డి సిఎం భట్టి

**నాగార్జునసాగర్, జూలై 18, ప్రభాతవార్త :** విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఆయన నాగార్జునసాగర్ లో పర్యటించారు. సాగర్ ప్రాజెక్టు మెయిన్ పవర్ హౌజ్ ను పరిశీలించారు. జెన్ కో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పవర్ హౌజ్ వివరాలను భట్టికి వెల్లడించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలోనూ.. అన్ని యూనిట్లలో ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యుత్తు ఉత్పత్తి జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారుగత కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి భారంగా మారాయని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పర్యటనలో భాగంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో చేసిన తప్పిదాలకు నేడు తమ ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోందని అన్నారు. గతంలో శ్రీశైలంపైన ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే అడ్డుకోకుండా కేసీఆర్ ప్రభుత్వం సహకరించిందని మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు.కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్టులు అని అభివర్ణించారు. గత కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి భారంగా మారాయని ఆరోపించారు. కేసీఆర్ పాలనలోచేసిన తప్పిదాలకు నేడు తమప్రభుత్వం మూల్యం చెల్లిస్తోందని అన్నారు. గతంలో శ్రీశైలంపైన ఎపి ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే అడ్డుకోకుండా కెసిఆర్ ప్రభుత్వం సహకరించిందని మండిపడ్డారు. >>2



## యాదగిరి దాకా ఎంఎంటిఎస్

విస్తరణ పనులకు టెండర్లు పూర్తి

వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యకు త్వరలో పరిష్కారం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై18:** వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటు కోసం కేంద్రం ఎన్నిసార్లు అడిగినా గత ప్రభుత్వం భూమి ఇవ్వలేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో హైదరాబాద్ మినహా ఇతర పట్టణాల్లో విమానాశ్రయాలు లేవని అన్నారు. శుక్రవారం బిజెపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వం భూమి ఇవ్వలేదని విమర్శించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని త్వరత్వరగా పూర్తి చేస్తోందని, కాజీపేట యూనిట్‌ను కోచ్ వ్యాగన్ల నుంచి ఇంజిన్ల తయారీ వరకు విస్తరిస్తున్నాం అని కిషన్ రెడ్డి తెలియజేశారు.బడ్జెట్ కూడా రూ.200 కోట్లతో ప్రారంభమై మరో రూ.200 కోట్లు పెరిగిందని కాజీపేట రైల్వే పరిశ్రమతో దాదాపు 3 వేల ఉద్యోగాలు వస్తాయని, రాష్ట్రానికి అనేక కొత్త రైళ్లు మంజూరు అవుతున్నాయని అన్నారు.

జోధ్‌పుర్, కచ్, అహ్మదాబాద్‌కు నేరుగా రైళ్లు సర్వీసులు వస్తాయని పేర్కొన్నారు. ఎంఎంటిఎస్‌ను యాదగిరిగుట్ట వరకు విస్తరించాలని నిర్ణయించామని, యాదగిరిగుట్ట వరకు ఎంఎంటిఎస్ విస్తరణకు టెండర్లు పూర్తయ్యాయని చెప్పారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తి చేస్తామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఆనాటి ప్రధాని పివి నరసింహారావు హయాం నుంచి వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ కావాలని అనేక పోరాటాలు జరిగాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. కోచ్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం కాబోతుందని తెలి >>2

## ఎప్ సెట్‌లో 77,561 సీట్ల భర్తీ

- 5493 సీట్లు ఖాళీ
- 82 కాలేజీల్లో 100 శాతం సీట్లు పూర్తి
- 31 నుంచి ఆగస్టు 2 లోపు కాలేజీల్లో చేరాలి
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన



**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్‌లో మొదటి విడత సీట్ల కేటాయింపులో 77,561 మందికి సీట్లను కేటాయించారు. మరో 5493సీట్లు ఖాళీగాఉన్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 22లోగా ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటిసారిగా ప్రారంభించిన మాక్ సీట్ అలకేషన్‌ను ఈ నెల 12న శనివారం ప్రకటించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 77,154 మందికి సీట్ల కేటాయింపు చేశారు. మాక్ సీట్ అలకేషన్‌లో సీటు పొందిన వారు తమ వెబ్ ఆప్షన్లను మార్చుకోవడానికి ఈ నెల 15 వరకు అవకాశం కల్పించగా.. మాక్‌సీట్ అలకేషన్‌లో భాగంగా సీటు పొందిన వారిలో 44,553 మంది తమ వెబ్ ఆప్షన్లలో మార్పులు చేసుకున్నారు. దీంతో మొదటి విడత సీట్ల కేటాయింపు శుక్రవారం చేశారు. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఈనెల 7తోనే స్లాట్‌బుక్ చేసుకునే గడువు ముగియడంతో.. గడువులోపుగా 97,533 >>2

## బిసి రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై న్యాయ సలహా కోరిన గవర్నర్

**ప్రభాతవార్త ప్రధానప్రతినిధి,హైదరాబాద్, జూలై 18:** బిసి రిజర్వేషన్ ఆర్డినెన్స్ పై తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ న్యాయ సలహా కోరినట్టు సమాచారం. స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్‌ను ప్రస్తుతం ఉన్న 29శాతం నుండి 42 శాతంకు పెంచే లక్ష్యంతో బిసి రిజర్వేషన్ బిల్లును రూపొందించగా..మార్చి17న అసెంబ్లీలో ఆమోదం పొందింది. అనంతరం ఈ బిల్లును చట్టం చేసేందుకు పార్లమెంటుకు పంపగా అక్కడ మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే సెప్టెంబర్30లోపు స్థానికఎన్నికలు పూర్తి చేయాలని రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వానికి >>2



శుక్రవారం బీహార్‌లోని మోతీహారిలో సిఎం నితీశ్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని మోడీ

# పృథ్వీ 2, అగ్ని-1 క్షిపణుల పరీక్ష విజయవంతం

**చాందిపూర్,జూలై 18:** పృథ్వీ 2, అగ్ని 1 బాలిస్టిక్ క్షిపణుల పరీక్ష విజయవంతం అయింది. గురువారం ఒడిశా, చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి వీటిని పరీక్షించారు. ది స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో వీటి పరీక్ష జరిగింది. పృథ్వీ 2, అగ్ని 1లు ఆపరేషనల్, టెక్నికల్ పారామీటర్స్‌ను అందుకున్నాయి. దీంతో పరీక్ష విజయవంతం అయింది. పృథ్వీ 2 మిస్సైల్ స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి. దీనిని భారతదేశ రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్డీఓ) అభివృద్ధి చేసింది. ఇది ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణి. ది స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ దీనిని వాడుతుంది. ఈ క్షిపణి రేంజ్ 350 కిలోమీటర్లు. 500 నుంచి 1000 కిలోల బరువును మోసుకెళ్లగలదు. అగ్ని 1 మిస్సైల్ స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి. దీనిని భారతదేశ రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) అభివృద్ధి చేసింది. ఈ క్షిపణి రేంజ్ 700 నుంచి 900 కిలోమీటర్లు. ఇది వెయ్యి కిలోల యుద్ధ సామాగ్రిని మోసుకెళ్లగలదు. తక్కువ లోడు ఉంటే ఏకంగా 1200 కిలోమీటర్లు దూసుకెళ్లగలదు.

# సలహా కోరిన గవర్నర్

>> ఆదేశాలు జారీ చేసిన క్రమంలో ఈ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చేందుకు సిద్ధం అయింది. బిసి రిజర్వేషన్ అమలు కోసం ఆర్డినెన్స్‌ను ఇప్పటికే గవర్నర్‌కు పంపినప్పటికీ, ఆయన ఇంకా ఆమోదం తెలపలేదు. దీనిపై గవర్నర్ న్యాయ సలహా కోరారు. ఈ క్రమంలో ఈ ఆర్డినెన్స్ ఆమోదానికి మరింత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఆర్డినెన్స్ రాష్ట్రంలో మొత్తం రిజర్వేషనన్‌ను సుప్రీం కోర్టు నిర్దేశించిన 50శాతం పరిమితిని దాటి 70శాతంకి తీసుకెళ్తుంది. దీనిలో బిసిలకు 42శాతం,ఎస్సీలకు 18శాతం, ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. 50శాతం రిజర్వేషన్ పరిమితిని దాటడం వల్ల కలిగే న్యాయ సమస్యలను గవర్నర్ పరిశీలిస్తున్నారు. అయితే గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గవర్నర్లు బిల్లులను ఒక నెలలోపు ఆమోదించాలి లేదా తిరిగి శాసనసభకు పంపాలని ఆదేశించిన నేపథ్యంలో, ఆర్డినెన్స్‌పై కూడా గవర్నర్ త్వరలో నిర్ణయంతీసుకోవాల్సి ఉంటుంది. ఆర్డినెన్స్‌పై గవర్నర్‌వద్ద ఆమోదం పొందితే, స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలవుతుంది.

# అంతా గోల్‌మాల్

>> ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు హెచ్‌సీఏలో క్విడ్ ప్రో కో జరిగినట్టు ఈడీ గుర్తించింది. టెండర్లు లేకుండా అనుకూలమైన వారికే పనులు కేటాయించడంతో హెచ్‌సీఏ సభ్యులు భారీగా లబ్ది పొందినట్టు ఈడీ గుర్తించింది. కొద్ది రోజుల క్రితమే హెచ్‌సీఏ మాజీ ట్రెజరర్ సురేందర్ అగర్వాల్, అతడి భార్యను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారించారు. ఈ క్రమంలో రూ.90 లక్షలు క్విడ్ ప్రో కో జరిగినట్టు బయటపడింది. క్రికెట్ బాల్స్ టెండర్ల, జిమ్ సామాను టెండర్లు, స్టేడియం కుర్చీలు టెండర్‌లు తమకు కేటాయించినందుకు లక్షల రూపాయలు లంచం తీసుకున్నట్లు బయటపడింది. మాజీ హెచ్‌సిఎ ట్రెజరర్ సురేందర్ అగర్వాల్ భార్య పేరు మీద జేబీ జ్యువెలర్స్ ఖాతాలోకి లంచం డబ్బుల జమ అయినట్లు ఈడీ గుర్తించింది. కాగా.. హెచ్‌సిఎ అక్రమాల కేసులో జగన్ మోహన్ రావు, ట్రెజరర్ శ్రీనివాసరావు, సీఈవో సునీల్ కాంటె, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, ఆయన భార్య శ్రీచక్ర క్రికెట్‌క్లబ్ అధ్యక్షురాలు కవితను ఈ నెల 9న సీఐడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారిని ఆరో రోజుల పాటు విచారించేందుకు కోర్టు అనుమతించడంతో సిఐడి కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. అలాగే హెచ్‌సీఏ నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై సిఐడి ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్ట్ ఆధారంగా గురువారం) ఇసిఐఆర్‌ను ఇడి నమోదు చేసింది

# ఓఆర్ఆర్ వద్ద ఘోర ప్రమాదం

>> ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కారును బయటకు తీసే ప్రయత్నాలు చేస్తున్నారు.ఆదిభట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు మలోతు చందు (29) మాసంపల్లి తండా, పాకాల కొత్తగూడెం వరంగల్ జిల్లా,కావలి బాల్‌రాజ్ ముదిరాజ్(40) ఎల్కపల్లి, మొయినాబాద్,గుజులోతు జనార్ధన్ (45) దాసరి తండా, గూడూరు మండలంలోని మహబూబాద్,దాసరి భాస్కరరావు (39)వేదులవలస శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తిలు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు.పెద్ద అంబర్‌పేట్ నుండి బొంగులూరు వెళ్తున్న కారు లారీని ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదు మందికి గాను నలుగురు అక్కడిక్కడే మృతి చెందగా, ఒకరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు.తెలవారుజామున పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బంది సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని టిఎస్ 07హెచ్ డబ్యూ5858 బెల్లెనో కారులో ఐదు మంది వ్యక్తులు ప్రయాణిస్తున్నారు,వారి కారును బొంగుళూరు ఎగ్జిట్ దగ్గర వెనుక నుండి వచ్చినా లారి ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో మృతదేహాలు కారులోనే చిక్కుకున్నాయి. మృతిచెందినవారు యాదగిరిగుట్ట దైవ దర్శనంచేసుకుని తిరిగివస్తుండగా ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టంనిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# జూరాలకు భారీ వరద

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 18, ప్రభాతవార్త:** జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం పెరుగుతున్నది. కర్ణాటక నుంచి గత నాలుగు రోజులుగా వరద తగ్గడంతో జూరాల గేట్లుమూసివేశారు. శుక్రవారం జలాశయానికి 1,15,000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.264 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 30,498 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 71,604 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

# శ్రీశైలం సమీపంలోని ఈగల పెంట, దోమల పెంట పేర్లు మార్పు

## ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్,జూలై 18,ప్రభాతవార్త :** శ్రీశైలం సమీపంలోని ఈగల పెంట, దోమల పెంట పేర్లను రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. కొత్త పేర్లను పెడుతూ ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈగల పెంటను కృష్ణ గిరి, దోమల పెంటను బ్రహ్మగిరిగా మార్చుతూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు మార్చాలని అధికారులను ఆదేశించింది.

# 'పాలమూరుకు' అడ్డుపడొద్దు

>> "పాలమూరు జిల్లా అంటేనే చిన్న చూపుతో ఉండేవారు..ఇప్పుడు ఎదుగుంటే ఏడుస్తున్నారు, పాలమూరు బిడ్డే మరో 20ఏండ్లు రాష్ట్రాన్ని పరిపాలించడం ఖాయం, మహిళలు, ఆడబిడ్డలను ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తున్న ప్రభుత్వం" అని రేవంత్ రెడ్డి అన్నారు. దేశంలోనే వడ్లు పండించడంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు మొదటి సంవత్సరంలోనే రుణమాఫీ చేసిన ఘనత తమకే దక్కుతుందని విడతల వారీగా కాకుండా ఒకేసారి రుణమాఫీ చేసింది తామేనని రూ.21వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేసి రుణాలు మాఫీ చేసిన ఘనత తమకే దక్కుతుదన్నారు. అలాగే తొమ్మిది రోజుల్లో రూ.9 వేలకోట్లు రైతుభరోసా పథకంకింద ఇచ్చింది తామేనని... పామాయిల్‌ను ప్రోత్సహిస్తుంది తాము కాదా అని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వ యంత్రాంగం రైతులు ఆదుకునే ప్రయత్నం చేస్తున్నామని... వడ్డీలేని రుణాలను ఆడబిడ్డలకు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. తాను గ్రామం నుంచే వచ్చానని... తనది కొండారెడ్డిపల్లి అని పల్లెల్లో సమస్యలు తెలుసుననని వివరించారు. కోటి ముప్పై లక్షల జతల బట్టలు మహిళలకు అందించామని.. అది కాంట్రాక్టర్లకు అందించలేదని ఈ విషయంలో మహిళలకు ఆర్థిక స్వావలంభన చేస్తున్నట్లు తెలిపారు. టీచర్లు అటెండెన్స్ మా అక్కాచెల్లెళ్ళు తీసుకుంటున్నారని.. బడుల నిర్వహణను ఆడబిడ్డల చేతిలో పెట్టామని తెలిపారు. ప్రస్తుతం అంబాని, ఆదానితో పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్తు అందించేలా మహిళలకు అందించామని రేవంత్ రెడ్డి తెలిపారు. బస్సులో ఎవరైనా కిరాయి అడిగితే తన ఫొటో చూపించి ఆయనను అడగాల్సిందిగా చెప్పాలని సిఎం తెలిపారు. ఆర్టీసీకి వెయ్యి బస్సులకు యజమానులను చేసింది తమ ప్రభుత్వమని... తమ అక్కాచెల్లెళ్ళకు ఆర్థిక స్వావలంభన కల్పించడం జరుగుతుందన్నారు. 2035 నాటికి ఒక మిలినయన్ డాలర్ ఎకానమీ కావాలని ప్రయత్నం చేస్తున్నానని... కోటి మంది ఆడబిడ్డలను మహిళా సంఘాల్లో చేరాలని అప్పుడే ఆర్థికంగా ఎదుగారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఏడాదిన్నర కాలంలో దేశంలో మహిళల కోసం పాటుపడిన రాష్ట్రం దేశంలోనే లేదని.. ఈ విషయంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖలను పంపిస్తానని తెలిపారు. ఎల్బీ స్టేడియంలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు తాము ఇచ్చామని.. ఒక్క తలకాయ తక్కువ ఉంటే చూపించమని సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.. అలాగే లక్షల్లో ఉద్యోగాలు ఇచ్చి దేశానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తామన్నారు. దీంతో పాటు ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు వేస్తూ అందరికీ న్యాయం చేస్తున్నామని... 1.49 లక్షల ఎకరాలకు 70 లక్షల మంది రైతులకు 9 రోజుల్లో 9 వేల కోట్ల మేరకు రైతు భరోసా వేయడం ద్వారా వారి కళ్లల్లో ఆనందం చూసినం. పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని చెప్పాం. దాంతో ఏడాది తిరిగేలోపు 2.85 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి దేశంలోనే రికార్డు సాధించాం. రైతు భరోసా, రుణమాఫీ, కనీస మద్దతు ధర, రేషన్ కార్డు కావొచ్చు.. రైతులు సంతోసంగా ఉన్నప్పుడు తెలంగాణ ఒక పండుగ జరుపుకుంటుంది. ఆర్టీసీలో ఆడబిడ్డకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు మహిళా సంఘాలకు వెయ్యి బస్సులిచ్చి కిరాయికి ఇచ్చే విధంగా అవకాశం ఇచ్చాం. 200 యూనిట్ ఉచితంగా ఇవ్వడమే కాకుండా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఆడబిడ్డలకు ఇస్తున్నాం.

అలాగే జిల్లా కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంక్ లు నడిపించే బాధ్యత ఇచ్చాం. అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో వాటిని నిర్వహించే బాధ్యత ఇచ్చాం. దేశంలో ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రంలో కులగణన పూర్తి చేయడం ద్వారా వచ్చే జనగణనలో కులగణన చేసే విధంగా ఒత్తిడి తెచ్చి తలొగ్గే విధంగా చేయగలిగాం. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నాం.." అని వివరించారు.వేల కొలువులు ఇవ్వడానికి ముందుకొచ్చామన్నారు. ప్రజాపాలన అంటే తమదేనని అన్నారు. కొల్లాపూర్ అటవీ ప్రాంతంలోని సోదరులు చదువుకోవాలని రూ.200 కోట్లతో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభించుకున్నామని... హైటెక్ సిటీకి ధీటుగా జట్రోల్ నిలుస్తోందన్నారు. అలాగే ఇతర దేశాల నుంచి ఎన్నో సంస్థలను తీసుకువచ్చామని... కాస్మొటిక్ ఛార్జీలు, భోజనం ఛార్జీలు పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేని రేవంత్ రెడ్డి తెలిపారు. పాలమూరు జిల్లా అంటే వలసలు, కూలీల జిల్లా కాదని నిరూపిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రూ.344 కోట్లతో తెలంగాణలోని 3,52,635 స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యురాలుకు రూ.20లక్షలు ప్రమాద బీమా చెక్కును,స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యురాలుకు రూ.9లక్షల 35వేల 443 లోన్ బీమా చెల్లింపు చెక్‌ను, అనంతరం రూ.344 కోట్ల వడ్డీలేని రుణాలకు సంబంధించిన చెక్కును మంత్రులతో కలిసి స్వయం సహాయక సంఘాల వారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు. వాకిటి శ్రీహరి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహా, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, పర్ణికారెడ్డి పాల్గొన్నారు.

# నగరమా.. సాగరమా!

>> నుంచి ఐకియా మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.హైటెక్ సిటీ నుంచి కెపిహెచ్‌బి మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కార్లు నీట మునిగాయి. మాదాపూర్ నెక్టార్ గార్డెన్ వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మలక్‌పేట, మూసారాంబాగ్ ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. నాలాల నుంచి మురుగు నీరు ఉప్పొంగుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలో అర్థ గంట వరకు భారీ వర్షం కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నగర వాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. భారీ వర్షంతో రహుల్‌పురలో పైగా కాలనీ విమాన నగర్‌లో వరద బీభత్సం సృష్టించింది. ఓ కార్ల షోరూమ్‌లోకి 4 అడుగుల మేర వరద చేరింది. దీంతో అందులో పనిచేస్తున్న సుమారు 30 మంది ఉద్యోగులు వరదలో చిక్కుకుపోయారు. పోలీసులు, డీఆర్ఎఫ్, హైడ్రా అధికారులకు షోరూం సిబ్బంది సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన హైడ్రా వారిని వెనుక వైపు నుంచి రక్షించారు.చిన్న పడవలలో వారిని బయటకు తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో భారీ వర్షం నేపథ్యంలో అధికారులను అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూ, వాటర్ వర్క్స్, విద్యుత్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, హైడ్రా బృందాలు, ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.వర్షంతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.శుక్రవారం మధ్యాహ్నం నుంచి హైదరాబాద్‌లో కురిసిన వర్షానికి భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మారేడ్‌పల్లి ప్రాంతంలో 11.28 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మారేడ్‌పల్లి,బాలానగర్,బండ్లగూడ,ముషీరాబాద్‌లో 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.బోయిన్‌పల్లిలో 11.10 సె.మీ. నాచారంలో 10.05 సెం.మీ. ఉప్పల్,మల్కాజిగిరిలో 10 సెం.మీ,ముసారాంబాగ్‌లో 9.8 సెం.మీ. నమోదైంది. హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షానికి హుస్సేన్‌సాగర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. హుస్సేన్‌సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 514 అడుగులు కాగా ప్రస్తుతం వరద నీరు 513 అడుగులకు చేరింది.

హైదరాబాద్‌లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి చాలా ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. చాలా చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఉవ్వడంతో జనం నరకం అనుభవించారు. హైదరాబాద్,సికింద్రాబాద్‌లోని చాలా కాలనీలోకి భారీగా వరదనీరు వచ్చి చేరటంతో జనం తీవ్ర ఇబ్బందికి గురయ్యారు.

**జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో వర్షం ఎఫెక్ట్**

కాగా, జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. శుక్రవారం కురిసిన వర్షానికి హెడ్ ఆఫీస్‌లోని సీలింగ్ నుంచి పిల్లర్ ద్వారా గ్రౌండ్ ఫ్లోర్‌కి వర్షపు నీరు వచ్చి చేరింది. ఇటీవల కురిసిన వర్షానికి హెడ్ ఆఫీస్ సెల్లార్‌లో వర్షపు నీరు చేరి కంప్యూటర్లు పాడయ్యాయి, గురువారం కురిసిన వర్షానికి పిల్లర్ ద్వారా వర్షపు నీరు గ్రౌండ్ ఫ్లోర్‌కి చేరుకుంది. దీంతో ఆటు ఉద్యోగులు,ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు.

**జలదిగ్బంధంలో కొంగరకలాన్... రాకపోకలు బంద్**

హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న కొంగరకలాన్ నీటిలో మునిగిపోయింది. కొంగరకలాన్‌కు రాకపోకలు బందయ్యాయి. అక్కడ కాలనీలన్నీ చెరువులను తలపించాయి. వర్షానికి ఇండ్లలోకి 3 ఫీట్ల మేరకు వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. బియ్యం. కూరగాయలు, బట్టలు,ఇతర సామాగ్రి తడిసిపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కరెంటు సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

**వారం - వర్జ్యం**

19-07-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
నవమి మ.2.41
భరణి రా.12.36
వర్జ్యం : ఉ.11.44-1.13
దు.తె.5.45-7.25
రాహుకాలం : ఉ.9.00-10.30

**వార్తాఫలం**

**మేషం :** శ్రమానంతరం పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగులకు విధి నిర్వాహణలో ఆటంకాలు ఎదురైన చికాకులు పెడతాయి.

**వృషభం :** వివాహ, ఉద్యోగ యత్నాలు నిదానంగా పూర్తిచేస్తారు. చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మిథునం:** చాకచక్యంగా పట్టుదలతో కొన్ని కార్యక్రమాలు చివరికి పూర్తి చేస్తారు.

**కర్కాటకం :** ఎంత శ్రమించినా ఫలితం దక్కదు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు, చికాకు పరుస్తాయి.

**సింహం:** ముఖ్యవిషయాలలో పెద్దల సలహాలు తీసుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు.

**కన్య:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి.

**తుల :** శుభవార్తలు అందుకొంటారు. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కొంటారు.

**వృశ్చికం:** నూతన పెట్టుబడుల విషయాలలో తొందరపాటు వద్దు. స్థిరాస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**ధనుస్సు:** ఉద్యోగ, వివాహ యత్నాలు మందకొడిగా సాగుతాయి. ఇంటా బయటా ఒత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి.

**మకరం:** ఆరోగ్య సమస్యలు వేధిస్తాయి. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా వుంటాయి.

**కుంభం:** చర్చగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు. వ్యవహారాలలో ఆటంకాలు చికాకు పరుస్తాయి.

**మీనం:** ఇతరుల విషయాలలో జోక్యం తగదు. సంతానం నుండి కీలక సమాచారం అందుకొంటారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బలహీనవర్గాలపేరిట ఆర్జేడి, కాంగ్రెస్ రాజకీయాలు!

## బీహార్ ఎన్నికల ప్రచారంలో మోడీ ఘాటు వ్యాఖ్యలు

**పాట్నా,జూలై 18:** ప్రధాని మోడీ మరోసారి కాంగ్రెస్, ఆర్జేడీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు పేదలు, బలహీన వర్గాల పేరిట రాజకీయాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. పేదల నుంచి భూములు తీసుకున్నా ఇప్పటికీ వారికీ ఉద్యోగాలు ఇవ్వాలనే విషయాన్ని పట్టించుకోవట్లేదని ఆరోపించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో మోడీ ఎన్నికల ప్రచారాన్ని షురూచేసారు. యూపీఏ పాలనలో బీహార్‌పై ప్రతీకార రాజకీయాలు చేశారని విమర్శించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఆయన, మోతీహారిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఎన్నికల నేపథ్యంలో బనాయేంగే నయా బీహార్, ఫిర్ ఏక్ బార్ ఎన్డీఏ సర్కార్ అనే కొత్త నినాదాన్ని ఇచ్చి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. కేంద్రంలో కాంగ్రెస్, ఆర్‌జేడీతో కూడిన యూపీఏ ప్రభుత్వం ఉన్న 10ఏళ్ల కాలంలో బీహార్‌కు కేవలం రూ.2లక్షలకోట్లు మాత్రమే వచ్చాయి. ఇక్కడి నీతీశ్ కుమార్ ప్రభుత్వంపై ప్రతీకారం తీర్చుకున్నారు. అదే 2014లో నాకు కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఇచ్చారు. కానీ నేను అధికారంలోకి వచ్చాకా ఈ ప్రతీకార రాజకీయాలకు ముగింపు పలికాను.

గత 10ఏళ్ల ఎన్డీఏ పాలనలో బీహార్ అభివృద్ధికి అనేక నిధులు కేటాయించాను. అంతకుముందు ఎన్నడూ లేని విధంగా బీహార్ అభివృద్ధి చెందింది. బీహార్ అభివృద్ధి చెందింతే దేశం కూడా ప్రగతి పథంలో నడుస్తుంది. అయితే, ఇక్కడి యువతకు ఉపాధి కల్పించినప్పుడే బీహార్ అభివృద్ధి చెందుతుందని ప్రధానిమోడీ అన్నారు. ఇప్పటి తరానికి రెండు దశాబ్దాల పాటు కాంగ్రెస్, ఆర్జేడీ పాలనలో బీహార్ ఎంత వెనుకబడిందనే విషయాలు తెలియాలని ప్రధాని మోదీ అభిప్రాయ పడ్డారు. పేదలకు సంబంధించిన ధనం వారికి చేరడం అసాధ్యంగా మారిందని గుర్తు చేశారు. ఆనాటి పాలనలో పేదల నుంచి నిధులను ఎలా దోచుకోవాలనే ఆలోచన ఉండేదని ఆరోపించారు.



శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోల్ సిఎం సభకు అసంఖ్యాకంగా హాజరైన ప్రజలు

# యాదగిరి దాకా ఎంఎంటిఎస్

>> పారు. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కి ప్రధాని మోడీ భూమి పూజ చేశారని.. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ 60 శాతం పనులు పూర్తి అయ్యాయని అన్నారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రేపు (శనివారం) రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనుల పురోగతిని పరిశీలిస్తారని చెప్పారు. రైలు ఇంజన్, కోచ్, వ్యాగన్స్ ఉత్పత్తి అయ్యేలా ప్లాన్ చేస్తున్నామని.. ముందుగా రైలు ఇంజన్ తయారీ చేయాలని నిర్ణయించామని కేంద్రమంత్రి అన్నారు.రాదు అనుకున్న పరిశ్రమను మోడీ తెలంగాణకు ఇచ్చారని చెప్పుకొచ్చారు. వరంగల్‌కు మెగా టెక్స్ టైల్ పార్క్ తీసుకురావడం జరిగిందన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.పాలకులు మాత్రం హైదరాబాద్ చుట్టే ఆలోచన చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. వరంగల్ విమానాశ్రయానికి భూమి సేకరించి ఇవ్వాలని కెసిఆర్‌కు అనేక లేఖలు రాసినట్లు తెలిపారు. కెసిఆర్ రాళ్లు వేయడం, విమర్శించడం తప్ప.. భూమి సేకరించి ఇవ్వలేదని విమర్శించారు. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ వచ్చేయేడాది ఉత్పత్తి ప్రారంభించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వరంగల్‌లో ఆధునికమైన కోచ్‌లు తయారు చేసే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఇక్కడ నివసించే రాజస్థాన్ ప్రజలు రైలు కావాలని కోరుతున్నారని.. శనివారం రాజస్థాన్‌కు ట్రైన్ ప్రారంభిస్తున్నామన్నారు. ఎంఎంటీఎస్ రెండో పేజ్ రాష్ట్రప్రభుత్వం ఒప్పందంచేసుకుందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందానికి కట్టుబడి లేదన్నారు.

# ఎప్ సెట్‌లో 77,561 సీట్లు భర్తీ

>> మంది స్లాట్ బుక్ చేసుకున్నారు. వారికి ఈ నెల 8 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించగా.. 95,256 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరయ్యారు. వారిలో 94,354 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారు మొత్తం 56,63,308 వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. రాష్ట్రంలో 83,054 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉండగా .. వాటిలో మొదటి విడతలో 77,561 సీట్లను కేటాయించారు. మరో 5493 సీట్లు ఖాళీగా ఉన్నాయి. సీట్ల కేటాయింపులో ఒక గవర్నమెంట్ కాలేజీలో 195 సీట్లు ఉండగా..94 సీట్లను(48.20శాతం) కేటాయించారు. 20 యూనివర్సిటీ కాలేజీల్లో 6108 సీట్లు అందుబాటులో ఉండగావాటిలో 5151 సీట్లను(84.30శాతం) కేటాయించారు. 2 ప్రైవేటు యూనివర్సిటీల్లో 1367 సీట్లు ఉంటే వాటిలో 1357 సీట్లను(99.20శాతం) కేటాయించారు. 149 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 75,384 సీట్లు అందుబాటులో ఉండగా 70,959 సీట్లను(94.10శాతం) కేటాయించారు. మొత్తం 172 కాలేజీల్లో 83,054 సీట్లు అందుబాటులో ఉంటే వాటిలో 77,561 సీట్లను (93.30శాతం) కేటాయించారు. మరో 5493 సీట్లు ఖాళీగా ఉన్నాయి. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 16,793 మందికి సీట్లు కేటాయించ లేదని అధికారులు తెలిపారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 6083 మందికి సీట్లను కేటాయించారు. 82 కాలేజీల్లో 100 శాతం సీట్లను కేటాయించారు. వాటిలో 6 యూనివర్సిటీ కాలేజీలు ఉండగా.. 76 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. జూన్ 28నుంచే ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నెల 6 నుంచి ప్రారంభమైన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 10 వరకు కొనసాగింది. మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు నేటి(జులై18) నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని శ్రీదేవసేన తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 31 నుంచి ఆగస్టు 2 వరకు ఆయా కాలేజీల్లో నేరుగా చేరాల్సి ఉంటుందని ప్రకటించారు.

**బ్రాంచ్‌ల వారీగా సీట్లను పరిశీలిస్తే..**

రాష్ట్రంలో ఈ ఏడాది ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో అన్ని బ్రాంచ్‌ల్లో కలిపి కన్వీనర్ కోటాలో 80, 054 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటి సీట్లు 58,742 సీట్లు ఉంటే వాటిలో మొదటి విడతలో 57,042 సీట్లను కేటాయించారు. మరో 1700 సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో 97.11 శాతం సీట్లు కేటాయించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 16,112 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 14,054 సీట్లను కేటాయించారు. మరో 2058 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో 87.23 శాతం సీట్లను మొదటి విడతలోనే కేటాయించారు. కోర్ ఇంజనీరింగ్ కోర్సులైన సివిల్ అండ్ మెకానికల్ సీట్లకి సంబంధించి 7100 సీట్లు అందుబాటులో ఉంటే .. అందులో 5632 సీట్లను మొదటి విడతలో కేటాయించగా.. మరో 1468 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో 79.32 శాతం సీట్లను కేటాయించారు. ఇతర ఇంజనీరింగ్ కోర్సులకి సంబంధించి 1100 సీట్లు అందుబాటులో ఉంటే.. వాటిలో 833 సీట్లను కేటాయించగా ఇంకా 267 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో 93.39 శాతం సీట్లను కేటాయించారు. మొత్తం కన్వీనర్ కోటాలో 83,054 సీట్లకు గానూ 77,561 సీట్లను(93.39 శాతం) మొదటి విడతలోనే కేటాయించారు.

**కేటగిరీ వారీగా సీట్ల కేటాయింపు..**

ఓసీలో 8020 మంది బాలురు, 7450 మంది బాలికలకి సీట్లను కేటాయించారు. బిసి-ఏలో 3096 మంది బాలురు, 2768 బాలికలు, బిసి-బిలో 8301 మంది బాలురు, 7596 మంది బాలికలు, బిసి-సిలో 226 మంది బాలురు, 140 మంది బాలికలు, బిసి-డిలో 7002 మంది బాలురు, 6476 మంది బాలికలు, బిసి-ఈలో 3811 మంది బాలురు, 1671 మంది బాలికలు ఉన్నారు. ఎస్సీ-1లో 250 మంది బాలురు, 144 మంది బాలికలు, ఎస్సీ-2లో 4035 మంది బాలురు, 3807 మంది బాలికలు, ఎస్సీ-3లో 2482 మంది బాలురు, 2365 మంది బాలికలు, ఎస్టీలో 4701 మంది బాలురు ఉండగా.. 3220 మంది బాలికలు ఉన్నారు. మొత్తం సీట్లు పొందిన వారిలో బాలురు 41,924 మంది(54.10 శాతం) ఉండగా.. బాలికలు 35,637 మంది(45.90శాతం) ఉన్నారు.

# మావోయిస్టుల మృతి

>> రైఫిల్, ఎస్ఎల్ఆర్ రైఫిల్‌తో సహా భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలు, రోజువారీ వినియోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నందున, ఆపరేషన్ అనంతరం పూర్తి సమాచారం అందించనున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

# కాంగ్రెస్ అంటే వ్యవసాయం, కరెంటు

>> ఆనాడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశామని గుర్తుచేశారు. ఆనాడు కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్ తప్పులు చేసి వాటిని ఇప్పుడు తమపై రుద్దాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. రైతులు పండించిన పంటకు పెట్టుబడిగా రైతు భరోసా, రూ.9 వేల కోట్లు ఇచ్చామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో సన్నవడ్లకు బోనస్ ఇచ్చామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.ప్రజలకు అంతరాయం లేకుండా కరెంట్ అందిస్తున్నట్లు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. జెన్కో అధికారులతో సమీ నల్గొండ జిల్లా, నాగార్జునసాగర్ జెన్కో పవర్ హౌస్‌లో రాష్ట్రంలోని హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై పై సమీక్ష నిర్వహించారు .ముందుగా అధికారులు అన్ని అధికారులు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఆయా పవర్ ప్రాజెక్టుల వారిగా ప్రస్తుత పరిస్థితిని వివరించారు.అనంతరం ఉప ముఖ్యమంత్రి అధికారులకు వివిధ అంశాలపై దిశ నిర్దేశం చేస్తూ... అన్ని హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్ట్ లలోని అన్ని యూనిట్లు వినియోగంలో తీసుకురావాలన్నారు. నిర్దేశించిన సమయం ప్రకారం వాటిని పూర్తి చేయాలన్నారు.పవర్ ప్రాజెక్టు యూనిట్లు ఆలస్యం కాకుండా చూసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో నిరక్ష ్యం ఉండవద్దని, అన్ని ప్రాజెక్టుల పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షి ంచేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని, ఇందుకొక క్యాలెండర్ ను రూపొందించాలని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో దాని ప్రకారం ప్రతి వారం సమీక్షి ంచాలని, ముందు నుండే సమీక్షలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి సంవత్సరం పవర్‌కు డిమాండ్ పెరుగుతున్నదని, సంవత్సర కాలంలోనే 2000 మెగావాట్ల పవర్ డిమాండ్ పెరిగిందని, పెరుగుతున్న పవర్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని పవర్‌ను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచంలో వస్తున్న నూతన సాంకేతికతపై సిబ్బందికి అప్డేట్ అయ్యే విధంగా శిక్షణ ఇవ్వాలని, దీనిపై అధ్యయనం చేసి పెరుగుతున్న పవర్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని అప్డేట్ అయ్యేలా చూడాలన్నారు. ఇందుకు పీరియాడికల్ సమీక్షలు నిర్వహించాలని, రాష్ట్రంలో ఉన్న జెన్కో సిబ్బంది సీఎండి మొదలుకొని కిందిస్థాయి వరకు కొత్త టెక్నాలజీ పై మూడు రోజులపాటు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గడచిన సంవత్సరం కాలంలో జెన్కో సిబ్బంది ఒక పద్ధతి ప్రకారం పనిచేయడం వల్ల ఎలాంటి బ్రేక్ డౌన్లు, విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ ను అందించగలిగామని, ఇందుకుగాను ఆయన శాఖలోని అధికారులు, సిబ్బందిని అభినందించారు. విద్యుత్ ఉత్పత్తి సరఫరాలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిదీ విద్యుత్ పైన ఆధారపడి ఉన్నదని, రాష్ట్ర స్థూల ఉత్పత్తి విద్యుత్ పైన ఆధారపడిందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జెన్కో సిఎండి డాక్టర్ హరీష్ ఆయా ప్రాజెక్టులపై వివరాలను తెలియజేశారు.



## హస్తం గూటికి జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్

### అదేబాటలో మరో ఇద్దరు కౌన్సిలర్లు

### కండువా కప్పి ఆహ్వానించిన సిఎం రేవంత్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 18, ప్రభాతవార్త:** పాలమూరు రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, మరో ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆధ్వర్యంలో వారంతా హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి ఇంటికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లకు సభ్యత్వాలను అంద జేసి, కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ అభివృద్ధికి చైర్‌పర్సన్, కౌన్సిలర్లు పార్టీలో చేరడం శుభపరిణామని సిఎం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పారదర్శకత, పరిపాలన దక్షత పట్ల నమ్మకం కుదిరి పార్టీ మారేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు వెల్లడించారు.

## వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

### జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు పీట్ల శ్రీధర్

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో లక్షలాది మంది వడ్డెరలు ఉన్నారని.. వారిని ఎస్టి జాబితాలో చేర్చాలని జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పీట్ల శ్రీధర్ డిమాండ్ చేశారు. జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులుగా పీట్ల శ్రీధర్‌ని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు జాతీయ ప్రధాన కార్యదర్శి కుంచాల ఏడుకొండలు, జాతీయ గౌరవా ధ్యక్షులు రూపం లోకనాథం తెలి పారు. నూతన జాతీయ అధ్యక్షు లుగా ఎన్నికైన పీట్ల శ్రీధర్ మాట్లా డుతూ.. వడ్డెరలను ఎస్టి జాబి తాలో చేర్చాలని.. ఇందు కోసం జాతీయ స్థాయిలో పోరాటం చేసి సాధిస్తామన్నారు.



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మేకల గొర్రెలు

## హైదరాబాద్ శివార్లలో మేకలు, గొర్రెలు అనుమానాస్పద మృతి

**హైదరాబాద్ (సరూర్‌నగర్), జూలై 18, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరానికి ఆనుకొని ఉన్న బాలాపూర్ సమీపంలోని మల్లాపూర్‌లో ఘోరం జరిగింది. చుట్టూ ప్రహరీగోడ గల దొడ్డిలోనున్న గొర్రెలు, మేకల మందపై అర్ధరాత్రి దాడి జరిగింది. దీంతో తీవ్ర గాయాలతో రక్తమోడుతూ కొట్టుమిట్టాడిన మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. మొత్తం 18 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. అనుమానాస్పద స్థితిలో నేలకొరగడంతో మేకలు, గొర్రెల పెంపకందారుడు పోలీసులను ఆశ్రయించాడు. ఇటీవల రెండు చిరుత పులులు సంచరించినట్లు వైరల్ అయిన ఆర్‌సిఐ ఉన్న ప్రాంతం సమీపంలోని మల్లాపూర్‌లో ఈ ఉదంతం జరగడం కలకలం రేగింది. ఇది చిరుతల పనేనా అనే సందేహాలు కూడా పలువురిలో వ్యక్తమైనా పోలీసులు గానీ, అటవీ శాఖ అధికారులు గాని నిర్ధారించలేదు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. మల్లాపూర్ నివాసి మేకల బాబుకు స్థానికంగా గొర్రెల, మేకల దొడ్డి ఉంది. అయితే గురువారం గ్రామంలో బోనాల పండుగ ఉండడంతో రోజూ మాదిరిగానే వాటిని ప్రహరీగోడ గేటు ఉన్న దొడ్డిలోనే ఉంచి రాత్రి ఇంటికి వెళ్ళాడు. శుక్రవారం ఉదయం వచ్చి చూసేసరికి 18 గొర్రెలు, మేకలు మెడ, గొంతు, కడుపు భాగాల్లో గాయాలతో మృతి చెంది ఉండడాన్ని గమనించి హతాశుడయ్యాడు. చిరుతల సంచారం ఉన్నట్లు వైరల్ అయిన ఆర్‌సిఐకు వెళ్లే దారిలోనే మల్లాపూర్ ఉండడంతో ఇది చిరుతల పనేనని కొందరు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి వచ్చి విచారణ జరిపారు. అనుమానాస్పద స్థితిలో మూగ జీవాలు మృతి చెందడంతో నిర్ధారించడానికి పోలీసులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంఖాల్ అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాజేందర్‌రెడ్డి విచ్చేసి పరిశీలన జరిపారు. సమగ్ర విచారణ జరిపిన ఆయన ఇది చిరుతల పనికాదని తేల్చి చెప్పారు.

## సామాజిక న్యాయాన్ని మరిచిన బిఆర్ఎస్

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ సామాజిక న్యాయాన్ని మరిచిపోయిందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సిఎల్‌పిలో శుక్రవారం సామేల్‌విలేఖరులతో మాట్లాడుతూ పోతిరెడ్డిపాడుకు పొక్క పెట్టినప్పుడు నువ్వు, నీ బావ యాడ పడుకున్నరని నిలదీశారు. తెలంగాణ ప్రజలు నైజాం నే ఉరికించారు మీరెంత అని ఆయన కెటిఆర్‌ను హెచ్చరించారు. ఉద్యమం పేరుతో కల్వకుంట్ల కుటుంబం కొంపలార్చారని ఆవేదన చెందారు. అవినీతి తోనే కుల్వకుంట్ల కుటుంబాన్ని చిత్తు చిత్తు గా ఓడించి ఫామ్ హౌస్ లో కూర్చోపెట్టారని అన్నారు. వానలు పడొద్దని బిఆర్ఎస్ నాయకులు అంటున్నారని బిఆర్ఎస్ నేతలు అసలు మనుషులేనా..? అని ప్రశ్నించారువచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బతిఆర్ఎస్‌కు గుండు సున్నా వస్తుందని జోస్యంచెప్పారు. చెప్పులు లేని బిఆర్ఎస్ నాయకులు కోట్లు సంపాదించారని బిఆర్ఎస్ లో దళిత నాయకులను హీనాతి హీనంగా చూశారని గుర్తుచేశారు. మందక్రిష్ణను జైలులో పెట్టారనిఆరోపించారు. దళితుల గురించి మాట్లాడే అర్హత కేసీఆర్ లేదు. కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కాంలో జైలుకు ఎందుకు వెళ్లారో కెటిఆర్ సమాధానం చెప్పాలని నిలదీశారు.

మేడిగడ్డ ఎందుకు కూలిపోయిందో చెప్పు ,కాళేశ్వరం ఇంజినీర్లు జైలుకు వెళ్లడానికి కారణం మీరు కాదా..?అని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావొద్దని కల్వకుంట్ల కుటుంబం కోరుకుంది.. కేసీఆర్ కు అసలోడు రేవంత్ రెడ్డి దొరికాడు ఆయన పని పడతాడనిఅన్నారు. తెలంగాణ అంటే మీ సొంతం అనుకుంటున్నారా అని ఆయనన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు మిమ్మల్ని క్షమించరని చెప్పారు. మున్సిపల్ శాఖకు కేటీఆర్ మురికిపట్టించావు కెటిఆర్ నీ కథ ముగిసిందని అన్నారు.

## పరుగెత్తే గుర్రం సిఎం రేవంత్‌రెడ్డిని ఆపాలని బిఆర్ఎస్ కుట్రలు

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా మార్చ డానికి మా సిఎం ప్రయత్నం చేస్తేంటే, పరుగెత్తే గుర్రం సిఎం రేవంత్ రెడ్డిని ఆపాలని బిఆర్ఎస్ కుట్రలు చేస్తోందని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ఆరోపించారు.

శుక్రవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ ఫామ్ హౌస్ లో కెసిఆర్ గెస్ట్ హౌస్ లో కెటిఆర్ కూర్చుని 100 సీట్లు వస్తాయని పగటి కలలు కంటున్నారనిఇప్పటికే బిఆర్ఎస్ కు రెండు గుండు సున్నాలు పార్లమెంటు ఎన్నికల్లో వచ్చాయని ఆయన ఎద్దేవా చేశారు. శాసనసభ,పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు బిఆర్ఎస్ ను ఇప్పటికే రీ కాల్ చేశారని భవిష్యత్తులో జరిగే ఎన్నికలలో రీమూవ్ చేస్తారని జోస్యం చెప్పారు.

# చెరువులు, నాలాల పరిరక్షణకు పటిష్ట చర్యలు

### బతుకమ్మకుంటను నాలుగు నెలల్లో పూర్తిచేశాం

### మిగతా చెరువులకూ పునరుజ్జీవం కల్పిస్తాం

### హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్



బతుకమ్మకుంట వద్ద జరిగిన వార్షిక వేడుకల్లో పాల్గొన్న కమిషనర్ రంగనాథ్, కలెక్టర్ హరిచందన దాసరి, మాజీ ఎంపి. విహెచ్ తదితరులు

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** మహానగరంలో నాళాలు, చెరువులకు పునరుజ్జీవం కల్పిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట్ తిలక్‌నగర్‌లో హైడ్రా ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బతుకమ్మకుంట వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, మాజీ రాజ్యసభసభ్యుడు వి హనుమంతరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లా డుతూ హైదరా బాద్ మహా నగరంలో ఆక్రమణకు గురైన చెరువులు, నాళాలను ఇప్ప టికే గుర్తించడం జరిగిందని, వాటన్నింటికి కూడా పునరుజ్జీవం కల్పిస్తామ న్నారు. డంపింగ్ యార్డ్‌గా ఉన్న బతుకమ్మ చెరువుకు నాలుగు నెలల్లో పునరుజ్జీవం కల్పిం చడం జరిగిదన్నారు. అదే విధంగా నగరంలో పేదల ఇళ్ళు, నివాస గృహాలను కాకుండా ఆక్రమ ణకు గురైన చెరువులు నాళాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని తెలిపారు. జూలై 19న రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ఆఫీస్‌ను ఏర్పాటు చేయటంతో ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా బతుకమ్మ చెరువు వద్ద ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, నాళాలు కబ్జాలు చేయటం నేరమని చెరువుల ఆక్రమణ వల్ల నీటినిల్వలు తగ్గి భవిష్యత్ తరాలకు ఒక శాపంగా మారే అవకాశం ఎంతో ఉందని కావున పర్యావరణ పరిరక్షణతో పాటు, కాలుష్యాన్ని నివారించుటకు ప్రకృతి ప్రసాదించిన చెరువులను కాపాడు కుందాం అని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ బతుకమ్మ కుంట వద్ద గతంలో ఇక్కడ ఒక డంపింగ్ యార్డ్ ఉండేదని అట్టి డంపింగ్ యార్డ్ తొలగించి ఒక అద్భుతమైన చెరువు ను చూపించడం అందరికీ ఉపయోగపడే విధంగా నాలుగు నెలల్లో పూర్తి చేయటం గొప్ప విషయ మన్నారు. నీటి నిల్వలు పెంచుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు ఇలాంటి చెరువులు ఎంత గానో ఉపయోగపడతాయని తెలిపారు. మాజీ ఎంపి వి. హనుమంతరావు మాట్లా డుతూ 1960లో బతు కమ్మకుంట 14 ఎకరాల్లో ఉండేదని రానురాను ఆక్రమదారులు చెరువును కబ్జా చేయడంతో ప్రస్తుతం ఐదు ఎకరాల వరకు ఉంద న్నారు. సిఎం రేవంత్‌రెడ్డి దూరదృష్టితో ఆక్రమ ణకు గురైన చెరువులు నాలాలకు తిరిగి పునరుజ్జీవం కల్పించే విధంగా హైడ్రాను ఏర్పాటు చేసి గొప్ప కార్యక్రమాలు చేపట్టటం జరుగు తుం దని అన్నారు. బతుకమ్మకుంట పునరుజ్జీ వంతో మిగిలిన చెరువులు కూడా ఇదే తరహాలో చేపట్టాలని ఆయన అన్నారు. తదుపరి నగరంలో చెరువుల రక్షణపై ప్రతిజ్ఞతోపాటు పాఠశాల విద్యార్థులు, ప్రాంతవాసులు, హైడ్రాధికారులతో కలసి చెరువుల రక్షణ కోసం హైడ్రా, పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత, భావితరాలకు హైడ్రా, బంగారు భవిష్యత్తుకు హైడ్రా అనే నినాదంతో మానవహారం నిర్వహించారు.

# హైదరాబాద్.. ఓఆర్ఆర్ లోపల కల్లు దుకాణాలు మూత

### మందుబాబులకు షాక్

### త్వరలో ప్రభుత్వ నిర్ణయం

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో కల్తీ కల్లు కలకలం రేపింది. కూకట్‌పల్లిలో పది మంది మృతి చెందడంతో రేవంత్ సర్కార్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కల్తీ కల్లు దుకాణాలను మూసివేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 454 కల్లు దుకాణాలను ఎత్తివేయాలని నిర్ణయించినట్లు సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. కల్తీ కల్లు నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ వివరాలు.. కల్తీ కల్లు.. హైదరాబాద్ నగరంలో తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. కల్తీ కల్లు తాగి నగరంలోని కూకట్‌పల్లిలో 10 మంది చనిపోయారు.

దీంతో రేవంత్ సర్కార్ కల్తీ కల్లు నివారణకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కల్తీ కల్లు దుకాణాలను ఎత్తి వేయాలని సర్కార్ భావిస్తోందని సమాచారం. ఈమేరకు ఎక్సైజ్ శాఖ నుంచి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు ఓఆర్ఆర్ లోపల మొత్తం ఎన్ని కల్లు దుకాణాలున్నాయి.. వీటిని బ్యాన్ చేస్తే కల్తీ కల్లు నివారణ అవుతుందా అనే అంశాలపై అధికారులతో చర్చించినట్లుగా సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందంటున్నారు అధికారులు. కల్తీ కల్లు నివారణ చర్యల్లో భాగంగా రేవంత్ సర్కార్.. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలతో పాటుగా.. రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని సరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, షాద్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలోని కల్లు దుకాణాలను క్లోజ్ చేసేందుకు నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది.

కొన్ని రోజుల క్రితం కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో 10 మంది చనిపోవడంతో.. ప్రభుత్వం కల్తీ కల్లు నివారణ కోసం కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తోంది గతంలో ఇలానే కల్తీ కల్లు వల్ల ప్రాణాలు పోవడంతో.. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లోని కల్లు దుకాణాలను మూసి వేయించారు. 21 సంవత్సరాల క్రితం అనగా 2004లో ఈ సంఘటన జరిగింది. అయితే 2014 తెలంగాణ ఉమ్మడి ఏపీ నుంచి విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత.. మళ్లీ కల్లు దుకాణాలు తెరిచారు. ఓఆర్ఆర్ లోపల టాడీ కోఆపరేటివ్ సొసైటీలు కూడా ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 390 సంఘాల కింద 454 కల్లు దుకాణాలు ఉన్నాయని తాజాగా ఎక్సైజ్ శాఖ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. వీటిని పరిశీలించిన తర్వాత.. ఓఆర్ఆర్ లోపల ఉన్న కల్లు దుకాణాలు మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అలానే వీటితో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ మినహా మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో ఉన్న టీఎఫ్‌టీ (టీ ఫర్ ట్రేడ్) లైసెన్స్‌లు కూడా రద్దు అయ్యేందుకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని కల్లు దుకాణాలను కూడా మూసి వేస్తారని సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందంటున్నారు అధికారులు.

# గంజాయి నిర్మూలన కోసం సాగును సమూలంగా నాశనం చేశాం

### విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

### యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: సినీ నటుడు సుమన్





**బొబ్బిలి (విజయనగరం జిల్లా) జులై 18 ప్రభాతవార్త** మాదక ద్రవ్యాలను నియంత్రించాలనే లక్ష్యంతో గంజాయి పంటను సాగు చేయకుండా చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పేర్కొన్నారు. ఈ క్రమంలో గంజాయి సాగును సమూలంగా నాశనం చేస్తున్నామని ఆయనన్నారు. పోలీసు శాఖ బొబ్బిలిలో శుక్రవారం నిర్వహించిన "సంకల్పం" కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరి శిఖర ప్రాంతాల్లో 15,000 ఎకరాల్లో గంజాయి పంటను సాగు చేస్తున్నట్లుగా డ్రోన్స్ సహాయంతో గుర్తించి, పంటను ధ్వంసం చేసామన్నారు. పోలీసుశాఖ చేపడుతున్న నియంత్రణ చర్యల ఫలితంగా నేడు 93 ఎకరాలకే గంజాయి సాగును పరిమిత మైందన్నారు. గంజాయి వ్యాపారాలు చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు చేపడుతున్నామని, వారు సంపాదించిన అక్రమ ఆస్తులను కూడా సీజ్ చేసి, ప్రభుత్వ పరం చేస్తున్నామన్నారు. విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి వ్యాపారాలతో అక్రమ ఆస్తులను కూడబెట్టిన 8 మంది నిందితులకు చెందిన 9.20 కోట్ల ఆస్తులను ఇప్పటి వరకు సీజ్ చేసామన్నారు. మాదక ద్రవ్యాల అలవాటుకు యువత దూరంగా ఉండాలని, బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని డిఐజి గోపీనాథ్ జట్టి యువతను కోరారు. సినీ హీరో సుమన్ మాట్లాడుతూ తాను సినిమాల్లో మంచి స్థితిలో ఉన్నపుడు తన తలరాత కారణంగా జీవితంలో అగాధంలో కూరుకొనిపోయానన్నారు. ఆ సమయంలో తాను కూడా మద్యానికి అలవాటుపడి, ఒక దశలో ఆత్మహత్య చేసుకోవాలని కూడా అనుకున్నానన్నారు. మెల్లగా చెడు అలవాట్లు నుండి బయటపడి, అభిమానుల ఆశీస్సులతో మంచి నటుడిగా నిలదొక్కుకోగలిగానన్నారు. వ్యసనాలకు బానిసలైతే కుటుంబ సభ్యులకు భారంగా మిగులుతామన్నారు.

# బిఆర్ఎస్ నాయకుల రైతు మహాధర్నా

### రైతుల పట్ల వివక్షత చూపిస్తే సహించే ప్రసక్తే లేదు

### రైతులకు కావలసిన ఎరువులను తక్షణమే సరఫరా చేయాలి

### మాజీ శాసనసభ్యుడు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**మక్తల్ టౌన్, జూలై 18, ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు రైతు పక్షాన మహాధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. జాతీయ రహదారిపై గంటసేపు కొనసాగిన మహాధర్నా రైతుల అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ముందు చూపుతో మన ప్రాంతంలో రుద్ర సముద్రం, గ్రామం గోదాంలు అందుబాటులో ఉన్నా వాటిని వినియోగించకుండా ఎరువుల కొరత కృత్రిమంగా సృష్టించి ముందుచూపు లేని నాయకత్వం కాంగ్రెస్ పాలనకే దక్కుతుందని విమర్శించారు. గంటసేపు సాగిన మహాధర్నాలో రైతులు ఎక్కడ కూడా సంతోషంగా లేరన్నారు. కాలువల్లో నీళ్ల వదిలి చెరువు నింపక ఉన్న కాలమంతా జూరాల నుండి కిందికి వదిలి ఆంధ్ర ప్రాంతానికి తరలించే కుట్రలో ఇదొక భాగమని తెలిపారు గత పది రోజుల నుంచి యూరియాలేక రైతులు నానా ఇబ్బందులు పడుతూ క్యూ లైన్ లో పాసుబుక్కులు ఆధార్ కార్డులు తమ నిరాశనలను తెలియజేసిన ఈ ప్రభుత్వానికి ఏమాత్రం కనిపించడం లేదన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో కొమ్ముకై రైతులను కష్టాలపాలు చేయడం జరుగుతుందని ఇది తెలంగాణలో సాధ్యం కాదనే విషయాన్ని ఆయన గుర్తించుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ ప్రభుత్వము రైతులకు కావలసిన ప్రతి విషయంలో ముందుచూపుతో పనిచేసిందని గడచిన పది సంవత్సరాలలో రైతులు ఎక్కడ రోడ్డుపై కూర్చోలేదన్నారు. అధికారులు కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు గుమ్మకై రైతులకు రావాల్సిన యురయ ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారని రైతులకు ఏ కష్టమొచ్చినా నియోజకవర్గంలో తను రైతు పక్షాన మండిపడ్డారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్వహించే విధానంలో ఒక టీఎంసీ సామర్థ్యం ఉన్న భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నాలుగు టిఎంసిల నీరు ఎలా తోడేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రైతులకు కాలువల ద్వారా నీరు తీసుకెళ్తే భూమి కోల్పోయిన రైతులు పరిసర ప్రాంతాల్లో ఉన్న రైతులకు మేలు జరుగుతుందని ఇనుప పైపులను భూమిలో వేసి కొడంగల్‌కు నీరు దోచుకుని పోతామంటే ఊరుకునే ప్రసక్తే లేదని ఖండించారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులను నిలువుగా మోసం చేసిందని ఆయన ముందు ఉంటాను అనే విషయం అధికార పార్టీ నాయకులు గుర్తించుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధుల మెడలు వంచిరైతుల సమస్యల కోసం నిత్యం పోరాడుతానని చెప్పారు రైతుల పక్షాన మాట్లాడుతుంటే స్థానిక మంత్రి అజ్ఞానము చదువు ఏ మాత్రంలేని అవివేకుల తోటే ఏదో ఎదురు దాడి అంతమాత్రాన భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. మంత్రి పదవి పొందిన మీరు ఈ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం నిస్వార్ధంగా పనిచేస్తే దానికి ఎప్పటికీ మేము మద్దతు ఇస్తామని తెలిపారు చిల్లర మల్లార్ల అక్షరం జ్ఞానం లేని వాడితో మాట్లాడిస్తే నీ స్థాయి తగ్గుతుందని తెలిపారు నియోజకవర్గం ఏదైనా అభివృద్ధి సాధించిందంటే అది చిట్టెం కుటుంబం ద్వారా సాధ్యమైంది అనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు దిగత విమర్శలకు పాల్పడితే అదే స్థాయిలో తిరిగి సమాధానం చెప్పడం ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి, మక్తల్ పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్న అనుమంతు, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.ఎల్లారెడ్డి ,మహేశ్వర్ రెడ్డి ,శివరాజ్ పటేల్ మాజీ జడ్పిటిసి అరవింద సుధాకర్, జుట్ల శంకర్, అన్వర్‌హుస్సేన్, చదపురం అశోక్ గౌడ్, జుట్ల శంకర్, బండారి ఆనంద్ ,జుట్లసాగర్, మారుతి గౌడ్, సంత్ గౌడ్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సత్యరెడ్డి, శంకర్‌రెడ్డి, మహమూద్, మనన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఎస్ శ్రీలక్ష్మి పిటిషన్‌పై తీర్పు రిజర్వు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరా బాద్, జూలై 18:** ఓఎంసి కేసులో ఐఎఎస్ శ్రీలక్ష్మి పిటిషన్‌పై హై కోర్టులో శుక్రవారం విచారణ జరి గింది. సీబీఐతోపాటు శ్రీలక్ష్మి తరపున కూడా వాదనలు ముగి శాయి. దీంతో తీర్పును ధర్మాసనం రిజర్వ్ ఉంచింది. అయితే తీర్పు ఎలా ఉంటుందోనని శ్రీలక్ష్మి తరపు న్యాయ వాదుల్లో ఉత్కంఠ నెల కొంది. కాగా ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆమెపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఓఎంసీకి లీజు కేటా యించేలా శ్రీలక్ష్మి చొరవ తీసు కున్నారని సీబీఐ తరపు పీపీ శ్రీనివాస్ కపాటియా వాదనలు విని పించారు. పలు దరఖాస్తులు వచ్చినా ఓఎంసీకి లీజు వచ్చేలా శ్రీలక్ష్మి చూశారని, అందుకు సంబం ధించిన ఆధారాలు న్యాయని కోర్టు దృష్టి తీసుకెళ్లారు. శుక్రవారం ఇరు వర్గాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.



## పురుగులమందు తాగి విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

### పాఠశాలలో ప్రధానోపాధ్యాయుని మందలింపే కారణమా!?

**హుస్నాబాద్ రూరల్, జూలై 18, ప్రభాతవార్త:** పురుగుల మందు తాగి ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కలకళం రేపింది. వివరాల్లోకి వెళ్తే హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు మనోజ్, ఆనంద్ అనే విద్యార్థులు హాస్టల్‌లో వేరే విద్యార్థుల తినుబండారాలను దొంగతనంగా తిన్నారని మిగతా విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయునికి ఫిర్యాదు చేశారని అయితే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి విద్యార్థులను మందలించగా దీంతో భయాందోళనకు గురైన విద్యార్థులు పట్టణంలోని నాగారం రోడ్డులో గల మామిడి తోటలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న అధికారులు విద్యార్థులను హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రమత చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స నిమ్మత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వసతి గృహ సంక్షేమ అధికారి భద్రయ్య తెలిపారు. అయితే విద్యార్థుల ఆత్మహత్య యత్నం వెనుక ప్రధానో పాధ్యాయులు మందలింపేనా లేక ఇంకా ఏవైనా కారణాలు ఉన్నాయా అనే విషయం తెలియాల్సి ఉండగా వారి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తన్నీరు హరీశ్‌రావు! కన్నీరే మిగిలింది

### ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** తన్నీరు హరీష్ రావు మీకు కన్నీరే మిగిలిందని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం "అందుబాటులో ప్రజా ప్రతినిధులు" కార్యక్రమంలో పాల్గొననున్న రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ కార్పొరేషన్ చైర్మన్ రియాజ్‌లు పాల్గొన్నారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ తెలంగాణ హక్కుల కోసం కొట్లాడంలో సీఎం రేవంత్ రెడ్డికి సాటి ఎవరు రారు అని సూత్రీకరించారు. నీటి వాటాను తాకట్టు పెట్టింది బిఆర్ఎస్ హయంలో కదా అని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ నేతల మాదిరి ప్రభుత్వ ఆస్తులు చిల్లరగా కొల్లగొట్టం అని ఆయన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమం ధ్యేయంగా ముందుకెళ్తాం అని అన్నారు. పంచాయితీ ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీకి వచ్చే సీట్లు గుండు సున్నా అని జోస్యంచెప్పారు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బిఆర్ఎస్ పార్టీకి గాడిద గుడ్డు సీట్లు రావడం తథ్యం అని ఎద్దేవా చేశారు. డ్రగ్స్ నాటకాలు బంద్ చెయ్ అంటే డ్రగ్స్ ఆఫీసియల్ చేయమంటున్నారా? అని ఆయన ప్రశ్నించారు కేసిఆర్ ను గద్దదించి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని హరీష్ రావు మరిచిపోవడం ఆయన ఫ్రస్టేషన్ కి పరాకాష్టా అని అన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి

కల్లూరు వారి రూఢీ ప్రకటన
ఫారం-7
(చూడుము సబ్ రూల్ 1 రూల్-25, సెక్షన్ 19(1) చట్టము-30/2013)

కలెక్టర్ ఫైల్ నెం. DOC/G1/LA/0017/2022 తేది: 16.07.2025
భూసేకరణ అధికారి ఫైల్ నెం. A/224/2023 తేది: 16.07.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, ఖమ్మం గారు దిగువ నిర్దిష్ట పరిచిన ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలములోని కిష్టారం గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ.0.10 గుం.లు నిమిత్తం అనగా EPC SILO-1 బంకర్ నకు దారి కొరకు సింగరేణి వారు ఈ దిగువ చూపిన భూమి అవసరమై ఉన్నందున భావించనైనది.

కావున ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలములోని కిష్టారం గ్రామములోని ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ.0.10 గుం.లు గల భూమి యొక్క వివరములు, రూఢీ ప్రకటన (డిక్లరేషన్), ఈ క్రింద చూపిన వారి నుండి భూసేకరణ నిమిత్తం జారీ చేయనైనది.

షెడ్యూల్

గ్రామము : కిష్టారం మండలం : సత్తుపల్లి జిల్లా : ఖమ్మం

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు ఎస్.డి ఆర్ ప్రకారం | సర్వే నెంబరు ధరణి ప్రహణి ప్రకారం | భూమి రకం | [illegible] | భూసేకరణ చేయు విస్తీర్ణం | అనుభవదారు పేరు మరియు చిరునామా | హద్దులు తూ | ప | ఉ | ద | చెట్లు మరియు కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 285/3/2 | 286/అ | పట్టా | మెట్ట | 0.0014 | సంజయ్ తొట్ల తండ్రి సత్యనారాయణ | 296 | 289 | 293 | 284 | - |
| 2 | 286/11/2A | 286/అ | పట్టా | మెట్ట | 0.03 | సంజయ్ తొట్ల తండ్రి సత్యనారాయణ | 284 | 287/2 | 289 | 279 | - |
| 3 | 286/11/2B | 285/అ/అ | పట్టా | మెట్ట | 0.0684 | [illegible] | 284 | 287/2 | 289 | 279 | - |
| | మొత్తం | | | | 0.10 | | | | | | |

సెక్షన్ (15) చట్టము ప్రకారము చట్టము 30/2013 క్రింద పై భూసేకరణపై ఎటువంటి అభ్యంతరములు రాలేదు. కావున ఇట్టి తుది ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ చట్టము ప్రకారము భూ నిర్వాసితులు అవుతున్న కుటుంబీకులకు భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకుగాను తదుపరి ప్రతిపాదనలు శ్రీయుత జిల్లా కలెక్టరు, ఖమ్మం గారి ద్వారా నియమించబడిన పునరావాస మరియు పునరుపాధి అధికారి మరియు శ్రీయుత రెవెన్యూ డివిజనల్ అధికారి, కల్లూరు గారి ద్వారా జరుపబడును.

భూసేకరణ తలపెట్టిన ఆ భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును, లేనిచో స్వీకరించబడదు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయపు పనివేళలలో జిల్లా కలెక్టరు, ఖమ్మం మరియు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, కల్లూరు వారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- భూసేకరణ అధికారి/ రెవెన్యూ డివిజనల్ అధికారి, కల్లూరు
సం/- అదనపు కలెక్టర్ ఖమ్మం
సం/- జిల్లా కలెక్టర్ ఖమ్మం

DIPR.RO.NO: 400/LA/PP/Advt/Pub/2025-26



छत्तीसगढ़ राज्य ग्रामीण बैंक
(भारत सरकार, राज्य सरकार और भारतीय स्टेट बैंक का संयुक्त उपक्रम)
कॉर्पोरेट कार्यालय: प्लॉट नं.-47,सेक्टर-24, अटल नगर नवा रायपुर (छ.ग.) पिन-492018
दूरभाष नं. 0771-2288101, ई-मेल cms.ho@cgbank.in

CRGB/Staff/715/2025-26 दिनांक 18/07/2025

श्री वंकूडोथ शेखर (कार्यालय सहायक)
छ.ग.रा.ग्रामीण बैंक, शाखा- छोटे डोंगर
मकान क्र 4-68, भिल्या तांडा, तहसकोसा, जिला महबुबाबाद तेलंगाना, पिन-506105

**स्टाफ: स्वैच्छिक सेवा समाप्ति**

यह देखने में आया है कि आप पूर्व अवकाश स्वीकृति के बिना लगातार 90 दिन से अधिक की अवधि से अपने कार्य से अनुपस्थित हैं। इस संबंध में आपको प्रेषित नोटिस की ओर आपका ध्यान आकर्षित करना चाहेंगे जिसके द्वारा आपको नोटिस की दिनांक से 15 दिन के अन्दर अपने कार्य पर उपस्थित होने एवं अपनी अनुपस्थिति का संतोषप्रद स्पष्टीकरण प्रस्तुत करने हेतु सूचित किया गया था। उपर्युक्त नोटिस जारी किए जाने के पश्चात भी आप न तो अपने कार्य पर उपस्थित हुये और न ही आपके द्वारा बैंक ज्वाईन करने संबंधी किसी भी प्रकार का पत्राचार किया गया है।

2)आपको एक बार पुनः सूचित किया जाता है कि आप इस नोटिस के दिनांक से 15 दिन के अंदर अपने कार्य पर उपस्थित हों। ऐसा न कर पाने की दशा में यह मान लिया जाएगा कि इस नोटिस की अवधि समाप्त होने पर आपने स्वैच्छिक रूप से अपनी बैंक सेवा समाप्त कर ली है। ''अधिकारी और कर्मचारी सेवा विनियम 2013" की धारा 23(i) के अनुसार -*''कोई अधिकारी या कर्मचारी सक्षम प्राधिकारी की अनुमति प्राप्त किए बिना अपने कर्तव्य से अनुपस्थित नहीं होगा, न ही बीमारी या दुर्घटना की दशा में बैंक को स्वीकार्य किसी चिकित्सा व्यवसायी से किसी उचित चिकित्सीय प्रमाणपत्र को दिए बिना अनुपस्थित नहीं होगा''*

*आपके द्वारा उपरोक्त निर्देश का पालन नहीं करने पर यह माना जा सकता है कि अधिकारी और कर्मचारी सेवा विनियम 2013 की धारा 10(1) में निहित प्रावधानों का पालन किये बिना स्वेच्छा से बैंक से सेवात्याग कर दिया है।* तदनुसार आपका नाम बैंक स्थापना अभिलेख से हटा दिया जायेगा।

महाप्रबंधक (प्रशासन)

వార్త

ఏ రచయితా ప్రపంచాన్ని చిత్రీకరించలేడు.
ప్రతి రచయిత మీద ఒక్కో ప్రభావం ఉంటుంది.

-కోనార్ట్

# ఉచితానుచితాలు

ఎన్నికలు ఎప్పుడైనా వాటి పర్యవసానాలు ఎలా వున్నా పోలింగ్ నాటికి ముందు ఆరేడునెలలు అధికార పార్టీ టక్కుటమార గోకర్ణ విద్యలు, విన్యాసాలూ సర్వసాధారణం. ఉన్నట్టుండి ప్రజా ప్రయోజనాల మీద ప్రేమ పుట్టుకురావడం చాలా విచిత్రంగా అనిపిస్తుంది.ఇప్పుడు బీహార్‌లో అదే తంతు జరుగుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రజల్ని ఆకట్టుకోవడానికి ఇలాంటి ప్రత్యామ్నాయ ప్రయోజనాలను 'ఎర' వేస్తూనే ఉంటారు. ఇంతవరకు కనిపించని ప్రయోజనాలను ఇకపై అధికార పార్టీ కల్పిస్తుందంటే ప్రజల్లో ఒక విధమైన అనుమానాలు రాకపోవు.కానీ ఎవరి ప్రయత్నాలు వారుచేస్తుంటారు. నిజానికి ఉచితాలను ఉచితానుచితాలు మరచిపోయి ప్రకటించేస్తుండడం రాజకీయ పార్టీల వంతు. వాటి సాధ్యాసాధ్యాల సంగతి దేవుడెరుగు. ఎవరు ఎలాంటి ప్రయోజనం కల్పించినా స్వాగతించాల్సిందే. జనం కోసం కొండమీద కోతిని తీసుకురాలేం. అయినా ఏమో గుర్రం ఎగురావచ్చు! అనే ధోరణిలో ప్రజాహృదయాలను చూరగొనే క్రమంలో ఎలాంటి వాగ్దానాలనైనా చేయడానికి ముందుకు వస్తున్నారు. గతంలో మేనిఫెస్టోలో చెప్పిన అంశాలకు పవిత్రత ఉండేది. చెప్పిన విషయాలకు చేసిన వాగ్దానాలకు కట్టుబడి ఉండాలన్న నిబద్ధత ఉండేది. ఇప్పుడా నిబద్ధత ఏదీ లేదు. ఏ పార్టీకి ఆపార్టీ వారికి నోటికొచ్చిన హామీలిచ్చేయడం, ఆ తదుపరి వాటిని గాలికి వదిలేయడం మామూలైపోయింది. మేనిఫెస్టోలను తప్పనిసరిగా అమలు చేయాలన్న చట్టమేదీ లేనందున ఎన్నికల ప్రణాళిక గురించి పెద్దపట్టింపేమీ ఉండదు.విచక్షణ ఉండదు. సాధ్యాసాధ్యాల పరిశీలన ఉండదు. చేస్తే చేసినట్లు, చేయకుంటే చేయనట్లు. ఈ మధ్యకాలంలో మేనిఫెస్టోలు తయారు చేసేలోగానే ఎన్నికల ర్యాలీల్లోనే 'వరాల జల్లు' కురిపించేస్తున్నారు. బీహార్‌లో ప్రధాని నరేంద్రమోడీ శుక్రవారం ప్రజల్నికలిసేందుకు వచ్చారు. రోడ్డుకిరువైపులా ఉన్న జనాన్ని పలుకరించారు. వారిచ్చిన శుభస్వాగతానికి బదులుగా వారిపై అభినందనల వర్షం కురిపించారు. వస్తూ వస్తూనే బీహార్ పర్యటనలో ప్రధాని మోతీహార్‌లో రూ. 7200 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. నాలుగు అమృత్ భారత్ రైళ్లను బీహార్ రాష్ట్ర ప్రయాణికుల సౌకర్యార్థం నడపనున్నట్లు ప్రకటించారు. పాట్నాలో ఎస్‌టిపిఐ అత్యాధునిక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దర్భాంగాలో న్యూ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల రీత్యా బీహార్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు భారీ ఎత్తున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధమయ్యాయని ఈ బీహార్ సమాచారం వెల్లడిస్తోంది. ఓటర్లను ఆకట్టుకోవడం ఒక ఎత్తయితే చేతికందని ఓటర్ల ఓట్లను ఏదో ఓ సాకుతో రద్దు చేసే ప్రక్రియ మరొకటి.'ఎలక్షన్ ఆర్ ఎలిమినేషన్' విధానాన్ని ఈమధ్యకాలంలో ఎన్నో రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. ఇప్పుడు బీహార్ అదేబాటలో వెళ్తోందని తాజాగా ఎన్నికల కమిషన్ నిర్ణయాలు తేటతెల్లం చేస్తున్నాయి.దాని మీద నిరసనలు వ్యక్తమవడం ఉన్నత స్థాయి ధర్మాసనాలు జోక్యం చేసుకున్నాయికూడా. ఓటర్లను భయపెట్టి వారిలో నిరుత్సాహం కలుగచేసేప్రయత్నాలకు కోర్టులు అడ్డుపడ్డాయి. ఇక ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాల్లో రాజకీయ పార్టీలన్నీ అందెవేసిన చెయ్యే. అధికారంలో ఉన్న వాటికి ఇలాంటి పథకాల రూపకల్పన కొత్తేమీ కాస్తవీలు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ప్రధాని బీహార్ వచ్చేలోపలనే కొంతమేరకు వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు 125 యూనిట్‌లు వాడకం వరకు ఉచితమని ప్రకటించారు. అక్టోబరులో కానీ నవంబరులో కానీ బీహార్ ఎన్నికలు జరుగుతాయి. ఈ ఆగస్టు 1 నుంచి 'చౌకధరకే విద్యుత్' పథకం కింద విద్యుత్తు,ఫ్రీ, గృహవినియోగదారులు 125 యూనిట్ల వరకు ఎలాంటి బిల్లు చెల్లించనవసరం లేదు. ఆ రాష్ట్రంలోని 1కోటి 67లక్షల కుటుంబాలకు ఈ ప్రయోజనం కలుగుతుంది. సౌరగృహ విద్యుత్తు కూడా ఉచితంగా ఇంటిపైకప్పుల మీద ఏర్పాటు చేస్తారు. కుటీర్‌జ్యోతి పథకం కింద అత్యంత పేద కుటుంబాలకు సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి మెగా ప్లాన్ ఉంటుందని వాటిలో ప్రత్యేకించి మహిళలకు 35శాతం నియామకాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు బీహార్ ముఖ్యమంత్రి ప్రకటించారు. వచ్చే ఐదేళ్లలో 10 మిలియన్ ఉద్యోగాల హామీ, వృద్ధులకు 400 నుంచి 1100 వరకు పెన్షన్ పెంపు, విద్యార్థులకు 4 వేల నుంచి 6వేలవరకు నగదు ప్రోత్సాహకాలు ఇంతవరకు నితీష్ ప్రభుత్వం ఇవ్వగల కానుకలు. దేశవ్యాప్తంగా పేదరికం తగ్గిందని అంచనాలు వేసుకుంటున్న తరుణంలో బీహార్ పేదరికం రేటు బాగా తగ్గినట్లు నీతి ఆయోగ్ 2023నివేదిక చెబుతోంది. గ్రామీణప్రాంతాల్లో పేదరికం లెక్కలు పరిశీలిస్తే 56 శాతం నుంచి 36.95 శాతానికి తగ్గింది. మొత్తానికి బీహార్‌లో 2.25 కోట్లమంది ప్రజానీకం పేదరికం నుంచి బయటకు వచ్చేసినట్లు. వారి జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయని అంచనా. బహుముఖ పేదరికమున్న రాష్ట్రాలలో బీహార్, జార్ఖండ్ ప్రధానం. వీటిలో తక్కువ తలసరి ఆదాయం, మౌలిక సదుపాయాలలోటు సామాజిక సవాళ్లు ఇప్పటికే ఎదుర్కొంటున్న అత్యంత పేద రాష్ట్రం బీహారే. ఇది అతి తక్కువ పారిశ్రామికీకరణ, ఎక్కువస్థాయిలో నిరక్షరాస్యత ఉన్న రాష్ట్రం బీహార్. పార్టీలు ప్రకటించే పథకాలు పేదరికాన్ని ఏమాత్రం తగ్గిస్తాయో ఎంతవరకు మేలు చేస్తాయో తెలియదు కానీ రేపొచ్చే ఎన్నికలు ఎన్డీయే ప్రభుత్వానికి మరో అవకాశం ఇస్తాయో! లేదో రాజకీయ ఔత్సాహికులకెవరికైనా దారిస్తాయో తేలుస్తాయి.



మీరు గౌరవాన్ని కోరుకుంటే, ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.

శామ్యూల్ జాన్సన్



సరికానప్పుడు అంతా సరిగ్గా ఉందన్న పిచ్చిభావనను నిభాయించుకుంటూ ఉండడాన్నే ఆశావాదం అంటారు.

వోల్టేర్

## ప్రజావాక్కు



### మండుతున్న కూరగాయల ధరలు

**రాష్ట్రంలో** కూరగాయలధరలు చుక్కలు చూపిస్తున్నాయి. వీని ధరలు విపరీతంగా పెరిగాయి. వర్షాకాలం వచ్చినప్పటికీ వర్షాలు లేకపోవడంతో పంట దిగుబడిపై తీవ్రంగా ప్రభావం పడుతుంది. పలుప్రాంతాలలో కిలో పచ్చిమిర్చి రూ.100, బీన్స్ రూ.90, చిక్కుడు రూ.50, క్యాప్సికం రూ.75, టమాట రూ. 45, 50, బెండకాయ కేజీ రూ. 45గా ఉన్నాయి. వారానికి సరిపడా 500 రూపాయలు పెట్టి కూరగాయలు కొనుగోలు చేసేవారు ధరలు విపరీతంగా పెరగడంతో కూరగాయలు ఎలా కొనుగోలు చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయం పైన తప్పకుండా చర్యలు చేపట్టాలని కూరగాయల ధరలను దించాలని అంటున్నారు. లేకపోతే సామాన్య మానవులపై అధికంగా ప్రభావం పడుతుందని వారు అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### నీటి సమస్యను అధిగమించాలి

**తెలంగాణలో** మళ్ళీ నీటి సమస్యలు ముంచుకొస్తున్నాయి. దానికి రుజువు ఏమిటి హెచ్‌ఎండీఏ పరిధిలో పోయిన సంవత్సరం 63వేల ట్యాంకర్‌లు బుక్‌చేస్తే అది 83 వేలకు చేరింది. అంటే అర్థం ఏమిటి గ్రౌండ్ వాటర్ పడిపోతుంది అనిఅర్థం.తెలంగాణలో గతప్రభుత్వపాలనలో చెక్ డ్యాంలు నిర్మించడం చెరువుల పూడికతీత వల్ల పెరిగిన గ్రౌండ్ వాటర్‌ని ఇప్పుడు ఉపయోగించుకుంటున్నాం. మరి మళ్ళీ గ్రౌండ్ వాటర్ రీఛార్జ్ చేయడానికి ప్రయత్నం జరుగుతుందా అంటే లేదు అని సమాధానం వస్తుంది. దేశంలో ఎక్కడ లేని విధంగా ఫీడర్ ఛానెల్స్ చెక్ డ్యాంలుఇక్కడే ఉన్నాయి.

-భారత అవినాష్, జనగామ

### కొత్తవి కొనుగోలు చేయాలి

భారత ప్రభుత్వంలో ప్రస్తుతం ఉపయోగిస్తున్న వాడుకలో ఉన్న ప్రభుత్వ బస్‌లు,ట్రైన్‌లు, ఓడలు, విమానాలు, హెలికాప్టర్‌లు ఇతరపురాతన ప్రభుత్వ వాహనాల స్థానంలో కొత్త వాటిని ప్రవేశపెట్టాలి. పాతవాహనాల వినియోగం వల్ల అనుకోని విధంగా ప్రమాదాలు జరిగేఅవకాశం ఉంటుంది. కావున ప్రభుత్వం పాత వాహనాల స్థానంలో కొత్తవి ప్రవేశ పెట్టాలి.

-డి చాంద్ బాషా, కర్నూలు

### ఒత్తిడి లేని చదువులు కల్పించాలి

**ఇటీవల** ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల పెరుగుదల సామాన్య ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అనూహ్యంగా వేలల్లో ఫీజులు పెంచుతున్నస్కూళ్లు,కాలేజీలు మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఒక విద్యార్థికి ఒక్కో సంవత్సరానికి వచ్చే మొత్తం ఖర్చులక్షల రూపాయలను దాటి పోతోంది. ఇంతటితో ఆగకుండా, కంప్యూటర్‌కోర్సులు, పుస్తకాలు, యూనిఫార్ములు, బ్యాగులు కూడా తమ వద్దే కొనాలని బలవంతం చేస్తుండటం మరో ఆందోళనకరమైన విషయం. తల్లిదండ్రులకు ఎంపిక స్వేచ్ఛలేకుండా స్కూల్ యాజమాన్యం వారిషరత్తులను ఒప్పించడమే తప్ప వేరేమీ చేయడంలేదు. ఇది విద్యను వ్యాపారంగా మలచడమేకాకుండావిద్యార్థులమీద ఆర్థికఒత్తిడిని పెంచుతోంది. ఇలాంటి దుస్థితిలో ప్రభుత్వ జోక్యం అత్యంత అవసరం. తక్షణమే ఫీజుల నియంత్రణ కోసం కఠినమైన నిబంధనలను రూపొందించాలి. కనీస సదుపాయాలు లేని, భద్రతా చర్యలు లేని విద్యా సంస్థల అనుమతులను వెంటనే రద్దు చేయాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సాంకేతిక రంగంలో నాలుగోస్థానం

**పద్దెనిమిది** రోజులు అంతరిక్షంలో అనేక ప్రయోగాలు చేసి కొత్తిమీరనుపెంచి అవనికి అతనిసహచరులతో సహా క్షేమంగా తిరిగి వచ్చిన శుభాన్షు శుక్లా అభినందనీయుడు. ఈ యాత్ర ముందు ముందు మరిన్ని అంతరిక్షయాత్రలకు దారి సుగమం కాగలదని ఇస్రోఆకాంక్షిస్తోంది. 1984లో భారత ప్రథమ వ్యోమగామి రాకేష్‌శర్మ తరువాత ఈ అరుదైన అంతరిక్ష యాత్రకు నాలుగు దశాబ్దాల కాలం పట్టడం ఆశ్చర్యంగా ఉంది.సాంకేతిక స్వారీలో మన దేశం ఇంకా వెనుకపడి ఉందా అనిపిస్తోంది. అయినా అమెరికా, రష్యా, చైనా తరువాత నాలుగవ స్థానం భారత్‌దే అని పాలకులు టెక్నికల్ పండితులు అంటున్నారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### బిసి బిల్లు ప్రవేశపెట్టాలి

వర్షాకాల పార్లమెంట్ సమావేశాలలో కేంద్రం ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి బీసీలకు, విద్యా, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, రాజకీయ,పారిశ్రామిక, ప్రైవేట్‌రంగంలో కూడా చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్‌లనుకల్పించాలి. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేయాలి.

-బూర్గుపల్లి కృష్ణ యాదవ్, హైదరాబాద్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'ర్యాగింగ్' రాక్షస క్రీడను నిరోధించలేమా?

**ప్రాణసమానంగా పెంచుకున్న తమ బిడ్డలు తమకళ్లముందే చదువు సంస్కారం ఉందనుకున్న కొందరు వింతపశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? అది ఎప్పటికైనా తీరుతుందా? ఇప్పటికైనా పాలకపెద్దలు ఆలోచించాలి. అలాగే దోషులపై నిర్దిష్టమైన చర్యలు తీసుకోగలిగితే ఇలా వేధించి ర్యాగింగ్‌కు పాల్పడేవారికి ప్రోత్సహించేవారికి తిరుగులేని హెచ్చరికలను అందించగలుగుతాం. ఈ ర్యాగింగ్ భూతాన్ని కొంతవరకైనా నియంత్రించగలుగుతాం. ఆ దృఢసంకల్పం లేనప్పుడు అన్ని చట్టాలు, కమిటీలు, విచారణలు అన్ని నిష్ప్రయోజనమే. పాలకుల చేతకాని తనానికి అమాయక విద్యార్థులు ఇలాగే బలైపోతూనే ఉంటారు.**

దామెర్ల సాయిబాబ

ఎన్ని చట్టాలు చేసినా, కఠిన చర్యలు తప్పవని ఎందరు నేతలు హెచ్చరించినా ర్యాగింగ్ రక్కసి దేశాన్ని వదిలిపెట్టడం లేదు. వికృతరూపం దాల్చింది. ఈ ర్యాగింగ్‌కు ఎందరో అమాయక విద్యార్థులు బలైపోతున్నారు. వీటిలో కొన్ని మాత్రమే వెలుగు చూస్తున్నాయి. తమకు జరిగిన అవమానాలు భరించలేక, బయటకు చెప్పుకోలేక వారిలో వారు కుమిలిపోతుంటే మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇంతకాలంగా ఇంతగా కొనసాగుతున్న ర్యాగింగ్ కారకులపై ప్రభుత్వాలు పురనావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోలేకపోతున్నాయి. చట్టాలకు సామాన్యులు లోకువైతే సమర్థులకు చట్టాలు లోకువఅన్నట్టు నిందితులు ఏదోరకంగా బయటపడుతున్నారు. అందులోనూ నిందితుల్లో అధికశాతం రాజకీయ అండదండలు, లక్ష్మీప్రసన్నుల పుత్రులు కావడంతో అధికారులు వారి జోలికి వెళ్లడానికి వెనుకాడుతున్నారనే ఆరోపణలకు జరుగుతున్న సంఘటనలు అద్దంపడుతున్నాయి. దీంతో ఏంచేసినా, ఎన్ని హెచ్చరికలు చేసినా భయం లేకుండా నిరాటంకంగా కొనసాగుతున్నది. దేశ అత్యున్నత న్యాయస్థానం జోక్యంతో విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ఈ ర్యాగింగ్ ద్వారా అగమ్యగోచరం కాకుండా నిరోధించేందుకు దేశంలోని అనేక రాష్ట్రాలు స్పష్టమైన చట్టాలు చేశాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ విశ్వవిద్యాలయాల్లో నిధుల సంఘం (యుజిసి)ఎంతో కఠినమైన మార్గదర్శకాలు కూడా రూపొందించింది. అయినా ఏమాత్రం మార్పురాకపోగా యేడాదియేడాదికి పెరిగిపోతున్నాయి. ర్యాగింగ్ 2019-2021 మధ్యకాలంలో యుజిసికి అందిన ఫిర్యాదులు తగ్గినట్లు కన్పించినా చట్టం, యుజిసి నిబంధనలు కారణం కాదు. అది కేవలం కోవిడ్ ప్రభావంతో తగ్గినట్లు కచ్చితంగా చెప్పొచ్చు. కోవిడ్ శాంతించిన తర్వాత మళ్లీ 2022 నుంచి ర్యాగింగ్ విస్తరించడం ప్రారంభించింది. 2022లో యుజిసికి 1094 ఫిర్యాదులు అందగా, 2023లో ఆసంఖ్య 1240కి పెరిగింది. ఆ తర్వాత సంవత్సరం అది ఏకంగా నలభైఐదు శాతానికి పెరిగినట్లు యుజిసి గణాంకాలే చెబుతున్నాయి. ఇప్పటివరకు దాదాపు మూడు వేల రెండువందలకుపైగా ఫిర్యాదులు ర్యాగింగ్ నిరోధక కమిటీలకు అందాయి. ఇక సీనియర్ విద్యార్థులే కాదు కాలేజీల్లో జూనియర్లకు రక్షణ కవచంగా ఉండాల్సినకొందరు అధ్యాపకులు, సిబ్బందే కంచె చేను మేసినట్లుగా వ్యవహరించడం దురదృష్టకరం. మొన్న ఒడిశాలోని బాలాసోర్‌లోఉన్న ఫకీర్‌మోహన్ కాలేజీలో విద్యావిభాగం అధిపతి వేధింపులు తట్టుకోలేక ఒక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. తనకు జరుగుతున్న వేధింపులను ఆమె కాలేజీ కమిటీకి పలుమార్లు ఫిర్యాదు చేసింది. అయినా ఆ ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోకపోవడంతో నేరుగా కాలేజీ క్యాంపస్‌కు వెళ్లిన ఆ విద్యార్థిని ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకున్నది. బాధితురాలిని భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఆ యువతి మృతిచెందినతర్వాత యుజిసి స్పందించి వాస్తవాలను బయటకు తీసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇక ఈ సంఘటన మరువకముందే కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా మూడబిదరలో ఒక విద్యార్థినిపై ఇద్దరు లెక్చరర్లు, వారి మిత్రుడు వేధింపులకు గురి చేసి అత్యాచారానికి పాల్పడ్డారు. ఒక ప్రముఖ కళాశాలలో లెక్చ రర్‌గా పనిచేస్తున్న ప్రబుద్ధుడు ఆ విద్యార్థినిని బెదరించి మాయమాటలతో నమ్మించి లైంగిక వేధింపులకుగురిచేశారు. ఆ తర్వాత ఫొటోలున్నాయని బెదరిస్తూ మరొక లెక్చరర్ ఆమెపై లైంగిక దాడిచేశారు. ఆ తర్వాత వారి మిత్రుడు. ఈ ముగ్గురి వేధింపులు రానురాను పెరిగిపోవడం భరించలేక తల్లిదండ్రులకు ఆ యువతి తెలిపింది. తల్లిదండ్రులు మహిళా కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇలా విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులే వేధింపులకు గురిచేస్తున్న సంఘటనలు తరుచుగా చోటు చేసుకొంటున్నాయి. చాలావరకు వెలుగు చూడడం లేదు. అటు కుటుంబ గౌరవం, ఇటు చదువుకు అటకం కలుగుతుందేమోననే భయం, వీటన్నంటికి మించి పోలీసులు వేసే సవాలక్ష ప్రశ్నలకు జవాబు చెప్పడంలాంటి ఇబ్బందులతో వారిలో వారు కుమిలిపోతున్నారే తప్పపెదవి విప్పలేకపోతున్నారు. అలాంటి విద్యార్థిని ఇటీవల ఒక లేఖ రాసి తనువు చాలించింది. 'నేను చదువుతున్న కాలేజీలో లైంగింక వేధింపులు జరుగుతున్నాయి. ఫ్యాకల్టీకి చెప్పొచ్చు కదా అని మీరు అనొచ్చు. వారే నీచంగా ప్రవర్తిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలి? నాలాగే ఇక్కడ చాలా మంది అమ్మా యిలు ఈ వేధింపులు భరించలేక బాధపడుతున్నారు. మాలో ఎవరో ఒకరు చనిపోతేనే తప్ప ఈ దురాగతాలు బయట ప్రపంచానికి తెలుస్తుంది. అందుకే నేను ఈ పనిచేస్తున్న' అంటూ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో ఒక విద్యార్థిని ప్రాణం తీసుకుంది. ర్యాగింగ్ నిరోధక నిబంధనలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ యుజిసి ప్రతి యేడాది ఎన్నో కాలేజీలకు నోటీసులు ఇస్తూనే ఉంది. ఇటీవల యుజిసి పద్దెనిమిది కాలేజీలకు నోటీసులు ఇచ్చింది. ర్యాగింగ్ అనండి, వేధింపులు అనండి వీటి కారణంగా ఎందరో మెరికల్లాంటి విద్యార్థుల భవిష్యత్ అర్థాంతరంగా ముగిసిపోతున్నది. ఈ ర్యాగింగ్ గతంలో ప్రొఫెషనల్ కాలేజీల్లో మాత్రమే ఉండేది. ఇప్పుడు ఇంటర్మీడియేట్ కాలేజీలకు కూడా విస్తరించింది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సెకండరీ విద్యను పూర్తి చేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను ఊహించుకొని కాలేజీల్లోకి అడుగుపెట్టిన విద్యార్థులకు బెరకు, భయం పోగొట్టడానికి చేపట్టిన పరిచయ వినోద కార్యక్రమం ఇది. 19వ శతాబ్దంలో ప్రారంభ దశలో అంతవరకే పరిమితమైనా అది శృతిమించి కొందరి విద్యార్థులకు ప్రాణాంతక వికృత క్రీడగా మారిపోయింది. పాశ్చాత్య సంస్కృతి విషవలయంలో చిక్కుకొని ఆలోచనారహితంగా చేస్తున్న ఈ ర్యాగింగ్‌ను లేత మనసులు తట్టుకోలేకపోతున్నాయి. అశ్లీల సాహిత్యం, నీలి చిత్రాలు, ప్రధానంగా మత్తు పదార్థాలు, ఇతర బలహీనతలు తోడు కావడంతో ఎంతో మంది విద్యార్థులు బలైపోయారు. అకారణంగా మెరికల్లాంటి పిల్లలను కోల్పోయిన ఆ కుటుంబాల గర్భశోకం ఎలా తీరుతుందో పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. ఇక ర్యాగింగ్‌కు భయటపడి మరెందరో విద్యార్థులు విద్యాభ్యాసానికే స్వస్తి చెప్తున్న సంఘటనలు చాలా ఉన్నాయి. పాలకులు ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు.ఈ విషసంస్కృతిని నిరోధించేందుకు ఎన్నో చట్టాలు, నిబంధనలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1997 మార్చి పద్దెనిమిదిన రాష్ట్ర శాసనసభ ఆమోదించిన చట్టం ప్రకారం ఎన్నో కఠినశిక్షలు రూపొందించారు. మరణానికి కారకులైన, ఆత్మహత్యకు ప్రేరేపించినా జీవితకాలం పాటు కానీ పదేళ్ల జైలు శిక్ష విధించే విధంగా చట్టాన్ని రూపొందించారు. అన్నింటి కంటే మించి ర్యాగింగ్ చేసిన విద్యార్థులను ఆయా విద్యాసంస్థల నుంచి తొలగించడమేకాక వారిని ఎక్కడా చేర్చుకోరాదని చట్టంలోచేర్చారు. చట్టాలు చేశారు కానీ దాన్ని త్రికరణశుద్ధిగా అమలు చేసే మనసు పాలకులకు లేకుండాపోయింది. దేశవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి. ఇప్పటివరకు ఒక్కకేసులో కూడా తిరుగులేని సాక్ష్యాలు సేకరించి న్యాయస్థానాల ముందు రుజువు చేసేందుకు తీసుకున్న చర్యలు లేవనే చెప్పొచ్చు. పొరుగునున్న తమిళనాడులో జరిగిన సంఘటనలో ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో తీసుకున్న చర్యలు అక్కడ ర్యాగింగ్ భూతం చాలావరకు తగ్గిందనే చెప్పొచ్చు. ర్యాగింగ్ శృతిమించి జూనియర్ వ్యతిరేకించడంతో హత్యకు దారితీసింది. పకడ్బందీ సాక్ష్యాలతో అక్కడి యంత్రాంగం నిందితుడిని న్యాయస్థానం ముందు నిలబెట్టింది. చదువుకొని గొప్ప వైద్యుడిగా పేరు ప్రతిష్టలు సంపాదించి పెడతారని కుమారుడిపై ఆశలు పెంచుకున్న ఆ తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని నిందితునికి మరణశిక్ష వేయడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానిస్తూ ఇరవైఎనిమిది సంవత్సరాలు కఠిన కారాగారశిక్ష విధించారు. ఇది తమిళనాడులోని విద్యార్థిలోకంలో భయాన్ని నెలకొల్పింది. ప్రాణ సమానంగా పెంచుకున్న తమ బిడలు తమకళ్లముందే చదువుసంస్కారం ఉందనుకున్న కొందరు వింతపశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? అదిఎప్పటికైనా తీరుతుందా? ఇప్పటికైనా పాలక పెద్దలు ఆలోచించాలి. అలాగే దోషులపై నిర్దిష్టమైన చర్యలు తీసు కోగలిగితే ఇలా వేధించి ర్యాగింగ్‌కు పాల్పడేవారికి ప్రోత్సహించేవారికి తిరుగులేని హెచ్చరికలను అందించగ లుగుతాం. ఈ ర్యాగింగ్ భూతాన్ని కొంతవరకైనా నియంత్రించగలుగుతాం. ఆ దృఢసంకల్పం లేనప్పుడు ఎన్ని చట్టాలు, కమిటీలు, విచారణలు అన్ని నిష్ప్రయోజ నమే. పాలకుల చేతకాని తనానికి అమాయక విద్యార్థులు ఇలాగే బలైపోతూనే ఉంటారు. ●

## ఒక్క మాట

# నవ భారత నిర్మాణానికి యువతే కీలకం

జి.అజయ్ కుమార్

భారతదేశ జనాభాలో సుమారుగా 60 శాతం మంది యువతే ఉన్నారు. వాళ్లు ఈ ప్రపంచానికి తమ శక్తిని చాటుతున్నారు. ఐటీ రంగం, స్టార్టప్‌లు, పరిశోధన, అంతరిక్ష విజ్ఞానం, ఆర్మీ వంటి రంగాల్లో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కానీ ఇదే యువత రాజకీయాల్లో మాత్రం తీవ్రంగా వెనుకబడిపోతున్నారు. ఇది కేవలం వ్యక్తిగత వెనుకడుగు కాదు, ప్రజాస్వామ్య పరంగా అత్యంత ఆందోళన కలిగించే పరిస్థితి. వాళ్లు ఓటు వేస్తున్నారు, సోషల్ మీడియాలో రాజకీయం గురించి చురుగ్గా చర్చిస్తున్నారు. గ్రామాలలో రచ్చబండల దగ్గర రాజకీయల గురించి రాజకీయ నాయకుల గురించి చర్చలు, వాదనలు జరుపుతారు కానీ పాలనా వ్యవస్థలోకి అడుగుపెట్టే యువత మాత్రం చాలా తక్కువగా ఉన్నారు. ఇలా ఎందుకు జరుగుతోంది? దీని వెనుక ఉన్న కారణాలేంటి 'రాజకీయాలు మురికి కూపం', అనే భావనలు యువతను వెనక్కిలాగుతున్నాయి. చాలా పార్టీల్లో కుటుంబ వారసత్వాలే ఆధిపత్యం చూపుతున్నాయి. సామాన్య యువతకు అవకాశాలు లేకుండాపోయాయి. నైపుణ్యం, నీతికిస్థానమే లేకుండా డబ్బు, కులతత్వమే నిర్ణాయకంగా మారిన రాజకీయ సమీకరణలు యువతలో భరోసా తగ్గిస్తున్నాయి. ఎన్నికల సమయంలో లిక్కర్, నగదు వంటి ప్రలోభాలకు ఓటర్లు లొంగిపోవడం, నిజాయితీగల యువతకు నిరాశకలిగిస్తోంది. పాఠశాలస్థాయిలోనే రాజకీయ అవగాహన, చట్టాలపై పరిజ్ఞానం కలిగించాల్సిన అవసరం ఉంది. ప్రత్యక్ష రాజకీయ కార్యకలాపాల్లో పాలొనకపోయినా, సోషల్ మీడియాలో ప్రశ్నించడానికి, ప్రచారానికి యువత పరిమితమవుతోంది. రేపటి భవిష్యత్తు అంతా యువతదే అలాంటి యువతకు ఏం కావాలి, వారి అభివృద్ధికి దిశా నిర్దేశం చేయాలంటే చదువుకున్న విచక్షణ విలువలతో కూడిన యువత తప్పకుండా రాజకీయాలలోకి రావాలి. రాజ్యాధికారంలో వుండాలి ఉపాధి, వ్యవసాయం, విద్య, టెక్నాలజీ వంటి అంశాలు యువతకు నిత్య సంబంధితమైనవి. పాత తరం నాయకత్వం వేగం లేక, ప్రజల సమస్యల పట్ల అవగాహన లేక అభివృద్ధి దూరమవుతుంది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధం, పారదర్శకత, టెక్నాలజీ వాడకాన్ని యువత బాగా నేర్చుకుంది. అవినీతికి వ్యతిరేకంగా పోరాడేతత్వం, క్రియాశీలత యువతలో సహజంగా ఉంది. నూతన పాలనా శైలి - ప్రజలకు చేరువైన, డిజిటల్ ఆధారిత పాలన అవసరం ఉంది. ఇది యువత చేతిలో సాధ్యమవుతుంది.రాజకీయాల్లో పాల్గొనడం యువత బాధ్యతగా భావించాలి. దేశ భవిష్యత్తు గురించి యువత ఆలోచించాలి అంటే రాజకీయాలలో గళమెత్తాలి. శాసనసభలు, లోక్‌సభల్లో యువత శాతం చాలా తక్కువగా ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం. నిజానికి నేటి యువతే రేపటి నాయకులు. వాళ్లమౌనంగా ఉంటే ఈ దేశ పాలనా విధానం మారదు. ఓటును చక్కగా వినియోగించాలి.డబ్బు, కులం ఆధారంగా కాదు, అభ్యర్థి పనితీరు, నైతికత ఆధారంగా ఓటు వేయాలి. గ్రామస్థాయిలో పాలనలో చురుకుగా పాల్గొనాలి. సర్పంచ్ స్థాయి నుంచే ప్రయాణం మొదలు పెట్టాలి. విద్యార్థి సంఘాలు, యువజన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలి. విమర్శకులు కాకుండాపరిష్కారాలు చెప్పే నాయకులుగా ఎదగాలి. ప్రలోభాలకు లొంగని ధైర్యంకలిగిన యువత కావాలి. నైతిక విలువలు, ప్రజల పట్ల ప్రేమ కలిగిన యువత రాజకీయాల్లోకి రావాలి.అవినీతి, పాతకాలపు పాలనా పద్ధతుల నుండి విముక్తి కావాలంటే యువత ముందుకు రావాల్సిందే. నేడు మనదేశం సాంకేతికంగా ముందడుగు వేస్తున్నా, పాలనారంగంలో మాత్రం పాత పద్ధతులు కొనసాగుతూనే ఉన్నాయి. దీన్ని మార్చే శక్తి యువతలో ఉంది. నూతన భారత నిర్మాణానికి యువతే కీలకం. ●

# సమాజ సేవకు నూతన రూపం..బ్యాంకుల జాతీయాకరణం

రామ కిష్టయ్య సంగన భట్ల

పంతొమ్మిది వందల అరవై తొమ్మిదిలో భారతదేశ ఆర్థిక చరిత్రలో ఒక ప్రధాన మలుపుగా నిలిచిన సంఘటన బ్యాంకుల జాతీయాకరణ. అదే ఏడాది జూలై 19న,ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ నాయకత్వంలో భారత ప్రభుత్వం తీసుకున్న బ్యాంకుల జాతీయాకరణ నిర్ణయం దేశ ఆర్థిక రంగాన్ని, ముఖ్యంగా బ్యాంకింగ్ వ్యవస్థను సమూలంగా మార్చేసింది. అప్పటివరకు బ్యాంకింగ్ రంగం ఒక పరిమిత వర్గానికి మాత్రమే సేవలందించేది. ముఖ్యంగా పారిశ్రామిక వేత్తలు, పెద్ద రైతులు,పట్టణ వాణిజ్య వర్గాలకే ఇది అందుబాటులో ఉండేది. గ్రామీణ భారతం, వ్యవసాయ రంగం, చిన్న పరిశ్రమలు, పేద ప్రజలు బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉండిపోయారు. ఈ పరిస్థితిని మార్చాలని భావించిన ఇందిరాగాంధీ ప్రభుత్వం బ్యాంకింగ్ ఆన్ ది డోర్ స్టెప్ ఆఫ్ ద పూర్' అనే ధ్యేయంతో బ్యాంకుల జాతీయాకరణ చర్యను చేపట్టింది. 1960వ దశకం భారతదేశానికి ఆర్థికంగా, రాజకీయంగా అనేక సవాళ్లను ఎదుర్కొన్న కాలం. స్వాతంత్రం వచ్చినప్పటికీ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉన్నారు. ప్రైవేట్ బ్యాంకులు, ఎక్కువగా పారిశ్రామిక వర్గాల నియంత్రణలో ఉండి, ప్రధానంగా పెద్ద పరిశ్రమలు స్థాపిత వ్యాపారాల క్రెడిట్ అవసరాలను తీర్చడానికి మొగ్గు చూపాయి. వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు ఇతర ప్రాధాన్యత రంగాలను నిర్లక్ష్యం చేశాయి. ఇది రుణ పంపిణీలో గణనీయమైన అసమానతలకు దారితీసింది. సమ్మిళిత ఆర్థికవృద్ధికి ఆటంకం కలిగించింది. అలాంటి పరిస్థితుల లో జాతీయాకరణ ద్వారా ప్రభుత్వం, బ్యాంకులలో డబ్బులను నిర్లక్ష్యం చేయబడిన రంగాలకు మళ్లించగలదని, తద్వారా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించవచ్చుని పేదరికాన్ని తగ్గించవచ్చని భావించారు. ప్రధానంగా నికర డిపాజిట్లు 50 కోట్లకు మించిన 14 ప్రైవేట్ షెడ్యూల్డ్ బ్యాంకులను జాతీయాకరించారు. వీటిలో అల్లాహాబాద్ బ్యాంక్, బాంక్ ఆఫ్ బరోడా, బాంక్ ఆఫ్ ఇండియా, బాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేనరా బ్యాంక్, దేనా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్ ఉన్నాయి. ఈ బ్యాంకులు దేశ డిపాజిట్లలో 85వరకూ నిర్వహిస్తున్నట్లుగా ఉండటంతో వాటి జాతీయాకరణ ద్వారా ప్రభుత్వానికి అధిక ఆర్థిక నియంత్రణ కలిగింది. బ్యాంకింగ్ రంగాన్ని సామాజిక అభివృద్ధికి వినియోగించే దిశగా ఇది మలుపు తీసుకొచ్చింది. బ్యాంకుల జాతీయాకరణ ద్వారా కొన్ని



ప్రధాన లక్ష్యాలు చేరుకోవడం జరిగింది. వ్యవసాయ రంగానికి, చిన్న పరిశ్రమలకు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రుణాలందింపు పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంక్ శాఖల విస్తరణకు ఇది నాంది పలికింది. జాతీయాకరణ వల్ల ప్రధానంగా నాలుగు ప్రధాన మార్పులుచోటుచేసుకున్నాయి. ఒకటి గ్రామీణ బ్యాంకింగ్ విస్తరణ, రెండోది వ్యవసాయ, మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజులకు రుణాల లభ్యత. మూడోది ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు బ్యాంకుల మద్దతు.నాలుగోది మహిళలు, ఎస్సీ,ఎస్టీ,ఇతర బహిష్కృత వర్గాల ఆర్థిక చేర్పు. 1969 నాటికి దేశవ్యాప్తంగా 8,200 బ్యాంక్ శాఖలే ఉండగా, 1991 నాటికి వాటి సంఖ్య 60 వేలు దాటింది. ఇందులో 30 వేలకుపైగా గ్రామీణ శాఖలు. వ్యవసాయరంగానికి బ్యాంకులు ఇచ్చిన రుణాల శాతం 1969లో 2.2 ఉండగా, 1980 నాటికి 15.8 కి పెరగడం గమనార్హం. మహిళలు, ఎస్సీ,ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాలు మొదటిసారిగా అధికారిక ఆర్థిక వ్యవస్థకు చేరువయ్యా యి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, విద్యా రుణాలు మొదలైనవి బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా అమలవుతూ వచ్చాయి. ఇక ఇందిరా గాంధీ పాలనకు ఇది రాజకీయంగా పెద్దబలాన్ని ఇచ్చింది. బ్యాంకుల జాతీయాకరణ పేద ప్రజల్లో మద్దతును పెంచడంతో పాటు, ఆమెను సామాజిక న్యాయమూర్తిగా ప్రజల్లో ప్రతిష్ఠించేందుకు దోహదపడింది. అయితే 1970లో సుప్రీంకోర్టు ఈ ఆర్డినెన్స్‌ను కొంతవరకూ చట్టవిరుద్ధంగా ప్రకటించడంతో, ప్రభుత్వం చట్ట సవరణ చేసి తిరిగి జాతీయాకరణను అమలు చేసింది. దీనికితోడు 1980లో మరోసారి ఆరు ప్రైవేట్ బ్యాంకులను జాతీయాకరించడం జరిగింది. వీటితో కలిపి ప్రభుత్వ యాజమాన్యంలోని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల సంఖ్య 20కి చేరింది. అయితే జాతీయాకరణ తరువాత కూడా సమస్యలు లేవని చెప్పలేం. బ్యాంకుల్లో రాజకీయ దుర్వినియోగం, సంక్షేమ పథకాల పేరిట నష్ట రుణాల మాఫీ, నిర్వాసిత ఆస్తుల శాతం పెరగడం,ప్రభుత్వ నియామకాల వల్ల పరిపాలనలో నైపుణ్యాల కొరత వంటి అంశాలు వ్యాపించాయి. అయినా ఇవన్నీ కలిపి చూసినప్పుడు, జాతీయాకరణ ద్వారా దేశ ఆర్థికవ్యవస్థకు ఒక సుదీర్ఘ, సామాజిక ధోరణిలో దిక్సూచి చూపడం జరిగింది. దేశంలో సగానికి పైగా జనాభా బ్యాంకింగ్ సేవలకు మించి ఉండే స్థితిలో ఉండడం ఈ విధానానికే ఫలితం. 1991 ఆర్థిక సంస్కరణల అనంతరం ప్రైవేట్ బ్యాంకులకు తిరిగి ప్రవేశం లభించినా, జాతీయాకరణ ద్వారా ఏర్పాటైన బ్యాంకింగ్ మౌలిక సదుపాయాలు, సామాజిక దృక్కోణం భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపాయి. నేటి ఆర్థికచర్చల్లో బ్యాంకుల విలీనాలు, సంస్థాగత పునఃనిర్మాణం, డిజిటల్ బ్యాంకింగ్ వంటి అంశాలు ముందుకు వస్తున్నా వాటికి బీజం వేసింది 1969లో తీసుకున్న బ్యాంకుల జాతీయాకరణే. ఇది కేవలం పాలనా నిర్ణయం కాదు, దేశ ఆర్థిక ప్రణాళికలో ఒక మైలురాయిగా నిలిచింది. పేదల ఆర్థిక చేర్పును, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న విధానాల మొదటి మెట్టు ఇదే. ఇలాంటి చర్యల ద్వారానే సమతా, సమగ్ర అభివృద్ధికి దారులు వెలుస్తాయి. ●



# మళ్లీ సుప్రీం మెట్లెక్కిన వర్మ

## ఆయనను పదవి నుంచి తొలగించే చర్యలు ఆరంభించిన కేంద్రం

## విచారణ కమిషన్ నివేదిక చెల్లదంటూ పిటిషన్

**న్యూఢిల్లీ, జులై 18:** కాలిపోయిన కరెన్సీ కట్టలు ఇంట్లో భారీగా బయటపడడంతో తీవ్ర వివాదంలో చిక్కుకున్న జస్టిస్ యశ్వంత్ వర్మ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయనను న్యాయమూర్తి పదవి నుంచి తొలగించేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించిన నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. తనపై సుప్రీంకోర్టు కమిటీ ఇచ్చిన దర్యాప్తు నివేదికను సవాల్ చేస్తూ ఈ పిటిషన్‌ను వేశారు. ఈకేసులో న్యాయ సూత్రాలను పాటించలేదని జస్టిస్ యశ్వంత్ వర్మ ఆరోపించారు. తనను పూర్తిస్థాయిలో, పారదర్శకంగా విచారించకుండానే సుప్రీంకోర్టు మాజీ సిజెఐ సంజీవ్‌ఖన్నా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని విచారణ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఇక విచారణ కమిటీ కూడా సమగ్ర దర్యాప్తు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఈ కమిటీ ఇచ్చిన నివేదికను చెల్లనదిగా పరిగణించాలని జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఈ నెల 21న నుంచి పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లోనే జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన కోసం తీర్మానం ప్రవేశపెట్టేందుకు వీలుగా ఎంపిల సంతకాల సేకరణ ప్రక్రియను ఇటీవల చేపట్టారు. లోక్‌సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతామని ఇప్పటికే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు వెల్లడించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే జస్టిస్ యశ్మంత్ వర్మ సుప్రీంను ఆశ్రయించారు. ఈ యేడాది మార్చి 14న ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా ఈ ఘటనలో భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. ఈ ఘటన అనంతరం మార్చి 28న సుప్రీంకోర్టు కొలిజియం జస్టిస్ యశ్వంత్‌వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదలీచేశారు. ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించవద్దని సూచించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ దీనిపై విచారణ జరిపినివేదిక సమర్పించింది. అందులో డబ్బు బయటపడిన మాట వాస్తవమేనని నిర్ధారించింది. ఆ సొమ్ములున్న స్టోర్ రూం నియంత్రణ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జస్టిస్ వర్మ లేదా అతని కుటుంబసభ్యుల ఆధీనంలోనే ఉందని పేర్కొంది.

ఇందుకు సంబంధించి బలమైన ఆధారాలు ఉన్నట్లు వెల్లడించింది. అసలు ఆ నోట్లను జస్టిస్ వర్మ లేదా ఆయన కుటుంబ సభ్యులు స్టోర్‌రూమ్‌లో ఉంచడం అనుమానాస్పదంగా ఉందని అభిప్రాయపడింది. కాలిపోయిన నోట్లు చిన్న నోట్లు లేదా తక్కువ మొత్తం కాదని వెల్లడించింది. అలహాబాద్ హైకోర్టు జస్టిస్‌గా ఉన్న వర్మను విధుల నుంచి తొలగించడానికి ఈ ఆధారాలు సరిపోతాయని కమిటీ అభిప్రాయపడింది.



## మాజీ సిఎం కుమారుడిని అరెస్టు చేసిన ఇడి

**న్యూరాయ్‌పూర్,జూలై 18:** ఛత్తీస్‌గఢ్ లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌ను శుక్రవారం అరెస్టు చేసింది. భిలాయ్‌లోని బఘేల్ నివాసంపై ఈడీ నిర్వహించిన తాజా సోదాల తర్వాత ఈ అరెస్టు జరిగింది. ఈ కేసు మనీలాండరింగ్ ఆరోపణలకు సంబంధించినది. ఇది 2019 నుంచి 2022 వరకు భూపేష్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జరిగినట్లు ఈడీ ఆరోపిస్తోంది. శుక్రవారం ఉదయం భిలాయ్‌లోని బఘేల్ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది, ఈ సమయంలో భూపేష్ బఘేల్ కూడా అక్కడే ఉన్నారు. ఈ దాడులు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎమ్ఎల్ఏ) కింద నిర్వహించగా, ఇందులో తాజా ఆధారాల ఆధారంగా చైతన్యను అరెస్టు చేశారు. తన కుమారుడ్ని అరెస్ట్ చేయడంపై భూపేష్ భఘేల్ ఘాటుగా స్పందించారు. మోదీ,అమిత్‌షా ఇచ్చే ఇటువంటికానుకలు ప్రజాస్వామ్య ప్రపంచంలో మరెవ్వరూఇవ్వలేరంటూ వ్యంగ్యం ప్రదర్శించారు.

# ముందు క్షమాబిక్ష ఆపైనే బ్లడ్‌మనీ కార్యాచరణ

### సుప్రీంకోర్టుకు కేంద్రం వివరణ



**న్యూఢిల్లీ,జూలై 18:** యెమెన్‌లో హత్య కేసులో మరణశిక్ష ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్షను వాయిదా పడినట్లు సుప్రీంకోర్టుకు కేంద్రం శుక్రవారం తెలిపింది. ఆమెను రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్రం తరపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి కోర్టుకు తెలిపారు. నిమిష ప్రియ సురక్షితంగా తిరిగి రావాలని కేంద్రం కోరుకుంటుందని వెల్లడించారు. అయితే ప్రభుత్వం స్పందనపై సుప్రీంకోర్టు సంతృప్తి వ్యక్తంచేసింది. నిమిష ప్రియ కేసులో కేంద్రం సాధ్యమైన ప్రయత్నాలు చేస్తోందని తెలిపింది. తొలుత ఆమెకు క్షమాభిక్ష దక్కితే తర్వాత బ్లడ్ మనీ అంశం చర్చకు వస్తుందని న్యాయస్థానానికి వివరించారు. అనంతరం కేసు తదుపరి విచారణను ధర్మాసనం ఆగస్టు 14కి వాయిదా వేసింది. ఉరిశిక్ష ఎదుర్కొంటున్న 38 ఏళ్ల ప్రియను కాపాడటానికి దౌత్య మార్గాలను ఉపయోగించాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపడుతోంది. అదే సమయంలో విచారణ సందర్భంగా నిమిష ప్రియ తరఫున న్యాయవాదుల బృందం కోర్టుకు ఓ అభ్యర్థన చేసింది. ఈ కేసులో బాధిత కుటుంబంతో సంప్రదింపులు జరిపేందుకు వీలుగా యెమెన్ వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరింది. దీంతో ప్రస్తుతం ఆ దేశానికి వెళ్లకుండా ప్రయాణ ఆంక్షలు ఉన్నందున కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని న్యాయస్థానం పేర్కొంది. ఇందుకోసం ప్రభుత్వం వద్ద అభ్యర్థన చేసుకునేలా పిటిషనర్లకు అనుమతి కల్పించింది. అయితే యెమెన్ దేశస్థుడి హత్య కేసులో నిమిష ప్రియకు జులై 16వ తేదీన మరణశిక్ష అమలు చేయాల్సి ఉంది. కానీ చివరి నిమిషంలో అక్కడి ప్రభుత్వ వాయిదా వేసింది. బ్లడ్ మనీపై బాధిత కుటుంబంతో చర్చలు జరిపేందుకు మరింత సమయం ఇవ్వాలని భారత ప్రభుత్వం అప్పటికే చేసిన అభ్యర్థనకు ఆ దేశం సానుకూలంగా స్పందించింది. కానీ బాధిత కుటుంబం మాత్రం తాము బ్లడ్ మనీకి ఎన్నటికీ అంగీకరించబోమని తేల్చిచెబుతోంది. దీంతో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# పదేళ్లుగా మా బావను వేధిస్తున్నారు

### ఎఐసిసి నేత, ఎంపి రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ,జూలై 18:** కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై షికోపుర్ ల్యాండ్స్ వ్యవహారానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్ దాఖలుల చేయడంపై రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. గత 10 ఏళ్లుగా ఈ ప్రభుత్వం తన బావ రాబర్ట్ వాద్రాను వెంటాడుతోందని విమర్శించారు. రాజకీయ కక్షతో పెట్టిన కేసును ఎదుర్కొంటున్న రాబర్ట్ వాద్రా, ప్రియాంక దంపతుల కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గత పదేళ్లుగా ఈ ప్రభుత్వం చేతిలో మా బావ వేధింపులకు గురవుతున్నారు. తాజా ఛార్జిషీట్ కూడా రాజకీయ కక్షతో చేసే దాడికి కొనసాగింపుగా ఉంది. ఇవన్నీ దురద్దేశపూరితమైన, రాజకీయ ప్రేరణతో కూడి నిందలు, వేధింపులే. ఈ సమయంలో రాబర్ట్, ప్రియాంకా వారి పిల్లలకు మద్దతుగా ఉంటా. వారు ఎలాంటి హింసనైనా తట్టుకునేంత ధైర్యంగా ఉన్నారని నాకు తెలుసు. ఇకపై అలాగే ఉంటారు. చివరికి నిజమే గెలుస్తుందని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు. 2008 ఫిబ్రవరిలో గురుగ్రామ్‌లోని శికోహ్‌పుర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి వాద్రా కంపెనీ కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లు ఉంటుందని తెలిపింది. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. దీనిపై మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో ఈడీ విచారణ జరుపుతోంది. ఈ కేసుకు సంబంధించి 2018 సెప్టెంబర్‌లో వాద్రా పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదైంది. ఆయనతో పాటు నాటి హరియాణా ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా, రియల్ ఎస్టేట్ సంస్థ డీఎల్ఎఫ్, ఓ ప్రాపర్టీ డీలర్ పేర్లను కూడా నమోదు చేసింది. అందులో అవినీతి ఫోర్జరీ చీటింగ్ తదితర నేరాలు నమోదయ్యాయి. వాద్రాతో సంబంధం ఉన్న రూ.37.64 కోట్ల విలువైన 43 స్థిరాస్తులను జప్తు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ కేసుకు సంబంధించి రాబర్ట్ వాద్రాను ఇప్పటికే ఈడీ పలుమార్లు విచారించింది. ఈ క్రమంలోనే గురువారం ఆయనపై ఛార్జిషీట్ ధాఖలు చేసింది. వాద్రాతో పాటు మరో 10మంది పేర్లను ఛార్జ్‌షీట్‌లో చేర్చింది.



## ఉగ్రవాద సంస్థగా 'ది రెసిస్టెన్స్‌ఫ్రంట్'

**వాషింగ్టన్,జూలై 18:** పహల్గాం ఉగ్ర దాడికి బాధ్యత వహించిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ను ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. టీఆర్ఎఫ్ అనేది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా ముసుగు సంస్థ అని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. మా జాతీయ భద్రతా ప్రయోజనాలను రక్షించడం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, పహల్గాం దాడికి న్యాయం కోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. ఇదే ట్రంప్ సర్కార్ పరిపాలన నిబద్ధతను ప్రదర్శిస్తుంది. ది రెసిస్టెంట్ ఫ్రంట్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా, ప్రత్యేకంగా నియమితమైన గ్లోబల్ టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్‌గా అమెరికా గుర్తించింది. 2008 ముంబయి ఉగ్రదాడి తర్వాత భారత్‌లో జరిగిన దాడుల్లో పహల్గాం ఘటనే అతిపెద్దది. భారత భద్రత దళాలపై గతంలో జరిగిన పలు దాడులకు టీఆర్ఎఫ్ బాధ్యత వహించిందని రూబియో వెల్లడించారు.

## దేశ రాజధానిలో 90 స్కూళ్లకు బాంబు బెదరింపులు

**న్యూఢిల్లీ, జూలై 18:** దేశ రాజధాని ఢిల్లీలోని 20కి పైగా పాఠశాలలకు శుక్రవారం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. అలాగే బెంగళూరులో కూడా కార్పొరేట్‌స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. మొత్తం 90 స్కూళ్లకు బెదిరింపులు వచ్చాయని పోలీసులు తెలిపారు. వీటిలో ఎంఎస్‌ధోనీ స్కూలుతో సహా అన్ని స్కూళ్లకు ఇలాంటి బెదిరింపులే రావడంతో అన్ని స్కూళ్ల వద్ద బాంబు స్క్వాడ్స్ తనిఖీలు నిర్వహిస్తున్నాయి. బాంబు బెదిరింపు మెయిల్ వచ్చిన స్కూళ్లలో సివిల్ లైన్స్‌లోని సెయింట్ గ్జావియర్స్, పశ్చిమ్ విహార్‌లోని రిచ్‌మండ్ గ్లోబల్ స్కూల్, రోహిణిలోని అభినవ్ పబ్లిక్ స్కూల్, దసావిరిన్ స్కూల్ ఉన్నాయి. పోలీసుల కథనంప్రకారం, బాంబు బెదిరింపు లేఖలో హలో. నేను పాఠశాల తరగతి గదుల్లో అనేక పేలుడుపరికరాలను (ట్రినిట్రోటోలు యెన్) ఉంచానని మీకు తెలియజేస్తున్నాను. పేలుడు పదార్థాలను నల్లటి ప్లాస్టిక్ సంచులలో చాలా జాగ్రత్తగా దాచిపెట్టాను. మీలో ప్రతి ఒక్కరినీ నేను ఈ ప్రపంచంనుంచి తుడిచి వేస్తాను.నాకు నిజంగా నా జీవితం అసహ్యమే. తర్వాత నేను ఆత్మహత్య చేసుకుంటాను.నాకు నిజమైన సహాయం ఎప్పుడూ అందలేదు. మనోరోగ వైద్యులు, మన స్తత్వవేత్తలు ఇలా ఎవరూ పట్టించుకోలేదు.

# ఆ ఖైదీల విడుదలకు నియమాలు రూపొందించండి

### రాష్ట్రాలను ఆదేశించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ,జూలై 18:** జైలు నిబంధనలు రాష్ట్రాల వారీగా వేర్వురుగా ఉంటాయని, అయితే ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీలను విడుదల చేసే క్రమంలో ఒకే రకమైన నియమాలు రూపొందించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మోహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. ప్రాణాంతక వ్యాధులున్న రోగులు, 70 ఏళ్ల పైబడిన ఖైదీలను విడుదల చేయాలని నేషనల్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను రిజర్వ్ చేసింది. ఈ విషయంలో కేంద్రం ఇప్పటికే మార్గదర్శకాలను రూపొందించిందని, అదే రికార్డులో ఉన్నట్లు తెలిపింది. జైలు నిబంధనల విషయానికి వస్తే రాష్ట్రాల వారీగా వ్యక్తిగతంగా ఉంటాయి. అయితే, ప్రాణాంతాక వ్యాధులున్న రోగుల విడుదలకు అన్ని రాష్ట్రాలు ఒకే రకమైన నిబంధనల రూపకల్పనకు ముందుకు రావాలని బెంచ్ తెలిపింది. అయితే, ఇలాంటి ఖైదీల పట్ల కేంద్రం ఆలోచిస్తుందని అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు తెలిపారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇందుకు తగిన నిర్వహణ చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. క్షమాభిక్షలో భాగంగా ఇలాంటి ఖైదీల విడుదల అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాలకు కేంద్రం సూచించినట్లు చెప్పారు. మరోవైపు ఈ విధానంలో దుర్వినియోగం జరిగే అవకాశాలను సుప్రీం పరిగణలోకి తీసుకుంది. ఇలాంటి అర్హులైన ఖైదీలకు వైద్య చికిత్స, విడుదల విషయంలో సరైన నిబంధనలను రూపొందించాలని చెప్పింది. దీనిపై స్పందించిన పిటిషనర్ ప్రాణాంతక వ్యాధులుగా ఉన్నవారిగా ఎవరిని గుర్తించాలనే అంశాన్ని మార్గదర్శకాల్లో ఉంచామని తెలిపారు. వీరిని సంబంధిత జైలు వైద్య అధికారి ధ్రువీకరిస్తారని చెప్పారు. ఇందు కోసం ఒక వైద్య బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రం ఆలోచిస్తుందని తెలిపారు. ఈ క్రమంలోనే ఢిల్లీ ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది మాట్లాడుతూ 1985 నుంచి ఆస్తమాతో బాధపడుతున్న ఖైదీ జైలులో ఉన్నాడని తెలిపారు. మరోవైపు కేరళలో కూడా 94ఏళ్ల ఖైదీ ఉన్నాడని న్యాయవాది చెప్పారు. 2018లో రూపొందించిన విధానంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తుల కోసం కొన్ని నిర్దిష్ట నిబంధనలను చేర్చిందని, వైద్య బోర్డును ఏర్పాటు చేయాలని ఉత్తరప్రదేశ్ న్యాయవాది అన్నారు.

కాగా, ఈ పిటిషన్‌పై మే 5న కేంద్రంతో పాటు బిహార్, ఉత్తరప్రదేశ్ సహా 18 రాష్ట్రాల సుప్రీం కోర్టు స్పందనలు కోరింది . 70ఏళ్లపైబడిన, ప్రాణాంతక వ్యాధిగ్రస్తులైన ఖైదీలు బిహార్, కేరళ, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బంగాల్, ఒడిశాతో సహా అనేక రాష్ట్రాల్లో జైలుశిక్ష అనుభవిస్తున్నారని నల్సా తెలిపింది. తమ నేరారోపణలను సవాలు చేయ డానికి, బెయిల్ నిరాకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు రాలేని ఇలాంటి ఖైదీల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని పిటిషనర్ వాదించారు. జైళ్లలో రద్దీ ఎక్కువగా ఉండటంవల్ల జైలు అధికారులు సహాయం అందించడం కూడా సాధ్యం కాకపోవచ్చు అని పిటిషన్‌లో పేర్కొన్నారు. అందుకే ఈ విషయంలో జోక్యం అవసరమ న్నారు. 2022 డిసెంబర్ 31 నాటికి దేశంలో జైలు ఆక్యుపెన్సీ రేటు 131 శాతంగా ఉందని చెప్పింది.

# కన్నతల్లిని ఇంట్లో బంధించి చిత్రహింసలు

### పోలీసుల జోక్యంతో మాతృమూర్తికి విముక్తి

**చండీగఢ్,జూలై 18:** దివ్యాంగురాలైన కన్న తల్లిని ఇంట్లోనే బంధించి చిత్రహింసలకు గురిచేసిన కొడుకు ఉదంతం వెలుగులోకి వచ్చింది. గేటుకు తాళం వేసి భోజనం, నీళ్లు ఇవ్వకుండా క్రూరంగా ప్రవర్తించాడు. ఈ దారుణ ఘటన హరియాణాలో జరిగింది. బాధిత మహిళ సహాయం కోసం ఇరుగుపొరుగు వారిని వేడుకోవడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని రక్షించారు. బాధితురాలి భర్త రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కొద్ది రోజులుగా ఒంటరిగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హరియాణా కైతాల్ జిల్లాలోని చందన గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన ఓ మహిళని తన కొడుకు నాలుగు రోజుల నుంచి ఇంట్లోనే బంధించి గేటుకు తాళం వేశాడు. బాధితురాలు ఆకలి, దాహంతో పక్కింటివారిని వేడుకుంది. ఇది గమనించిన స్థానికులు 112 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గేటు తాళం పగలకొట్టి మహిళను రక్షించారు. ఆమెను బయటకు తీసే సమయానికి తీవ్ర నీరసంతో మూర్ఛపోయిందని, వెంటనే ఆస్పత్రిలో చేర్చామని పోలీసులు చెప్పారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని, దాదాపు తొమ్మిది రోజులు నుంచి ఆమె ఆహారం తీసుకున్నట్లుగా కనిపించడం లేదని తెలిపారు. ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలోనూ వణుకుతున్న గొంతుతో, కన్నీటి పర్యంతమవుతూ ఆవేదన వ్యక్తం చేసింది. తన కొడుకు గదిలోకి లాక్కెళ్లిపోయాడనీ, అక్కడే బంధించి ఆహారం, నీళ్లు, మందులు ఏమీ ఇవ్వలేదని తెలిపింది. రాత్రి పూట స్నేహితులతో కలిసి మద్యం సేవించి తనని కర్రతో కొట్టాడని చెప్పింది. గత తొమ్మిది రోజుల నుంచి ఆహారం పెట్టలేదని బాధిత మహిళ వాపోయింది. పొరుగువారు గేటు కింద నుంచి ఆహారం ఇవ్వడానికి ప్రయత్నించేవారని, కానీ కొడుకు 45 రోజులుగా దాన్ని లాక్కెళ్లేవాడని పేర్కొంది. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి బంధువులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని ఏఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు.





# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి మసూద్ అజార్?

**ఇస్లామాబాద్, జూలై 18:** పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ చీఫ్ మసూద్ అజార్ కదలికలను ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. అతడి అడ్డా అయిన బహవల్పూర్ నుంచి 1,000 కిలోమీటర్ల దూరంలోని గిల్గిత్ బల్టిస్థాన్ ప్రాంతంలో ఉన్నట్లు తెలుస్తోంది. కొన్నాళ్ల కిందటే స్కర్దూలోని సద్‌పర రోడ్ ప్రాంతంలో అతడిని గుర్తించారు. ఆ ప్రదేశంలో రెండు మసీదులతోపాటు మదర్సాలు, చాలా ప్రైవేటు, ప్రభుత్వ అతిథి గృహాలున్నాయి. బాహ్య ప్రపంచం నుంచి దూరంగా ఉండాలంటే జైషే ఛీఫ్‌నకు పికెకు మించిన ప్రదేశం లేదు. సహజసిద్ధమైన పార్కులు, సరస్సులతో ప్రశాంతంగా ఉంటుంది. ఇటీవల పాక్ పీపుల్స్ పార్టీ అధినేత బిలావల్ భుట్టో జర్దారీ మాట్లాడుతూ మసూద్ అఫ్ఘానిస్థాన్‌లో ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. అవసరమైతే అతడిని భారత్‌కు అప్పగించేందుకు పాక్ సిద్ధంగా ఉందన్నారు. అల్‌జజీరా న్యూస్‌ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ జైషే మహమ్మద్ సంస్థ నేత మసూద్ అజార్ తమ దేశంలో లేదని, ఒకవేళ ఉన్నట్లు భారత్ కచ్చితమైన సాక్ష్యాలు సమర్పిస్తే అతడిని అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. లష్కరే తొయిబా అధిపతి హాఫీజ్ సయీజ్, జైషే మహమ్మద్ (జెఎం) చీఫ్ మసూద్ అజార్‌లను భారత్‌కు అప్పగించడం గురించి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ 'హాఫీజ్ సయీద్ పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నాడంటూ వస్తున్న వార్తలు అవాస్తవం. అతను కస్టడీలోనే ఉన్నాడు. మసూద్ అజార్ ఎక్కడున్నాడో మాకు తెలియదు. అఫ్ఘానిస్థాన్‌లో ఉన్నాడేమో ఒకవేళ అతడు పాక్ గడ్డపైనే ఉన్నట్లు భారత ప్రభుత్వం మాకు కచ్చితమైన సమాచారం ఇస్తే అతడిని అప్పగించడానికి ఎటువంటి అభ్యంతరం లేదు' అని భుట్టో పేర్కొన్నారు. జైషే సంస్థ ఆన్‌లైన్ ఖాతాలు ఇంటెలిజెన్స్ వర్గాలను తప్పుదోవ పట్టించేలా పలు పోస్టులు చేస్తున్నాయి. ఈ క్రమంలో పాత ఆడియోక్లిప్‌ను రీసైకిల్ చేసి ఆన్‌లైన్‌లో పబ్లిష్ చేయడం వంటి వాటికి పాల్పడుతున్నాయి. అయినా నిఘా వర్గాలు మాత్రం జాగ్రత్తగా అతడి కదలికలపై దృష్టి సారించాయి. భారత్‌లో పలు ఉగ్రదాడుల వెనుక మసూద్ హస్తం ఉంది. 2016లో పఠాన్‌కోట్ ఎయిర్ బేస్, 2019 పుల్వామా దాడికి జైషే పాల్పడింది.



### రష్యా సైనికులను వణికిస్తున్న నీళ్ల బాటిళ్లు..

# 'విష' కుట్ర వెనుక ఉక్రెయిన్?

**మాస్కో, జూలై 18:** ఉక్రెయిన్‌పై సుదీర్ఘకాలంగా పోరు సాగిస్తున్న రష్యన్ సైనికులకు కొత్త గుబులు పట్టుకుంది. ఇటీవల ఫ్రంట్‌లైన్‌లో ఉన్న నలుగురు సైనికులు తోటి సిబ్బంది కళ్లముందే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. విషం కలిపిన నీళ్లను తాగడం వల్లే వారు మృతి చెందినట్లు తెలిసింది. ఇదే నీళ్లు తాగిన చాలామంది సిబ్బంది ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రష్యా ఆక్రమిత డొనెట్స్క్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 'అవర్ వాటర్' పేరుతో ఉన్న ఈ నీళ్ల బాటిళ్లు మానవతా సాయం కింద ఈ ప్రాంతానికి వచ్చినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. క్రిమియాలోని సిమఫెరోపోల్ నుంచి వీటిని పంపించినట్లు గుర్తించారు. ఈ బాటిళ్లను ఎవరు పంపారు? ఫ్రంట్‌లైన్ జవాన్ల చేతికి ఎలా వచ్చాయి? వాటిలో ఎవరు విషం కలిపారన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నట్లు క్రెమ్లిన్ వర్గాలు వెల్లడించాయి.

ఈ కుట్ర వెనుక ఉక్రెయిన్ హస్తం ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం, సరకుల రవాణాకు అంతరాయం కలిగించాలనే ఉద్దేశంతోనే ఈ కోవర్ట్ ఆపరేషన్‌కు పాల్పడ్డారని రష్యన్ మిలిటరీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను ఉక్రెయిన్ వర్గాలు ఖండిస్తున్నాయి. సైనికుల డ్రగ్స్ వినియోగాన్ని దాచిపెట్టేందుకే మాస్కో ఈ అసత్యప్రచారం చేస్తోందని మండిపడ్డాయి.

**ఉక్రెయిన్‌పై భారీ దాడులు:** ఇదిలా ఉండగా ఉక్రెయిన్‌పై రష్యా దాడుల తీవ్రతను మరింత పెంచింది. శుక్రవారం 500కిలోల భారీ గ్లైడ్ బాంబును ప్రయోగించింది. ఈ ఘటనలో ఇద్దరు పౌరులు మృతి చెందగా, కనీసం25 మంది గాయపడ్డారు. 50 దుకాణాలు, 13 నివాస భవనాలు ధ్వంసమయ్యాయి. అంతకు ముందు గురువారం మాస్కోను లక్ష్యంగా చేసుకొని కీవ్ 100కు పైగా డ్రోన్లను ప్రయోగించింది. వీటిని సమర్థంగా కూల్చేసినట్లు రష్యా వెల్లడించింది.

## సంక్షిప్తంగా..


### కర్ణాటకలో ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్లు



**బెంగళూరు, జులై 18:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక నిర్ణయం తీసుకున్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్ల గ్రాంట్ విడుదల చేసేందుకు ఆమోదం తెలిపారు. పార్టీలో అంతర్గతంగా జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ మొత్తాన్ని ఇచ్చేందుకు సిఎం అంగీకరించారు. తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు సరిపోవడం లేదని కర్ణాటక పార్టీ ఇంచార్జి రణదీప్ సూర్జేవాలా వద్ద ఇటీవల ఎమ్మె ల్యేలు మొరపెట్టుకున్నారు. బెంగళూరులోని పార్టీ ఆఫీస్‌లో విడివిడిగా ఒక్కో ఎమ్మెల్యే ఆయనతో మాట్లాడారు. నిధుల జాప్యంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కీలకమైన ప్రాజెక్టులు కుంటుపడుతు న్నాయని చెప్పారు. ఈ విషయాన్ని సూర్జేవాలా సిఎం, డిప్యూటీ సిఎం డికె శివకుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీనిపై అంతర్గతంగా జరిగిన చర్చ అనంతరం చాలాకాలంగా పెండిం గ్‌లో ఉన్న కేటాయింపుల విడుదలకు ముఖ్య మంత్రి అంగీకరించారు. దీంతో ప్రతి ఎమ్మెల్యే రూ.50 కోట్ల గ్రాంట్‌ను పొందనున్నారు.

### ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతోన్న గూండారాజ్!

#### 2017 నుంచి 15వేల ఎన్‌కౌంటర్లు, 238 మంది హతం



**లక్నో, జూలై 18:** శాంతిభద్రతలు గాడితప్పుతూ గూండారాజ్ కొనసాగుతున్న ఉత్తరప్రదేశ్‌లో పరి స్థితులను 'బుల్లెట్ రాజ్'తో అదుపులోకి తీసు కువచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. 2017లో యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 14,973 ఎన్‌కౌంటర్లు జరగ్గా 238 మంది మృతి చెందారని తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లలో 9,467మంది నేరగాళ్లకు గాయాలుకాగా 30,694 మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ అరెస్ట య్యారు. ఈగణాంకాలపై ఉత్తరప్రదేశ్ డిజిపి రాజీవ్‌కృష్ణ గురువారం మీడియాతో మాట్లాడుతూ సిఎం యోగి ఆదిత్యనాథ్ ఆదే శాల మేరకు నేరస్థులపై కఠినచర్యలు తీసు కుంటున్నామన్నారు. 2017 నుంచి తీసుకున్న కఠిన చర్యలతో ఇప్పుడు దేశంలోనే యుపి అత్యంత సురక్షిత రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందన్నారు.

### సంగ్లీ జిల్లాలోని ఇస్లాంపుర్ పేరును ఈశ్వర్‌పుర్‌గా మార్పు



**ముంబయి, జులై 18:** మహారాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. సంగ్లీ జిల్లాలోని ఇస్లాంపుర్ పేరును ఈశ్వర్‌పుర్‌గా మార్పు చేసినట్లు ప్రకటించింది. ఈ మేరకు నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి ఛగన్ భుజ్‌బల్ అసెంబ్లీ వేదికగా శుక్రవారం ప్రకటించారు. రాష్ట్ర మంతివర్గం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆమోదం కోసం కేంద్రానికి పంపనున్నట్లు చెప్పారు. మహారాష్ట్రలో ఇప్పటికే ఔరంగాబాద్‌ను ఛత్రపతి శంభాజీనగర్‌గా, ఉస్మానాబాద్‌ను ధారాశివ్‌గా మారుస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇస్లాంపుర్ పేరును ఈశ్వర్‌పుర్‌గా మార్చాలన్న డిమాండ్ ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉండగా తాజాగా హిందుత్వసంస్థ శివ్ ప్రతిష్టాన్ మరోసారి ఈ అంశంపై కలెక్టరేట్‌లో విజ్ఞాపన పత్రం అందచేసింది. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్రలో సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పేరు మార్పునకు ఆమోదం తెలిపింది. ఇస్లాంపుర్ పేరు మార్చాలన్న డిమాండ్ 1986 నుంచి పెండింగ్‌లో ఉందని శివసేన నేత ఒకరు తెలిపారు.

### లాలూ ప్రసాద్‌కు సుప్రీంలో చుక్కెదురు!



**న్యూఢిల్లీ,జూలై 18:** ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలుప్రసాద్ యాదవ్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీ హైకోర్టు తన పిటిషన్‌ను తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ లాలు సుప్రీంకోర్టును ఆశ్రయిం చారు. అయితే, ఈ కేసులో ట్రయల్ కోర్టు కార్య కలాపాలపై స్టే ఇచ్చేందుకు అత్యున్నత న్యాయ స్థానం నిరాకరించింది. అంతేకాదు, ఈ కేసు విచారణను వేగవంతం చేయాలని ఢిల్లీ హైకోర్టును ఆదేశించింది. లాలూ యాదవ్ 2004 నుంచి 2009వరకు రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం జరిగినట్టు ఆరోపణలున్నాయి. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఉన్న వెస్ట్ సెంట్రల్ జోన్ ఆఫ్ ఇండియన్ రైల్వేలో గ్రూప్ డి నియామకాల సమయంలో లాలు ఈ కుంభకోణానికి తెరతీసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయనతోపాటు ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఆయన భార్య, వారి ఇద్దరు కుమార్తెలు, మరో అధికారి కూడా ఉన్నారు.

# గురుకులాల్లో ఏ ఘటన జరిగినా అధికారులదే బాధ్యత



## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

### బిసి గురుకుల అధికారుల సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసి సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న బిసి గురుకులాల్లో ఏ సంఘటన జరిగినా అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గురుకులాల్లో చదువుతున్న విద్యా ర్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బిసి గురుకుల సొసైటీ అధికారులతో మంత్రి పొన్నం శుక్రవారం జూమ్ మీటింగ్‌లో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులుతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 327 బిసి గురుకులాల ప్రిన్సిపాల్‌లు, ఆర్సీఓలతో పాటు ఇతర అధికారులు జూమ్ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవల గురుకులాల్లో జరుగుతున్న వరుస సంఘటనలపై మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం వ్యక్తం చేశారు. ఆర్సిఓలు విధిగా గురుకులాలు తనిఖీలు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రిన్సిపాల్‌లు, టీచర్‌లు పిల్లలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు పై అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పిల్లలకు నాణ్య మైన ఆహారం అందించడంలో రాజీపడద్దన్నారు. ఎవరైనా నిరక్ష్య వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. పిల్లలకు పోషకాలతో పౌష్టికాహారం అందించడం కోసం ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిందని గుర్తు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. అలాగే.పాఠశాలలో శుభ్రత పాటిం చాలని ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

# పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రణాళిక

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు తెలంగాణ సర్కార్ కార్యాచరణను సిద్ధం చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్వ ప్రాథమిక విద్య కోసం వచ్చే పిల్లలందరికీ క్రమం తప్పకుండా పాలు అందించనున్నారు. అలాగే ఉదయం పూట అల్పాహారం కింద ఉప్మా ఇస్తారు. అంగన్‌వాడీల్లోని 3 నుంచి 6 ఏళ్ల వయసు పిల్లలకు ఇప్పటిదాకా ఒక పూట అన్నం అందిస్తూ రోజుకో గుడ్డు చొప్పున ఇస్తున్నారు. ఇప్పుడు వీరికి అదనంగా 100 మిల్లి లీటర్ల పాలు, ఉదయం అల్పాహారం కూడా ఇవ్వాలని అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జాతీయ స్థాయిలో పోల్చితే రాష్ట్రంలోని చిన్నారులు వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు, బరువు సరిగా లేనట్లు సర్వేల్లో వెల్లడైంది. ఈ లోపాన్ని అధిగమించేందుకు పలు కార్యక్రమాలను, పోషకాహార ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. కౌమార బాలికలకు చిరుధాన్యాలతో పాటు, పల్లీ చిక్కీలు ఇస్తున్న ప్రభుత్వం కొత్తగా వారి ఇంకా అదనపు పోషకాహారం ఇవ్వాలని యోచిస్తోంది.

# ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పథకాలు

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హనుమకొండ బ్యూరో, ప్రభాతవార్త:** నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులోని శ్రీ ఫంక్షన్ హాలులో నూతన రేషన్ కార్డుల పంపిణీ, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలు, వివోఏలకు స్టీల్ బ్యాంక్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పర్యావరణానికి, మానవాళికి ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరంగా మారిందని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు స్టీల్ బ్యాంకు ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహెడలో స్టీల్ బ్యాంకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించామని అన్నారు. మహిళా సంఘాలు స్టీల్ బ్యాంకు బాధ్యతలను నిర్వర్తిస్తారని, గ్రామాలలో స్టీల్ బ్యాంక్ నిర్వహణకు వారే బాధ్యులని పేర్కొన్నారు.

గ్రామాలలో ఏ కార్యము జరిగిన వీటిని వినియోగించుకునేలా వివోఏలు కృషి చేయాలన్నారు. మానవ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్న కాలుష్యాల్లో ప్లాస్టిక్ ఒకటని, ప్లాస్టిక్ వాడకంతో ఆరోగ్యానికి హానికరంగా, విషంగా మారుతుందన్నారు. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా అందరూ కూడా స్టీల్ వస్తువులనే వినియోగించాలని సూచించారు. ఫంక్షన్స్ లో ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో స్టీల్ లేదంటే మోదుగు ఆకు విస్తర్లను వాడాలన్నారు. ప్లాస్టిక్‌ను వాడొద్దని కోరారు.

నియోజకవర్గంలో 340 హోటల్స్ ఉండగా వాటికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండలంలో ఉన్న 49 హోటళ్లకు 100 స్టీల్ ప్లేట్లు, గ్లాసుల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని తన తండ్రి పేరిట స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేసి వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు.

# మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి



### పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

### ఘనంగా ఇందిరా మహిళాశక్తి సంబురాలు

### మహిళా సంఘాలకు రెండు ఆర్టీసీ బస్సుల అప్పగింత

**చిట్యాల, జూలై 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా పనిచేస్తుందని, వారి ఆర్థిక స్వాలంబన సాధిం చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రామీణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పిఎసిఎస్ కార్యాలయ ఆవరణలో గ్రామీణ అభివృద్ధి శాఖ, సేర్ఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్యక్షతన ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అనేక సంక్షేమ, ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి కృత నిశ్చయంతో పని చేస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు అనేక వ్యాపార, అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిందని పేర్కొన్నారు. మహిళలు తమ ఆలోచనలను ప్రభు త్వంతో పంచుకోవాలని, నూతన ఓ రవడులతో కొత్త వ్యాపారాలను ఎన్నుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నట్లు చెప్పారు. ప్రతి మహిళ సంఘాలలో చేరాలని సూచించారు. పదహారేళ్ల నుండి 60 ఏళ్ల వృద్ధురాలు వరకు సంఘంలో చేరే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని పునరుద్ధరించారు. ఇందిరాగాంధీ మహిళా శక్తి చాటి పాకిస్తాన్ ను గడగడలాడించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు.

ఇందిరా గాంధీ ఉక్కు మహిళగా గుర్తించబడిందని తెలిపారు. పేదరిక నిర్మూలన అంటే మహిళలు ఆర్థికంగా ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధానిలో నీ శిల్పారామంలో 300 కోట్లతో నిర్మించిన స్టాల్లో మహిళలు తయారు చేసిన వస్తువులను విక్రయించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందిరమ్మ గృహ నిర్మాణాల కోసం ముందస్తుగా పెట్టుబడి సహాయం చేసి మహిళలను ఓనర్లుగా చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని స్పష్టం చేశారు. సంఘంలోని మహిళలు మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకునేందుకు సాధారణ మరణానికి రూ 2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ, 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళలకు మహిళా శక్తి క్యాంటీన్లు, గోడం, మిల్లులు, పెట్రోల్ బంకులు, పౌల్ట్రీ ఫార్మ్స్, సోలార్ విద్యుత్తు, ఆర్టీసీ బస్సులను వ్యాపార సదుపాయాలుగా అందించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే సంఘాలకు 26 వేల కోట్ల రుణాలను ఇచ్చామని, రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డల ప్రభుత్వాన్ని స్పష్టం చేశారు. 18 నెలల కాలంలో మహిళల ఆర్థిక అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# ఉద్యాన శాఖలో 175 మంది విస్తరణాధికారుల నియామకం

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** ఉద్యానవన శాఖను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 175 మంది ఉద్యానవన విస్తరణాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా 2026 మార్చి 31 వరకు రాష్ట్ర హార్టి కల్చర్ శాఖ డైరెక్టర్ నియంత్రణలో పనిచేయడానికి ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదికన నియామకం చేపట్టారు. అత్యదికంగా భద్రాద్రి కొత్తగూడెంలో 13 మంది, ఖమ్మంలో 12, నల్లగొండ జిల్లాలో 11 మంది, రంగారెడ్డి జిల్లాలో 10, వికా రాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాలో 07 గురిని నియమిం చారు. వీరికి నెలకు రూ. 22,750 వేతన ఇవ్వనున్నట్లు ప్రభుత్వం సాధారణ పోస్టులు భర్తీ చేసేవరకు వారే విధుల్లో ఉంటారని వెల్లడించింది. కాగా ఉద్యాన శాఖలో, సాగులో శాస్త్ర సాంకేతిక మెలకువలు, సలహాలు సూచనలను ఇవ్వడానికి క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో వ్యవసాయ విస్తరణ అధికారిలాగా ఉద్యాన విస్తరణ అధికారి లేకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న 175 మంది ఉద్యాన విస్తరణ అధికారులల్లో చాలా తక్కువ మంది క్వాలిఫైడ్ వాళ్ళు ఉన్నారు. ఆ విధంగా కాకుండా ఉద్యాన విశ్వవిద్యాలయం డిప్లమా, ఉద్యాన డిగ్రీ చదివిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తే అటు ఉద్యాన రైతులకు, ఉద్యాన పట్టభద్రు లకు లాభం చేకూర్చి రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని అ శాఖ ఉద్యోగవర్గాలు సూచిస్తున్నాయి.



సర్పంచుల నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

# భారీగా తగ్గిన పంట విస్తీర్ణం

### 61 లక్షల ఎకరాల్లోనే సాగు

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** తెలంగాణలో వానాకాలం పంటల సాగు విస్తీర్ణం భారీగా తగ్గుదల చోటు చేసుకుంది. ఈ సీజన్లో ఇప్పటివరకు కేవలం 46 శాతం భూముల్లోనే రైతులు వివిధ పంటలు సాగు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలను సాగు చేయాల్సి ఉండగా, కేవలం 61 లక్షల ఎకరాల్లోనే రైతులు పంట సాగు చేశారని వ్యవసాయ శాఖ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ప్రధాన పంటైన వరి విస్తీర్ణం 62.78 లక్షల ఎకరాలు కాగా, కేవలం 7.78 లక్షల (12.46 శాతం ) ఎకరాల్లో మాత్రమే రైతులు సాగు చేశారు. అలాగే 48.93 లక్షల ఎకరాలు ఉండే పత్తి 38.57 లక్షల ఎకరాల్లోను, 6.70 లక్షల ఎకరాలు ఉండే కంది 3.44 లక్షల ఎకరాల్లో, 5.21 లక్షల ఎకరాలు ఉండే మొక్కజొన్న 4.50 లక్షల ఎకరాల్లో, 4.20 లక్షల ఎకరాలు ఉండే సోయాబీన్ 3.31 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ తన నివేదికల్లో వెల్లడించింది. వీటితో పాటు పప్పు ధాన్యాలు, నూనె గింజల పంట సాగు కూడా తగ్గిపోయిందని తెలిపిన వ్యవసాయ శాఖ తెలిపింది. ఊహించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్లనే పంట సాగు విస్తీర్ణం తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

# కెసిఆర్‌ది ఫామ్‌హౌజ్ పాలన.. రేవంత్‌ది ప్రజాపాలన

### బండి సంజయ్, కెటిఆర్, హరీశ్ అచానక్ లీడరు అయిండ్రు

### బావ, బామ్మర్దులది పనికిమాలిన ఏడుపు : మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరబాద్, జూలై 18, ప్రభాతవార్త:** పదేళ్ల రాజభోగాలు అనుభవించి పదవి పోయేసరికి షాక్‌లో ఉండి బావ బామ్మర్దులది పనికిమాలిన ఏడుపు ఏడుస్తున్నారని.. చంద్రబాబు, రేవంత్ రెడ్డి రెండు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులు తెలంగాణ హక్కుల సాధనకోసమే సిఎం, మంత్రులు ఢిల్లీకి వెళ్తున్నారని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగం అయ్యి బనకచర్ల గురించి మాట్లాడినట్లు న్నారని వివరణ ఇచ్చారు. జలశక్తి శాఖ ప్రకటనలో బనకచర్ల అంశం లేనేలేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల అంశాలపై ముఖ్యమంత్రులు కూర్చుని చర్చించడంలో తప్పేముందని అని ప్రశ్నించారు. కెసిఆర్‌ది ఫాంహౌజ్ పరిపాలన, రేవంత్‌రెడ్డిది ప్రజాపరిపాలన అని అన్నారు. 'మీరు ఫాం హౌజ్ లో పడుకున్నారని, మమ్మల్ని కూడా ఫాం హౌజ్ లోనే పడుకోమంటారా?' జగ్గారెడ్డి నిలదీశారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం కేసీఆర్ ఎప్పుడైనా ఢిల్లీకి వెళ్లారా అని ప్రశ్నించారు. బిఆర్ ఎస్ పాలన సరిగా లేకనే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని అన్నారు. కెసిఆర్ పర్మనెంట్‌గా ఫాంహౌజ్‌కే పరిమితమయ్యారంటూ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని జగ్గారెడ్డి అన్నారు. పార్టీ నుంచి తెలంగాణ పదాన్ని తీసేసిన వాళ్ల తెలంగాణ కోసం అడిగే అర్హత ఎక్కడిదని నిలదీశారు. 'హరీశ్‌రావు ఎక్కడ పడుకుంటే మాకెందుకు?' అని ఆయన అన్నారు. హరీశ్ అంత యాక్టింగ్ మాకు రాదు. ఉత్తమ్ యాక్టర్ కాదు ఫైటర్ అని అన్నారు. హరీశ్, కేటీఆర్, బండి సంజయ్ అచానక్ లీడర్లు అయిండ్రు అని ఆయన వివరించారు. కేటీఆర్ లోకేష్ ను ఎందుకు కలిశావు సమాధానం చెప్పు అని నిలదీశారు.

# డ్రగ్స్‌తో దుబాయిలో చనిపోయిన కేదార్‌తో పెట్టుబడులు పెట్టించిందెవరు?

### సొంత చెల్లెలి ఫోన్ ట్యాప్ చేసిన ఘనత కెటిఆర్‌ది

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి




**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** డ్రగ్స్ కారణంగా చనిపోయిన కేదార్ అనే వ్యక్తితో దుబాయ్‌లో పెట్టుబడులు పెట్టించిందెవరు? కెటిఆర్‌కు మృతుడికి మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్న సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల్లో తప్పేముంది? అని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నిలదీశారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ సొంత చెల్లెలి ఫోన్ ట్యాపింగ్ చేసిన కెటిఆర్ ఖమ్మం చౌరాస్తాలో కూర్చుని కమ్మని ముచ్చట్లు చెబుతున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం విచారణ జరుగుతోందని అలాంటిది కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మా మంత్రుల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని చెబుతున్న కేటీఆర్ రాత్రి కలగన్నారా అని ఎద్దేవా చేశారు. నీటి కేటాయింపుల్లో మన వాటా మనకు దక్కాల్సిందేనని చెప్పారు. కేటీఆర్ రచ్చ, చర్చ అని ఆరోపణలు చేస్తున్నారని కానీ గత పదేళ్లు చర్చ లేకుండా అసెంబ్లీ నడిపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క గ్యారెంటీ కూడా అమలు చేయలేదని మాట్లాడుతున్న కెటిఆర్‌కుకు కళ్లు కనపడటంలేదా అని నిలదీశారు. కేంద్ర జలశక్తి శాఖ ఇరు రాష్ట్రాల సీఎంలను ఢిల్లీకి పిలిపించింది. రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై నెలకొన్న సమస్యలపై చర్చిం చేందుకే వారిని రప్పించినట్లు పత్రికా ప్రకటన కూడా విడుదల చేసింది. దానిని పక్కన పెట్టి బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చించారంటూ బిఆర్‌ఎస్ నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అన్నారు.

# ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దు

### మాజీ సర్పంచ్‌ల జెఎసి అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** సర్పంచులు కూడా ఎవరు కూడా ఆత్మహత్యలు చేసుకోవద్దు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు మీ పోరాటానికి మేము అండగా ఉంటామని ప్రభుత్వం బిల్లులు చెల్లించే వరకు పోరాటం చేసి సాధించుకోవాలి ఎవరు కూడా అధైర్య మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటి రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని జోన్ ఇందిరాపార్క్ వద్ద పెండింగ్ లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన సర్పంచ్‌ల మహాధర్నా జరిగింది. గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులకుపెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను వెంటనే చెల్లిం చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కేశ బోయిన మల్లయ్య మెడబోయిన గణేష్ పూదూరి నవీన్‌గౌడ్ రాజేందర్ అంజయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై మద్దతు తెలిపారు.

# సర్పంచుల పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలి

### న్యాయపోరాటానికి అండగా ఉంటా: మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూలై 18, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సర్పంచులకు ఇవ్వవలసిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌వద్ద రెండు సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరై శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సర్పంచుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకూడదని, వారు తమ స్వంత నిధులతో గ్రామాలను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా సర్పంచులకు ఏ సమస్య వచ్చినా, వారికి అండగా నిలిచానని, ఇప్పుడు కూడా ప్రజా ప్రతినిధుల ఫోరం నాయకునిగా, తెలంగాణ ఉద్యమకారునిగా, సర్పంచులు చేస్తున్న న్యాయపోరాటానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా స్పందించి, సర్పంచుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా, పెండింగ్ బిల్లులను చెల్లించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా సర్పంచులపై కక్షసాధించటం న్యాయం కాదని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ నేతలు గుంటి మధుసూదన్‌రెడ్డి, మాట్ల మధు, రాంపాక నాగయ్య, పూదూరి నవీన్‌గౌడ్, నెమలి సుభాష్‌గౌడ్, వెంకటాపూర్ రాజేందర్, కేశబోయిన మల్లేష్, సముద్రాల రమేష్, శారద, కల్పన, రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు పెద్దఎత్తున హాజరయ్యారు.

# గచ్చిబౌలి స్థలాలను భాగ్యనగర్ టిఎన్‌జిఒలకే కేటాయించాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు టిఎన్‌జిఒ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** గచ్చిబౌలి స్థలాలను భాగ్యనగర్ టిఎన్‌జి వోలకే కేటాయించాలని కోరుతూ టిఎన్‌జివో కేంద్ర సంఘం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకి విజ్ఞప్తి చేసింది. గచ్చిబౌలి భాగ్యనగర్ తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్ మ్యుచివల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటి .. తమకు కేటాయించిన స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు తమది అంటు స్థలం కబ్జాకు యత్నిస్తున్నారని ప్రభుత్వం వెంటనే ఆ స్థలాలను గత ఉత్తర్వుల మేరకు బిటిఎన్‌జీవోస్ సొసైటీకి కేటాయించాలని టిఎన్‌జివో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు టిఎన్‌జివో కోశాధికారి ముత్యాల సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు కొండలు రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావుతోపాటు ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రిని శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేసినట్టు టిఎన్‌జివో సంఘం నేతలు తెలిపారు. స్పందించిన సిఎస్.. తప్పకుండా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినందుకు టిఎన్‌జివో సంఘం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు అధ్యక్షులు మారం జగదీశ్వర్ తెలిపారు. దాదాపు 4 వేల మంది రిటైర్ ఉద్యోగులు, సర్వీసులో ఉన్న ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని.. ఆ స్థలాలను వారికి కేటాయించాలని సిఎస్‌ని, ముఖ్యమంత్రి కార్యదర్శిని కోరినట్టు వారు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

# మల్కాజిగిరిలో గూండా పాలన

### పోలీసుల బానిసగిరి భరించలేం : కెటిఆర్

**హైదరాబాద్ (మల్కాజిగిరి), జూలై 18, ప్రభాతవార్త :** మల్కాజిగిరిలో కాంగ్రెస్ నేతలు గూండాగాళ్లలా ప్రవర్తిస్తుండగా, వారిని నియంత్రించాల్సిన పోలీస్ యంత్రాంగం వారికి ఆశ్రయం ఇచ్చే స్థాయికి దిగజారిందని, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కార్యకర్తలపై దాడులు చేసిన కాంగ్రెస్ గూండాలను కాపాడేలా వ్యవహరిస్తున్న పోలీసుల తీరుపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. 'అక్కడక్కడ పిచ్చికుక్కలు ఉంటాయని విన్నాం. కానీ మల్కాజిగిరిలో ప్రత్యక్షంగా చూస్తున్నాం. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. దాడిచేసి కూడా తిరిగి గూండా గాళ్లలా సవాలు విసురుతున్నారు. ఇంతకీ పోలీసులు ఎవరి పక్షంగా ఉన్నారు?' అని కేటీఆర్ ఘాటుగా ప్రశ్నించారు.

**చిల్లర రాజకీయాలకు బానిసలైన పోలీసులు**

'గుళ్ల దగ్గర చెక్కుల పంపిణీకి వెళ్లిన మా నాయకులపై దాడిచేసిన వారిని వదిలేసి, రీట్వీట్ చేసిన వారిపై కేసులు పెడుతున్నాయి. ఇలాంటి పోలీస్ వ్యవస్థ ఎలా న్యాయాన్ని పరిరక్షించగలదు? ప్రజల రక్షణ బాధ్యత వహించాల్సిన వారు – ఇప్పుడు దాడులు చేసే వారికే బాసటగా నిలుస్తున్నారు' అని విమర్శల వర్షం కురిపించారు. 'ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి సిద్ది పేటలో హరీశ్‌రావు కార్యాలయం మీద దాడి చేసినప్పుడు పోలీసులు ఒక్క అడుగు ముందుకువేయలేదు. కానీ బీఆర్‌ఎస్ కార్యకర్తలు ట్వీట్ చేస్తే మాత్రం చట్టం మొహం చూపుతోంది. ఇదేం న్యాయం?' అని ప్రశ్నించారు.

# బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం కావాల్సిందే

### మాజీ డిజిపి పూర్ణచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** బీసీలు అందరితోపాటు సమాజంలో గౌరవంగా బతకా లంటే తప్పనిసరిగా బిసిలకు రక్షణ చట్టం కావాల్సిందేనని ఆల్ ఇండియా బిఎస్పీ పార్టీ జాతీయ కోఆర్డినేటర్, విశ్రాంత డిజిపి డా. జుజ్జవరపు పూర్ణచంద్ర రావు అన్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి సమాజ్ అధ్యక్షులు సంగెం సూర్యారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి మాజీ ఐఎఎస్ చిరంజవులు, విజెఆర్ నారగోని తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా పూర్ణచందర్ రావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో బిసిలు అనచివేతకు గురవుతున్నా రన్నారు. గతంలో ఎస్సీలపై దాడులు జరగడంతో ఎస్సీ రక్షణ చట్టం వచ్చిందని ఇప్పుడు బీసీలు మాట్లాడ డానికే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఇటీవల బీసీ రాజకీయ నాయకులు అనేక దాడులు చేస్తున్నారని అందులో భాగంగానే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపైనా దాడి జరిగిందన్నారు. భారత రాజ్యాంగం అందరికీ సమానత్వాన్ని హామీ ఇస్తున్నప్పటికీ, బిసిలు ఇంకా వివక్ష, దౌర్జన్యం, సామాజిక బహిష్కరణకు గురవు తున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక చారి త్రకమైన రక్షణ చట్టాన్ని రూపొం దించాల్సి న అవసరం ఉందన్నారు. వెనుకబడిన తరగతులపై 'వివక్ష, అణచివేత నిరోధక చట్టం, 2025' అనే ముసాయి దాను బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ నాయకులు విడుదల చేసారు. ఈ చట్టం ద్వారా బీసీలపై జరిగే సామాజిక, ఆర్థిక, శారీరక అణచివేతను నిరోధించ డంతోపాటు, బాధితులకు న్యాయం, గౌరవం, పునరా వాసం కల్పించేందుకు నూతన నిబంధనలు రూ పొందించ బడ్డాయన్నారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన వెంటనే, రాష్ట్రంలోని బీసీ వర్గాలపై జరిగే వివక్షను సమూలంగా అరికట్టగలదని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేం దర్‌గౌడ్, యువజన సంఘం అధ్యక్షులు కనకాల శ్యాంకురుమ, వివిధ సంచార జాతుల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో అభివాదంచేస్తున్న పూర్ణచందర్‌రావు, చిరంజీవులు, సూర్యారావు, విజెఆర్ నారగోని తదితరులు

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 229

**హైదరాబాద్ (బేగంపేట) జూలై 18, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన సిఎం ప్రజావాణిలో మొత్తం 229 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సం బంధించి 63 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 45 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 27 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 59 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్ చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.

# అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు దీర్ఘకాలిక సిరలవ్యాధి

### భయమేమీ లేదని వైట్‌హౌస్ వెల్లడి

**వాషింగ్టన్, జూలై 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు దీర్ఘకాల సిరల వ్యాధి (సీవీఐ ఇన్‌ఫిషియన్సీ) ఉన్నట్లు నిర్ధరణ అయ్యినట్లు వైట్ హౌస్ ప్రకటించింది. అయితే ఇది సాధారణ రక్తప్రసరణ వ్యాధి మాత్రమే నని, 70 ఏళ్ల దాటిన వారిలో సాధారణంగా ఇది కనిపిస్తుందని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు.



భయపడాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం ట్రంప్ ఆరోగ్యంగానే ఉన్నట్లు మీడియాకు తెలిపారు. గత కొద్ది రోజులుగా అధ్యక్షుడు ట్రంప్ కాళ్ల దిగువ భాగంలో, చేతి మణికట్టు వద్ద తేలికపాటి వాపును గమనించారు. దీంతో వైద్యులు పరీక్షించగా, ఇది 70 ఏళ్ల పైబడిన వాళ్లలో వచ్చే సాధారణ సిరల లోపం అని వెల్లడించారు. భయపడాల్సినంత పరిస్థితి అయితే కాదని వైద్యులు తెలిపారు. డీప్ వీన్ థ్రోంబోసిస్ (రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం) లేదా ఆర్టీరియల్ వ్యాధి (ధమనులు మూసుకుపోవడం) వంటివి కాదు. ఇతర వైద్యపరీక్షల్లో గుండె, కిడ్నీ వైఫల్యం లాంటివి ఏమీ కాదని లీవిట్ తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని, ఆయన ఎలాంటి అసౌకర్యానికి గురవడం లేదని చెప్పారు. అవి తరుచుగా కరచాలనం చేయడం, ఆస్పిరిన్ వాడకం వల్ల కలిగే సమస్యగా అని తెలిపారు. ప్రస్తుతానికి చికిత్స వివరాలను వెల్లడించలేదు. అయితే అధ్యక్షుడి వైద్య బృందం దీనిపై దృష్టి సారించింది. లోతైనసిరలు కాళ్ల భాగంలో ఉంటాయి. వ్యాయామంతో ఈ సమస్యను అదుపులో వేయొచ్చు. కొన్నిసార్లు శస్త్రచికిత్స చేయాల్సి వస్తుంది.

## ప్రశాంతంగా ముగిసిన సెట్స్ పరీక్షలు

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ ఉన్నత కోర్సుల్లో చేరేందుకు నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ తెలిపారు. రాష్ట్రంలో ఎప్ సెట్, ఐ సెట్, ఎడ్ సెట్, లాసెట్, పిజి లాసెట్, పిజి ఈ సెట్, ఈ సెట్, పిఈ సెట్ వంటి 8 సెట్స్‌ను ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 8 సెట్స్‌కి రాష్ట్ర వ్యాప్తంగా 5.22 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కామన్ ఎంట్రన్స్ పరీక్షలు 126 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించినట్లు తెలిపారు. తొలిసారిగా సెట్స్ పరీక్షల్లో క్యూఆర్ కోడ్‌ను ప్రవేశ పెట్టి విద్యార్థులకు పరీక్షా కేంద్రాలను తెలుసుకోవడంలో సులభతరం చేసినట్లు తెలిపారు.



సి.నారాయణరెడ్డి కథాకావ్య సమాలోచనం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్‌రావు, శివారెడ్డి, వరప్రసాదరెడ్డి, చెన్నయ్య, భూమయ్య తదితరులు

## తెలుగుభాష ఫరిడవిల్లుతూనే ఉంటుంది

### మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్‌రావు

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 18, ప్రభాతవార్త:** ఆంగ్లభాష గురించి ఎంతగా గొప్పలు చెప్పుకుంటున్నా ఆ భాష మాట్లాడేవారు నేటికీ స్వల్పసంఖ్యాకులేనని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని గ్రామాలు మొదలుకొని పట్టణాల వరకు తెలుగుభాష అంతటా ఫరిడవిల్లుతూనే ఉంటుందని మహారాష్ట్ర మాజీ గవర్నర్, కేంద్ర మాజీ సహాయ మంత్రి సిహెచ్.విద్యాసాగర్‌రావు అన్నారు. శాంతా వసంతా ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన సిహెచ్. విద్యాసాగర్‌రావు, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య, అన్నమయ్య సాహితీ పరిశోధకుడు జి.బి.శంకరరావు, గ్రంథ రచయిత అనుమాండ్ల భూమయ్య, ట్రస్టు వ్యవస్థాపకుడు డా. కె.వి.వరప్రసాదరెడ్డి తదితరులతో కలిసి ప్రముఖ రచయిత అనుమాండ్ల భూమయ్య రచించిన సి.నారాయణరెడ్డి కథాకావ్య సమాలోచనం గ్రంథాన్ని ఆవిష్కరించారు. డా. వరప్రసాద్‌రెడ్డిని సత్కరించి తొలిప్రతిని అందజేసి ప్రసంగించారు.

తెలుగు భాష గొప్పదనాన్ని ఈతరానికి పరిచయం చేయ దానికి వివిధ సాహిత్య కార్యక్రమాలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో డా. సి.నారాయణరెడ్డి నాగార్జునసాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వనాథనాయుడు, ఋతుచక్రం తదితర కథాత్మక గేయ కావ్యాలు రచించి సుప్రసిద్ధ లయ్యారని తెలిపారు. వివరణా రచయిత అనుమాండ్ల భూమయ్యను ఘనంగా సన్మానించారు.


## సిమెంట్, స్టీల్ ధరల నియంత్రణ కమిటీ ఏర్పాటు


### ఇందిరమ్మ లబ్దిదారులకు ఉపశమనం

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటున్నవారికి ప్రభుత్వం ఊరట కలిగించింది. సిమెంట్, స్టీలు ధరలు పెరగకుండా ధరల నియంత్రణకు కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర ఛైర్మన్ సీఎస్, జిల్లాల ఛైర్మన్లుగా కలెక్టర్లను నియమించింది. ఈ కమిటీ సిమెంట్, స్టీల్‌కుక ధర నిర్ణయించి, లబ్దిదారులకు ఆ ధరకే విక్రయించేలా చర్యలు చేపట్టనుంది. కాగా ఇప్పటికే ఇల్లు కట్టుకునేవారికి ఉచితంగా ఇసుక అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## సినీ నటుడు ఫిష్ వెంకట్ కన్నుమూత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 18:** తెలుగు చిత్ర నటుడు ఫిష్ వెంకట్ (53) కన్నుమూశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆయన శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.





రెండు కిడ్నీలూ చెడి పోవడంతో డయాలసిస్ కోసం కుటుంబ సభ్యులు ఆయన్ను కొన్ని రోజుల క్రితం ఆస్పత్రిలో చేర్చారు. రెండు కిడ్నీలు మార్చాలని వైద్యులు తెలిపారని ఆయన కుమార్తె ఇటీవల మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. వైద్య సేవలు పొందలేని దీన స్థితిలో ఉన్నామని, దాతలు ఎవరైనా సాయం చేయాలని ఆమె కోరారు. ఇంతలోనే ఆయన మృతిచెందడం విచారకరం. ఫిష్ వెంకట్ అసలు పేరు మంగలంపల్లి వెంకటేష్. ముషీరాబాద్ మార్కెట్లో చేపల వ్యాపారంతో ఫిష్ వెంకట్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు.

రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న వెంకట్.. నటుడు శ్రీహరి ద్వారా సినీపరిశ్రమలోకి వచ్చారు. డైరెక్టర్ వీవీ వినాయక్ ఆయన్ను నటుడిగా పరిచయం చేశారు. వెంకట్ వందకు పైగా చిత్రాల్లో హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రేక్షకులను అలరించారు. ఆది, దిల్, బన్నీ, అత్తారింటికి దారేది, గబ్బర్ సింగ్, డీజే టిల్లు, కింగ్, డాన్ శీను, మిరపకాయ్, దరువు, సుప్రీమ్ తదితర హిట్ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన చివరగా కాఫీ విత్ ఏ కిల్లర్ చిత్రంలో నటించారు.

# కొన్ని దేశాల్లో ఆగస్టు 2న అద్భుత సూర్యగ్రహణం



**న్యూఢిల్లీ, జూలై 18:** యూరప్, ఉత్తర ఆఫ్రికా, మధ్యప్రాచ్యంలోని ప్రాంతాల్లో, 2027 ఆగస్టు 2న అద్భుతమైన సూర్యగ్రహణం సంభవించనుంది. ఈ గ్రేట్ నార్త్ ఆఫ్రికన్ ఎక్లిప్స్‌గా పిలవబడే ఈ ఖగోళ దృశ్యంలో, చంద్రుడు సూర్యుని పూర్తిగా కప్పి వేయనుండడంతో, భూమి 6 నిమిషాల 23 సెకన్లపాటు అంధకారంలో మునిగి పోనుంది. ఇది 1991 నుండి 2114 వరకు భూమిపై కనిపించే అత్యంత సుదీర్ఘమైన సూర్యగ్రహణంగా నిలుస్తుంది, ఇది 100 ఏళ్లలో ఒక అరుదైన ఖగోళ సంఘటనగా నిలుస్తోంది. ఈ సూర్యగ్రహణం అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా ప్రారంభమై, తూర్పుదిశగా యూరప్, ఆఫ్రికా, మధ్యప్రాచ్యం వైపు కదులుతుంది. గ్రహణం పూర్తి దృశ్యం (టోటాలిటీ) 258 నుండి 275 కిలోమీటర్ల వెడల్పు గల సన్నని బ్యాండ్‌లో కనిపిస్తుంది. దక్షిణ స్పెయిన్‌లోని కాడిజ్, మలాగా వంటి నగరాల్లో 4 నిమిషాలకు పైగా చీకట్లు అలముకుంటాయి. ఉత్తర మొరాకోలోని టాంజియర్, టెటౌవాన్, మధ్య ఈజిప్ట్‌లోని లక్సర్ సమీపంలో 6 నిమిషాలకు పైగా పూర్తి అంధకారం కనిపిస్తుంది. నైరుతి సౌదీ అరేబియాలోని జెడ్డా, మక్కా, యెమెన్, ఈశాన్య సోమాలియా ప్రాంతాలు కూడా ఈ గ్రహణాన్ని చూడగలవు. గ్రహణం భారత మహాసముద్రంలో ముగిసేముందు చాగోస్ దీవులను దాటుతుంది. ఈ సూర్య గ్రహణం భూమి సూర్యునికి దూరంగా ఉండే సమయంలో (అఫీలియన్) మరియు చంద్రుడు భూమికి దగ్గరగా ఉండే సమయంలో (పెరిజీ) సంభవిస్తుంది. దీని వల్ల సూర్యుడు చిన్నగా, చంద్రుడు పెద్దగా కనిపించి, గ్రహణం దీర్ఘకాలికతను పెంచుతుంది. దానికితోడు, ఈ గ్రహణం భూమధ్యరేఖ సమీపంలో జరుగుతుంది, ఇక్కడ చంద్రుని నీడ భూమిపై నెమ్మదిగా కదులుతుంది, దీనివల్ల పూర్తి సమయం పెరుగుతుంది. ఈ అద్భుత సూర్యగ్రహణం భారతదేశంలో కనిపించదు. తూర్పుఆసియా, ఆస్ట్రేలియా, ఇతర కొన్ని ప్రాంతాల్లో కూడా ఈ గ్రహణం కనిపించకపోవచ్చు. కొన్నిచోట్ల కేవలం స్వల్పంగానే కనిపిస్తుంది.


# పింఛన్ దారులకు శుభవార్త.. వేలిముద్రలతో పని లేదు

### ఫేస్ రికగ్నిషన్‌తో వృద్ధుల పింఛన్ సమస్యలు పరిష్కారం

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** తెలంగాణలో ఆసరా పథకంలో భాగంగా అర్హులైన వారికి పింఛన్లు అందిస్తోంది ప్రభుత్వం. అయితే వీటిలో కొంత మందికి బ్యాంక్ అకౌంట్స్ లేవు.. వారికి నేరుగా వేలిముద్రలు తీసుకొని పింఛనులు పంపిణీ చేస్తున్నారు. ఒక వేళ వేలి ముద్ర పడకపోతే ఆ నెల పింఛన్ ఆగినట్లే. ఇలా దీనిలో వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక నుంచి ఆ సమస్య లేకుండా పరిష్కారం తీసుకొచ్చారు అధికారులు. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తోంది. అయితే. ఈ పంపిణీలో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా.. బ్యాంక్ ఖాతాలు లేని వారికి వేలిముద్రల ద్వారా పింఛన్లు ఇస్తున్నారు. కానీ.. వృద్ధుల వేలిముద్రలు సరిగా పడకపోతే ఆ నెల పింఛన్ ఆగిపోయేది. ఇది వారికి తీవ్ర ఇబ్బందులు కలిగించేది. అంతేకాకుండా.. మరణించిన లబ్ధిదారుల పేర్లను తొలగించకుండా పింఛన్లు స్వాహా చేస్తున్న ఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ సమస్యలకు పరిష్కారంగా.. ప్రభుత్వం ఇప్పుడు సరికొత్త విధానాన్ని ప్రవేశపెడుతోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పింఛన్ల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) ఆధారిత వ్యవస్థను అమలు చేయనుంది. దీని కోసం సెర్ప్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ద్వారా పింఛన్ ఇచ్చే సమయంలో వేలిముద్రతో పనిలేకుండానే లబ్ధిదారుని ముఖాన్ని గుర్తించి పింఛన్ పంపిణీ చేస్తుంది. ఇది వేలిముద్రలు పడని వృద్ధులకు.. ఇతర సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పింఛన్లు పొందేందుకు మార్గం సుగమం చేస్తుంది. ఈ నూతన విధానం అమలు కోసం పుర కమిషనర్లు, బిల్ కలెక్టర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, తపాలా శాఖ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పింఛన్ల పంపిణీలో పారదర్శకతను పెంచడానికి.. దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాటిలో..మరణించిన పెన్షన్ దారుల స్థానంలో వారి భార్యలకు అర్హత ఉంటే అవకాశం కల్పించడం. వలస వెళ్లి మూడు నెలలుగా పింఛన్ తీసుకోని, లేదా మృతిచెందిన లబ్ధిదారుల పేర్లను జాబితా నుంచి తొలగించడం. సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన పింఛన్లను పరిష్కరించడం. రెగ్యులర్ పెన్షన్‌దారుల వివరాలను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయడం. పురపాలికల్లో ఏడాదికి పైగా బ్యాంకు ఖాతాల నుంచి పింఛన్ తీసుకోని లబ్ధిదారులను గుర్తించడం. కొత్తగా అర్హులైన వారి వివరాలను రికార్డుల్లో నమోదు చేసి, ప్రభుత్వం అడిగిన వెంటనే ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచడం వంటి చర్యలు ఉన్నాయి. ఈ నూతన వ్యవస్థ ద్వారా ఆసరా పింఛన్ల పంపిణీ మరింత వేగవంతంగా. సురక్షితంగా, పారదర్శకంగా జరుగుతుందని అధికారులు ఆశిస్తున్నారు. ఇది లబ్ధిదారులకు ఎటువంటి అవాంతరాలు లేకుండా తమ పింఛన్లను పొందేలా చేస్తుంది. తద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## గడువుకు ముందే భారత్ అమ్ములపొదిలోకి కొత్త అస్సాల్ట్ రైఫిల్స్

**న్యూఢిల్లీ, జూలై 18:** భారత సైన్యం అమ్ములపొదిలోకి అత్యాధునిక ఏకే203 అస్సాల్ట్ రైఫిల్స్ వస్తున్నాయి. ఇవి సైనికుల పోరాట సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నాయి. భారత్, రష్యా సంయుక్తంగా ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలోని కోర్వా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఇండోరష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఆర్‌ఆర్ పీఎల్) కంపెనీలో ఈ రైఫిల్స్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి.



భారతదేశం, రష్యా మధ్య సుమారు రూ. 5,200 కోట్ల ఒప్పందం లో భాగంగా 6 లక్షలకు పైగా ఏకే203 రైఫిల్స్‌ను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 1,18,000 రైఫిల్స్ భారత సైన్యానికి అందాయి. డిసెంబర్ 2025 నాటికి ఈ రైఫిల్స్ ఉత్పత్తిలో 100 శాతం స్వదేశీకరణ సాధించాలని భారత్ యోచిస్తోంది. వాస్తవానికి ఒప్పందం ప్రకారం 2032 నాటికి 6 లక్షల రైఫిళ్లను సైన్యానికి అందించాల్సి ఉంది. అయితే, అనుకున్న సమయానికి 22 నెలల ముందే రైఫిళ్లను సైన్యానికి అందించేందుకు ఐఆర్‌ఆర్ పీఎల్ కృషి చేస్తోంది. ఈ రైఫిల్స్ నిమిషానికి 700 రౌండ్ల వేగంతో కాల్పులు జరపగలవు. ఇవి 7.62, 39ఎంఎం క్యాలిబర్ కలిగి ఉంటాయి. వీటి బరువు కేవలం 3.8 కిలోగ్రాములు, ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఇన్సాస్ రైఫిల్స్ 4.15 కిలోగ్రాములు కంటే తేలికైనవి. ప్రభావవంతమైన ఫైరింగ్ రేంజ్ 800 మీటర్ల వరకు ఉంటుంది. వీటిని 'షేర్' అని కూడా పిలుస్తారు. ఈ అత్యాధునిక రైఫిల్స్ భారత సైన్యం యొక్క ఫైర్‌పవర్‌ను పెంచి, సరిహద్దు భద్రతను బలోపేతం చేస్తాయి. మేక్ ఇన్ ఇండియా లో భాగంగా దేశీయంగా ఈ రైఫిల్స్ ఉత్పత్తి కావడం భారతదేశ రక్షణ రంగంలో స్వయం సమృద్ధిని సూచిస్తుంది. ఈ రైఫిల్స్ భారత సైన్యానికి లభ్యం కావడంతో దేశ రక్షణ సామర్థం మరింత పటిష్టమవుతుందని రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు.

## తెలంగాణకు రేవంత్‌రెడ్డి అన్యాయం చేయలేదు

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్యాయం చేయడం లేదని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఏళ్లుగా పంచాయితీ కొనసాగుతూనే ఉందని.. ఇటీవల ఏపీ ప్రభుత్వం గోదావరి బనచర్ల ప్రాజెక్టును నిర్మించేందుకు పూనుకోవడంతో తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. దీంతో ఈ వివాదంపై కేంద్ర జలశక్తి కలుగుజేసుకుని ఇరు రాష్ట్రాల సీఎంలతో సమావేశం నిర్వహించిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వివాదరహితంగా ప్రాజెక్టులు కట్టుకోవాలని నారాయణ సూచించారు. ఈ విషయంలో కేంద్ర జలశక్తి సమావేశాన్ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నా మన్నారు. నారాయణ శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ప్రతి అంశంపై ప్రధాన ప్రతిపక్షం సెంటిమెంట్లతో రెచ్చగొడుతున్నారని.. తెలంగాణకు రేవంత్‌రెడ్డి అన్యాయం చేయలేదని నారాయణ అన్నారు. తెలంగాణకు రేవంత్ అన్యాయం చేయ లేదని అంటూ.. పొట్టివాడు గట్టివాడు అని ప్రశంసించారు. రెండు రాష్ట్రాలు నీటి పంపిణీ ప్రాజెక్టుల సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. నీటి ప్రాజెక్టుల గురించి తమ పార్టీ ఎప్పుడూ సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణలో నీటి అంశాలను రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. టీఆర్‌ఎస్ కాస్త బీఆర్‌ఎస్‌గా మారిన తరువాత సెంటిమెంట్ ఎగిరిపోయిందని.. ఇప్పుడు సెంటిమెంట్లు లేవంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రతి అంశంపై సెంటిమెంట్లతో రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో చర్చించకపోవడం చంద్రబాబు తప్పేనని.. బనకచర్ల గురించి చంద్రబాబు మొదట మాట్లాడాల్సింది తెలంగాణ ముఖ్యమంత్రితో అని.. అలా చేయకపోవడం వల్ల విమర్శలు వచ్చి తెలంగాణ సీఎం ఆ ప్రాజెక్టను వ్యతిరేకించారని అన్నారు.

## 23 విద్యాసంస్థల బంద్‌కు సంపూర్ణ మద్దతు

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్, కాలేజీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యా సంస్థల బంద్‌కి అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఏఐవైఎఫ్ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాం డ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాపిత పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్‌కు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు సంఘం రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ తెలిపారు. బంద్‌కు సంబంధించిన గోడ పత్రికను హిమాయత్‌నగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేశారు.

# రెండు నెలల క్రితం కోమాలో.. నేడు బిటెక్ పరీక్షలకు

### 24 గంటల్లోనే జీవన్‌దాన్‌లో లివర్ కేటాయింపు

### ఉస్మానియా వైద్యులను అభినందించిన మంత్రి రాజనర్సింహ

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** రెండు నెలల కిందట ప్రాణాపాయ స్థితిలో కోమాలో ఉన్న ఒక యువతి.. ఇప్పుడు బీటెక్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు హాజరవుతోంది. ఆమెకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి పునర్జన్మను ప్రసాదించిన ఉస్మానియా హాస్పిటల్ డాక్టర్లను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. జూబ్లీహిల్స్‌తో తల్లితోపాటు నివాసం ఉంటున్న బ్లెస్సీ గౌడ్ ఈ ఏడాది మే నెలలో జ్వరం బారిన పడింది. తల్లి ఆమెను ప్రైవేటు హాస్పిటల్‌లో అడ్మిట్ చేయగా.. 5 రోజుల తర్వాత ఆమె కోమాలోకి వెళ్లింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెను మే 12న కుటుంబసభ్యులు ఉస్మానియా హాస్పిటల్‌లో చేర్పించారు. బ్లెస్సీని పరీక్షించిన ఉస్మానియా వైద్యులు, ఆమె లివర్ పూర్తిగా పాడైపోయిందని గుర్తించారు. 48 గంటల లోపల ఆమెకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తేనే బతుకుతుందని, లేదంటే ఆమె చనిపోయే ప్రమాదం ఉందని కుటుంబ సభ్యులకు వివరించారు. కాలేయ దానానికి ఆమె తల్లి, కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. వారిని పరీక్షించిన వైద్యులు, బ్లెస్సీకి వారి కాలేయం సరిపోలడం లేదని తేల్చారు. బ్లెస్సీ పరిస్థితిని వివరిస్తూ లివర్ కోసం జీవన్‌దాన్ సూపర్ అర్జంట్ కేటగిరీలో డోనర్ కోసం రిజిస్టర్ చేశారు. ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో బ్లెస్సీ బ్లడ్ గ్రూప్‌నకు మ్యాచ్ అయ్యే వ్యక్తి బ్రెయిన్ డెత్ అయ్యారు. ఆ వ్యక్తి లివర్‌ను, బ్లెస్సీ కోసం జీవన్‌దాన్ కేటాయించింది. మే 12వ తేదీన బ్లెస్సీ ఉస్మానియాలో అడ్మిట్ కాగా.. మే 14న ఉస్మానియా సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని వైద్యుల బృందం ఆమెకు ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసింది. రెండు వారాల తర్వాత బ్లెస్సీని హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకుని, ఫస్ట్ ఇయర్‌బీటెక్‌ఎగ్జామ్స్‌కు హాజరవుతోందని వైద్యులు తెలిపారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం హెచ్‌వోడీ మధుసూధన్ శుక్రవారం ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. దేశంలో సూపర్‌అర్జెంట్ కేటగిరీలో ప్రభుత్వ హాస్పిటల్‌లో ట్రాన్స్‌ప్లాంటేషన్ జరగడం ఇదే తొలిసారని తెలిపారు. బ్లెస్సీకి పూర్తిఉచితంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశామని, సహకరించిన మంత్రి రాజనర్సింహ, సిఎం రేవంత్‌రెడ్డికి మధుసూదన్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎనిమిది జిల్లాలను కలుపుతూ ఔటర్ రింగ్‌రైలు

### మూడు ప్రతిపాదనలు.. ఆరు మార్గాలకు సులభతర ప్రయాణం

**హైదరాబాద్, జూలై 18,ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే సికిందరాబాద్, నాంపల్లిపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు నగరం చుట్టూ ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు చేపట్టనుండటం ప్రతిపాదనలు సిద్ధం చేసింది . సికిందరాబాద్ స్టేషన్ ఆరు మార్గాలతో అనుసంధానం చేయడానికి ఔటర్ రింగ్ రైలు మార్గానికి మూడు రకాల ఎలైన్‌మెంట్లతో దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టుతో జిల్లాల నుంచి హైదరాబాద్ నగరానికి రాకపోకలు మరింత సులభమవుతాయి. ఆయా జిల్లాల్లోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రైలు కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్న ఎనమిది నుంచి పది జిల్లాలకు ప్రయోజనం కలుగుతుంది. 24 నుంచి 36వరకు కొత్తగా రైల్వే స్టేషన్లనూ నిర్మిస్తారు. మొదటి ప్రతిపాదన ప్రకారం 508కిమి నిడివితో 120 మలుపులతో ఈ మార్గం ఉంటుందని నక్షవేశారు. 16.42కిమి నిడివి టన్నెలు కూడా ఇందులో ప్రతిపాదించినట్లు తెలిసింది. ఈ మార్గం కారణంగా 34 కొత్త స్టేషన్ల నిర్మాణం మార్గంలో చేపడుతారు. మొదటి ప్రతిపాదన గాడినపెట్టాలంటే 17,763కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. రెండో ప్రతిపాదన 511.55 కిమినిడదివతో 152 మలుపులతో ఉంటుంది. ఇందులో 11.15కిమి సొరంగ మారాలు ఉంటాయి కొత్తగా 35 స్టేషన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ రెండో ప్రతిపాదన అమలు చేయాలంటే 15964కోట్ల మూలదదనవ్యం అవుతంది. మూడో ప్రతిపాదన అమలు చేయాలంటే మాత్రం రూ.12070కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుంది. మూడో ప్రతిపాదన నిడివి 392.03కి.మి ఉంటుంది. అందులో 77 మలుపులు, 2.88కిమి సొరంగం, 26కొత్త రైల్వేస్టేషన్లతో ఔటర్‌రింగ్‌రోడ్‌కనెక్టివిటి జరిగే అవకాశం ఉంది. ఔటర్ రింగ్ రైలు ఎలైన్‌మెంట్లలో ఆప్షన్1, 3లు 8 జిల్లాల పరిధిలోకి వస్తున్నాయి.

ఇందులో మెదక్, వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్ యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాలు ఉన్నాయి. ఆప్షన్ 2లో పై ఎనిమిది జిల్లాలతో పాటు జనగామ, కామారెడ్డి జిల్లాలు ఉన్నాయి. ఔటర్‌రింగ్‌రైలుతో ఆరు మార్గాలను సికింద్రాబాద్- కాజీపేట, సికింద్రాబాద్-వాడి, సికింద్రాబాద్- డోన్, సికింద్రాబాద్- ముద్ఖేడ్, సికింద్రాబాద్ - గుంటూరు, సికింద్రాబాద్- కొత్తపల్లి అనుసంధానం చేయడానికి వీలవుతోంది. అనేక రాష్ట్రాల మీదుగా ప్రయాణించే గూడ్స్ రైళ్లను ఎక్కువగా మళ్లించడానికి వీలవుతుంది. వాటిని సికింద్రాబాద్ వరకు రాకుండా మధ్యలోనే రింగ్ రైలు మార్గం ద్వారా ఇతర రూట్లలోకి మళ్లించడానికి అవకాశం ఉంటుంది. తద్వారా సికింద్రాబాద్, హైదరాబాద్, నాంపల్లి స్టేషన్లపై ఒత్తిడిని తగ్గించవచ్చు. అంతర్రాష్ట్ర, దూర ప్రాంత వాహనాలు హైదరాబాద్ నగరంలోకి రాకుండా ఔటర్ రింగ్ రోడ్డు నుంచి వెళ్లిపోతున్న మాదిరే, రింగ్ రైలు మార్గంతోనూ అలాంటి ప్రయోజనం ఉంటుంది. బెంగళూరు, చెన్నై, ముంబయి లాంటి ప్రధాన నగరాల్లో ముఖ్యమైన రైల్వేస్టేషన్లపై ఒత్తిడి తగ్గించేందుకు శివార్లలో రైల్వే టెర్మినళ్లు నిర్మించారు. కానీ రింగ్ రైలు ఎక్కడా లేదు. 2023లో కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టును ప్రకటించింది. 2023 సెప్టెంబరులో ఫైనల్ లొకేషన్ సర్వే చేసేందుకు అనుమతి ఇవ్వగా, అది ఇటీవల పూర్తయింది. ఇది కార్యరూపం దాల్చితే భారతదేశంలో ఒక నగరం చుట్టు రింగ్‌రరైల్ ఉన్న మొదటి నగరంగా భాగ్యనగరంకు చరిత్రపుటల్లో



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఐలివెంకన్నగౌడ్,ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

## కల్తీకి మేం వ్యతిరేకం.. కల్లు నిషేధిస్తే ఊరుకోం

### మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గౌడ్‌లు, గీతకార్మికుల జీవనాధారమైన కల్లును నిషేదిస్తే సహించేది లేదని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్తీకి తాము వ్యతిరేకమని, అయితే అదే సాకుతో కల్లు వృత్తిని నిషేదించాలని చూస్తున్నారని దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నామన్నారు. కల్లులో కల్తీకి ఏ ఫార్మా కంపెనీ నుండి ఆమందు సరఫరా అవుతుందో, ఆ కంపెనీలను కూడా నిషేధించి, వాటి పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గౌడ కులస్తులకు 5 ఎకరాల భూమి ఇస్తామని చెప్పిందని అలాగే పది లక్షల ఎక్స్‌గ్రేషియా, డ్రిప్ పద్దతిలో చెట్లను పెంచుతామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చినప్పటికీ వాటిని విస్మరించిందన్నారు. అలాగే అనేక గీత సొసైటీల నుండి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, దమ్ముంటే దానిపై విచారణ చేసి, అధికారులు, అనధికారులు ఎవరెవరు ఎంత మామూళ్లు తీసుకుంటు న్నారో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓఆర్ ఆర్ వద్ద కల్లు దుకాణాలు ఎత్తివేయాలని చూస్తున్నారని, డిస్టిలరీ కంపెనీల నుంచి పెద్ద మొత్తంలో కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు.

# భర్తతో శృంగారానికి నిరాకరించినా విడాకులు ఇవ్వొచ్చు: బాంబే హైకోర్టు

**ముంబై, జూలై 18:** విడాకుల అంశానికి సంబంధించి బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భర్తతో శృంగారానికి నిరాకరించడం, వివాహేతర సంబంధాలున్నాయని అతడిని అనుమానించడం క్రూరత్వంతో సమానమని స్పష్టం చేసింది. విడాకులు పొందేందుకు వీటిని కారణాలుగా పేర్కొనవచ్చని తెలిపింది. ఫ్యామిలీ కోర్టు మంజూరు చేసిన విడాకులను సవాల్ చేస్తూ ఓ మహిళ వేసిన పిటిషన్‌ను తోసి పుచ్చింది. విడాకులకు అనుమతిస్తూ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఓ మహిళ బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తనకు నెలకు రూ. లక్ష భరణం చెల్లించాలని విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ రేవతి మోహితే డెరే, జస్టిస్ నీలా గోఖలేల ధర్మాసనం విచారించింది. తోటి ఉద్యోగులు, అతడి స్నేహితుల ముందు ఆమె ప్రవర్తించిన తీరు దారుణంగా ఉందని భావించాల్సి వస్తుందని పేర్కొంది. అంతేకాకుండా దివ్యాంగురాలైన భర్త సోదరి, ఆయన కుటుంబీకుల పట్ల ఉదాసీనత చూపించడం కూడా అతడి బాధకు కారణాలుగా అభిప్రాయపడింది.

2013లో వివాహం చేసుకున్న ఆ జంట.. ఆ యేడాది తర్వాతి నుంచి విడివిడిగా ఉంటోంది. శృంగారానికి నిరాకరించడంతోపాటు వివాహేతర సంబంధాలున్నాయని అనుమానిస్తూ వేధిస్తోందని.. కుటుంబసభ్యులు, స్నేహితులు, ఉద్యోగుల ముందు ఇబ్బంది పెడుతూ మానసిక వేదనకు గురిచేస్తోందని భర్త ఆరోపించాడు. పుట్టింటికి వెళ్లిపోయినప్పటి నుంచి తనను పట్టించుకోవడం లేదని వాపోయాడు.

ఇలా భార్య ప్రవర్తనతో తీవ్రవేదనకు గురవుతున్నానని, విడాకులు మంజూరు చేయాలని కోరుతూ 2015లో పుణెలోని ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన న్యాయస్థానం



అందుకు అనుమతించింది. దీనిని సవాల్ చేస్తూ ఆ మహిళ బాంబే హైకోర్టును ఆశ్రయించగా అక్కడ చుక్కెదురయ్యింది. అయితే, అత్త మామలు మాత్రమే తనను వేధించారని, భర్తపై తనకు ప్రేమ ఉందని, విడిపోవాలని కోరుకోవడం లేదని భార్య పిటిషన్‌లో పేర్కొనడం గమనార్హం.

# తెర



## అది కష్టమైన దశ

హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇన్నాళ్లు తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఇప్పుడు రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కాబోతుంది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో రాబోతున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. అయితే ఓ సినిమా కోసం మాళవిక కేవలం రెండు వారాల్లోనే 8 కిలోల బరువు పెరిగిందట. అంతకు ముందు 14 రోజుల్లోనే బరువు తగ్గింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక.. తన ఫిట్నెస్ సిక్రెట్ రివీల్ చేసింది. ఒక సినిమాలో తన పాత్ర కోసం కేవలం 14 రోజుల్లోనే 8 కిలోల బరువు తగ్గిందట. అది తనకు చాలా కష్టమైన దశ అని చెప్పుకొచ్చింది. తక్కువ కేలరీలు ఉన్న ఆహారం తీసుకున్నానని.. అదే సమయంలో శారీరకంగా చాలా కష్టపడి స్టంట్స్, యాక్షన్ సీన్ రిహార్సల్స్ చేయడం శరీరంపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి తెలిపింది. శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం, కాబట్టి కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేశానని అది చాలా ప్రమాదకరమైనది అని తెలిపింది. తక్కువ కేలరీలు ఉన్న ఆహారం తీసుకున్నానని.. అదే సమయంలో శారీరకంగా చాలా కష్టపడి స్టంట్స్, యాక్షన్ సీన్ రిహార్సల్స్ చేయడం శరీరంపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి తెలిపింది. శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం, కాబట్టి కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేశానని అది చాలా ప్రమాదకరమైనది అని తెలిపింది. ఆ డైట్ ప్లాన్ శరీరంపై దుష్ప్రభావాలను కలిగిస్తుందని.. శక్తిలేకపోవడంతో చాలా సార్లు బలహీనంగా అనిపించిందని.. డాక్టర్ సైతం ఎప్పుడూ హైడ్రేటెడ్ గా ఉండాలని చెప్పారని.. తాను ఫాలో అయిన డైట్ మాత్రం అస్సలు పాటించవద్దని తెలిపింది. ప్రస్తుతం మాళవిక చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట తెగ వైరలవుతున్నాయి.

ప్రస్తుతం మాళవిక ప్రభాస్ జోడిగా రాజా సాబ్ చిత్రంలో నటిస్తుంది. హారర్ కామెడీ డ్రామాగా వస్తున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ సైతం కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ ఆకట్టుకుంది. అలాగే ఈ సినిమాపై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. ఈ మూవీతో మాళవిక తెలుగు తెరకు పరిచయం కాబోతుంది.




## 14 లోకాలు ఆమెను..
## ఎలా దాటించాడు ?

చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ బడ్జెట్ చిత్రం విశ్వంభర. ఈ చిత్రం సోషియోఫాంటసీ జానర్‌లో తెరకెక్కుతోంది. తాజాగా ఈ సినిమా స్టోరీ గురించి దర్శకుడు వశిష్ఠ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ మేరకు ఈ మూవీ స్టోరీ ఎలా ఉంటుందో ఆయన తెలిపారు. వశిష్ట ఏం చెప్పారంటే.. మనకు తెలిసినవి 14 లోకాలు. అందులో కింద 7 లోకాలు, పైన 7 లోకాలు. అయితే విశ్వంభర అనేది ఈ 14 లోకాలకు పైన ఉన్న మరో లోకం. ఈ చిత్రంలో కథానాయిక (త్రిష) ఆ విశ్వంభర లోకానికి చెందినది. ఏదో ఒక కారణం చేత ఆమె భూమి మీదకు వస్తుంది. భూమి మీదకు వచ్చిన హీరోయిన్‌ను తిరిగి విశ్వంభర లోకానికి ఎలా తీసుకెళ్లారు. ఈ క్రమంలో హీరో (చిరంజీవి) ఎలా ప్రయాణించాడు. అక్కడ ఎదురైన సవాళ్లు ఏమిటి? అన్నది ఈ సినిమా ప్రధాన కథాంశం అని చెప్పుకొచ్చారు. దీంతో మెగా ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. దర్శకుడు వశిష్ట అప్డేట్‌తో సినిమా కోసం మరింత ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ మూవీ ఇప్పటికే చాలాసార్లు వాయిదా పడింది. దానికి గల కారణాలను ఆయన వివరించారు. విశ్వంభర చిత్రం ఆలస్యం కావడానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ (వీఎఫ్ఎక్స్) పనులు అని దర్శకుడు వశిష్ఠ స్పష్టం చేశారు. ఈ చిత్రంలో దాదాపు 4,676 వీఎఫ్ఎక్స్ షాట్‌లు ఉన్నాయని, ఇండియన్ సినిమాలలో ఇంత భారీ స్థాయిలో జునీశ్రీ వర్క్ జరగడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచ స్థాయిలోని అనేక వీఎఫ్ఎక్స్ కంపెనీలు ఈ సినిమా కోసం పనిచేస్తున్నాయని, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన దృశ్య అనుభూతిని అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ సినిమా కోసం భారీ స్థాయి లో.. విభిన్నమైన 13 సెట్‌లు నిర్మించారని, ఒక్కో సెట్ కూడా కథలో ఒక్కో పాత్ర పోషిస్తుందని వశిష్ఠ వివరించారు. ఈ చిత్రం అక్కినేని నాగేశ్వరరావు నటించిన కీలు గుర్రం, ఎన్టీఆర్ నటించిన పాతాళభైరవి వంటి పాత ఫాంటసీ సినిమాల నుండి తాను ప్రేరణ పొందినట్లు తెలిపారు. ఒక పాట మినహా సినిమా షూటింగ్ దాదాపు పూర్తయిందని వెల్లడించారు.

**రూ.200 కోట్ల బడ్జెట్**

విశ్వంభర చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్‌ను వింటేజ్ లుక్‌లో చూపించేందుకు మేకర్స్ చేస్తున్న ప్రయత్నం, భారీ విజువల్స్, స్టార్ కాస్ట్, టాప్ టెక్నీషియన్లు పనిచేస్తుండటం, టాప్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తుండటం, ప్రత్యేకమైన సెట్స్ ఏర్పాటు చేయడంతో ఇప్పటి వరకు ఈ చిత్రానికి రూ.200 కోట్ల వరకు బడ్జెట్ ఖర్చైందని ట్రేడ్ నిపుణులు తెలుపుతున్నారు. ముమ్ముందు ఖర్చులతో సినిమా బడ్జెట్ పెరిగే అవకాశం ఉందా అనేది చూడాలి.



## సుమతీ శతకం ఫస్ట్ లుక్

బిగ్ బాస్ అమర్ దీప్ హీరోగా సుమతీ శతకం అనే చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ మేరకు సుమతీ శతకం ఫస్ట్ లుక్ అందరినీ మెప్పించిన సంగతి తెలిసిందే. వింటేజ్ విలేజ్ డ్రామా, లవ్ స్టోరీలా ఈ చిత్రాన్ని కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి ఎం.ఎం. నాయుడు దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సినిమా నుంచి హీరోయిన్ సయాలీ పాత్రకు సంబంధించిన లుక్ రివీల్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టర్ను చూస్తుంటే ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. ఇక త్వరలో టీజర్‌ను విడుదల చేసి సినిమాపై మరింత అంచనాల్ని పెంచాలని మేకర్లు భావిస్తున్నారు. అభిమానుల అంచనాలకు తగ్గట్టే ఉంటాయని నిర్మాత కొమ్మాలపాటి సాయి సుధాకర్ తెలిపారు. దసరాకి విడుదల చేయాలనే లక్ష్యంతో సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోందని అన్నారు. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా నటిస్తుండగా, టేస్టీ తేజ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. మ్యూజిక్ డైరెక్టర్‌గా సుభాష్ ఆనంద్, డైలాగ్ రైటర్‌గా బండారు నాయుడు, ఎడిటర్‌గా నాహిద్ మొహమ్మద్, డీఓపీగా హాలేష్ పని చేస్తున్నారు.

## ప్రేమ నిజమైన నిర్వచనం కోసం..

ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ చిత్రం ఆంధ్ర కింగ్ తాలూకా సినిమా నుంచి తాజాగా ఫస్ట్ సింగిల్ సాంగ్‌గా నువ్వుంటే చాలే.. అనే పాటను రిలీజ్ చేశారు. ఈ పాటను మ్యూజిక్ ద్వయం వివేక్‌మెర్విన్ కంపోజ్ చేయగా సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ పాడారు. ఇక మరో విశేషమేమిటంటే.. ఈ పాటకు స్వయంగా హీరో రామ్ చక్కటి లిరిక్స్ ఇచ్చారు. నువ్వుంటే చాలే అంటూ రొమాంటిక్ మెలోడీగా సాగిన పాట వినసొంపుగా ఉంది.
రామ్ పోతినేని తొలిసారిగా లిరిక్ రైటర్‌గా మారారు. నువ్వుంటే చాలే పాటలోని సాహిత్యం పోయెటిక్‌గా వుంది. ప్రతి లైన్ మనసుని తాకుతుంది. ప్రేమ నిజమైన నిర్వచనాన్ని కనుగొనడానికి హీరో చేసే ప్రయాణంలా అనిపిస్తుంది. ప్రేమని నిర్వచించలేమని, కేవలం అనుభవించగలమని తెలియజేస్తోంది. ఈ పాట ఒక చిన్న కథలా అనిపిస్తుంది. ఇది భావోద్వేగాలతో ప్రయాణించే అనుభూతిని ఇస్తుంది. మరోవైపు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ వోకల్స్ కట్టిపడేశాయి. కోరస్‌లోని వోకల్ లేయర్స్ అద్భుతంగా వున్నాయి. హుక్ ఫ్రేజ్ మెమరబుల్‌గా వుంది. అద్భుతమైన రియల్ లోకేషన్స్ షూట్ చేసిన ప్రతి ఫ్రేమ్ ఒక పెయింటింగ్ లాగా కనిపిస్తుంది. రామ్ చర్మిషా, భాగ్యశ్రీ ఎలిగెన్స్ కలిసి, వారి కెమిస్ట్రీ ప్రేమని అనుభూతి చెందేలా చేసింది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా రిలీజ్ చేసిన ఫస్ట్ సాంగ్ తోనే బ్లాక్ బస్టర్ కొట్టారు. రామ్ పోతినేని బ్యూటిఫుల్ లిరిక్స్, అనిరుధ్ రవిచందర్ మెస్మరైజింగ్ వాయిస్, వివేక్ మెర్విన్ సోల్ ఫుల్ కంపోజిషన్ తో సాంగ్ హ్యూజ్ బ్లాక్ బస్టర్ అయ్యింది.



కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తుండగా, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో రామ్ బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ హిట్ అందుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. ఇక ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.



బాలీవుడ్ నిర్మాత నమిత్ మల్హోత్రా రామాయణం చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం దాదాపు రూ. 4000 కోట్ల బడ్జెట్ ఖర్చు చేస్తున్నారు.

## అందుకే సీతాదేవి పాత్ర ఇచ్చాం

అంతేకాదు ఇందులోని ప్రతీ పాత్ర, ప్రతీ సన్నివేశంపై ఎంతో శ్రద్ధ వహిస్తున్నారు. ముఖ్యంగా సీతారాముల పాత్రల విషయంలో చాలా ఖచ్చితంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అయితే తాజాగా ఓ చిట్ చాట్‌లో పాల్గొన్న చిత్రబృందం ఈ సినిమాలో ప్రత్యేకంగా సాయిపల్లవిని సీతగా ఎంపిక చేయడానికి గల కారణాన్ని వెల్లడించింది. సాయిపల్లవి గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుందని, అందం కోసం సర్జరీలు చేయించుకోలేదని, కృత్రిమం కంటే సహజ అందమే బాగుంటుందనే సందేశం ఇచ్చినట్లుగా ఆమె ఉంటుందని రామాయణ చిత్రబృందం తెలిపింది. అందుకే సీతాదేవిగా సాయిపల్లవిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అలాగే రాముడిగా రన్బీర్ ఎంపిక చేయడానికి గల కారణాన్ని కూడా తెలిపారు. ఆయన ప్రశాంతమైన వ్యక్తిత్వం, గొప్పగా నటించే నైపుణ్యమే కారణమని చెప్పింది చిత్రబృందం.



ఇంటెన్స్ స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకునే ఆనంది తన అప్ కమింగ్ మూవీ గరివిడి లక్ష్మిలో అద్భుతమైన పాత్రలో కనిపించనుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై

## బుర్రకథ కళాకారిణి రిక్షా ప్రయాణం

టిజి విశ్వ ప్రసాద్, టిజి కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఒక డీప్ కల్చర్‌ని ప్రజెంట్ చేయబోతోంది. అర్థవంతమైన సినిమాలని రూపొందించడంలో పేరుపొందిన ఈ నిర్మాణ సంస్థ ఇటీవలే ఉత్తరాంధ్ర సంప్రదాయాలను అందంగా చూపిస్తూ జానపదం నల జిలకర మొగ్గతో అందరి మనసులు గెలుచుకుంది.


ఇప్పుడు మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఆనందిని లెజెండరీ గరివిడి లక్ష్మి పాత్రలో పరిచయం చేశారు. హాఫ్ శారీ ధరించి, రిక్షాలో కూర్చున్న ఆనంది, ఒడిలో సంగీత వాయిద్యం హార్మోనియంతో చిరునవ్వుతో కనిపించడం ఆకట్టుకుంది. గరివిడి లక్ష్మి ఒక గొప్ప బుర్రకథ కళాకారిణి. 1990లలో ఉత్తరాంధ్ర ఫోక్ సాంప్రదాయాల్ని బతికించి, ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు ఆమెకి ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. ఆమె పేరే ఇప్పుడు ఆ ప్రాంత చరిత్రలో నిలిచిపోయింది. గరివిడి లక్ష్మి గ్రామీణ జీవనానికి, సంగీత వారసత్వానికి అద్భుతమైన ట్రిబ్యూట్ లా ఉంటుంది. ఇది ఓ ఎమోషనల్ జర్నీ, మన సంస్కృతి మీద ప్రేమతో చేయబడ్డ ఎంటర్టైనర్.
చరణ్ అర్జున్ సంగీతం అందించిన ఈ సినిమా, ఉత్తరాంధ్రని ఆవిష్కరిస్తూ మనసుని తాకేలా ఉంటుంది. జె. ఆదిత్య ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్. తారాగణం: ప్రముఖ నటుడు నరేష్, రాసి, ఆనంది, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్, కంచరపాలెం కిషోర్, శరణ్య ప్రదీప్, కుశాలిని



## ఈ కాలం ట్రెండ్‌కి తగ్గట్టుగా..


సాకే రామయ్య సమర్పణలో సిద్ద క్రియేషన్ బ్యానర్‌లో సత్య మార్క్ దర్శకత్వంలో, ప్రొడ్యూసర్ సాకే నీరజ లక్ష్మి నిర్మిస్తున్న చిత్రం ప్రేమలో రెండోసారి. ఈ చిత్రానికి సంబంధించి ఫస్ట్ లుక్ అగ్ర నిర్మాత సి.కళ్యాణ్ చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా సి. కళ్యాణ్ మాట్లాడు తూ ప్రేమలో రెండోసారి చిత్ర టైటిల్ చాలా బాగుంది. కొత్తగా అనిపించింది. తెలుగు ప్రేక్షకులకు అందరికి నచ్చుతుంది. టీం అందరికి అల్ ది బెస్ట్ ఈ సినిమాని డైరెక్టర్ బాగానే తీశారు అనిపిస్తుంది. టైటిల్‌లో డైరెక్టర్ ప్రతిభ స్పష్టంగా కనిపిస్తుంది, ఈ సినిమా చక్కటి ప్రేక్షకాదరణ పొందుతుందన్న నమ్మకం నాకుంది అన్నారు. ఈ టీం కి మరోసారి ఆల్ ది బెస్ట్ చెబుతున్నాన్నని అన్నారు. హీరో మరియు ప్రొడ్యూసర్ రమణ సాకే మాట్లాడుతూ.. సినిమా చాలా బాగా వచ్చింది మా డైరెక్టర్ సత్య మార్క్ ఈ ట్రెండ్‌కి తగట్టు చాలా అద్భుతంగా సినిమాను తీర్చిదిద్దారు. ఈ సినిమా టైటిల్ ఈ కాలం ట్రెండ్‌కి తగట్టుగానే ఉంది. ఈ సినిమాలో నా క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. నేటి యువతీ యువ కులకు బాగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని అందుకుంటుందన్న నమ్మకం నాలో బలంగా అంది. మా హీరో కొత్త వారు అయినా చాలా బాగా నటించారు. ఇందులో నటీ నటులు హీరో రమణ సాకే, హీరోయిన్ వనిత గౌడ, మరియు జబర్దస్త్ శ్రీను, బాబీ తదితరులున్నారు.

## ఆయనంటే ఆ ఊరికి భయమెందుకు?



నూతన నటీనటులతో టాలీవుడ్ క్లాసిక్ కేరాఫ్ కంచరపాలెం నటి, నిర్మాత అయిన ప్రవీణ పరుచూరి తొలిసారి డైరెక్ట్ చేసిన చిత్రం కొత్తపల్లిలో ఒకప్పుడు. రానా దగ్గుబాటి సమర్పణలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 1997 సమయం కొత్తపల్లి అనే ఒక మారుమూల కుగ్రామంలో అప్పన్న (రవీంద్ర విజయ్) ఆ ఊరి ప్రజలకి అప్పులిచ్చి వారిని వడ్డీలతో పీడిస్తూ ఉంటాడు. తన దగ్గరే పని చేసే కుర్రాడు రామకృష్ణ (మనోజ్ చంద్ర) ఆ ఊరి జమీందార్ రెడ్డి (బెనర్జీ) మనవరాలు సావిత్రి (మోనిక)ని చిన్నతనం నుంచే ప్రేమిస్తాడు. అయితే తన ప్రేమ ఆమెకి చెప్పే క్రమంలో మరో అమ్మాయితో పెళ్లి బలవంతంగా ఫిక్స్ అవుతుంది. ఇంకోపక్క అప్పన్న ఆకస్మిక మరణం తర్వాత ఆ ఊరిలో చోటు చేసుకున్న మార్పులు ఏంటి? రామకృష్ణ సావిత్రిని పెళ్లి చేసుకోవడానికి ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? అప్పన్న అంటే ఆ ఊరి జనానికి భయం కాస్తా అపారమైన భక్తిగా ఎలా మారిపోయింది? అప్పన్నకి రెడ్డి ఉన్న వైరం ఏంటి? అసలు చివరికి రామకృష్ణ ఎవరిని పెళ్లి చేసుకున్నాడు అనేవి తెలియాలి అంటే ఈ సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.
కేరాఫ్ కంచరపాలెం మేకర్స్ నుంచి వస్తున్న సినిమా కాబట్టి ఆడియెన్స్ లో మినిమమ్ అంచనాలు అయినా ఉంటాయి. అయితే వాటిని కొంతమేర ఈ సినిమా అందుకుంది అని చెప్పవచ్చు. ముఖ్యంగా నాచురాలిటీతో కూడిన విజువల్స్ కానీ మాటలు గాని సినిమాలో ఆకట్టుకుంటాయి. ఫస్టాఫ్‌లో ఆరంభం కొంచెం సోసో గానే మొదలైనా తర్వాత మాత్రం సినిమా పికప్ అయ్యి డీసెంట్ గా మంచి కామెడీ సీన్స్‌తో వెళుతుంది. అక్కడక్కడా కొన్ని సీన్స్ అయితే మంచి హిలేరియస్‌గా కూడా వర్క్ అవుతాయి. అలాగే దర్శకురాలు ఎంచుకున్న పాయింట్ కూడా బాగుంది. దానికి అనుగుణంగా తెరకెక్కించిన కొన్ని సన్నివేశాలు ముఖ్యంగా సెకండాఫ్ లో ఎమోషనల్ సీన్స్ సహా మైంటైన్ చేసిన థ్రిల్ మూమెంట్స్ బాగున్నాయి. ఇక నటీనటుల్లో డెబ్యూ నటీనటులు బాగా చేశారు. హీరో మనోజ్ చంద్ర ఉత్తరాంధ్ర మాండలీకంలో మంచి బాడీ లాంగ్వేజ్, లుక్స్‌తో ఆకట్టుకున్నాడు. తన కామెడీ టైమింగ్ కూడా సినిమాలో బాగుంది. అలాగే హీరోయిన్ మోనిక తన పాత్రకి సరిగ్గా ఫిట్ అయ్యింది. నాచురల్ లుక్స్‌తో మంచి నటన కనబరిచింది. ఇక వీరితో పాటుగా ఉషా బోనెలా ఎంటర్టైనర్ అని చెప్పవచ్చు. ఆమెపై కామెడీ సీన్స్, ముఖ్యంగా హీరోతో సీన్స్ ఫన్‌గా ఉన్నాయి. ఇక వీరితో పాటుగా మరో సాలిడ్ పెర్ఫార్మర్ రవీంద్ర విజయ్ తన మార్క్ సహజ నటన మాడ్యులేషన్స్ తో సాలిడ్ పెర్ఫామెన్స్ ని అప్పన్నగా చూపించారు. తనతో పాటుగా బెనర్జీ, బాబు మోహన్ లాంటి వారు తమ సీనియార్టీ చూపించారు. అలాగే నటుడు రవీంద్ర విజయ్ పాత్ర ఇంకొంచెం ఎక్కువ ఉంచితే బాగుండు అనిపిస్తుంది. అలాగే తన రోల్ ని అర్థాంతరంగా ఆపేయడాన్ని ఇంకొంచెం ప్రభావవంతంగా ప్లాన్ చేసి ఉంటే బాగుండేది. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు ఒకే రేంజ్ లో ఉన్నాయి. కొన్ని సన్నివేశాల్లో విజువల్ ఎఫెక్ట్స్ బాగాలేవు. మణిశర్మ ఇచ్చిన పాటలు బాగున్నాయి. వరుణ్ ఉన్ని స్కోర్ కూడా బాగుంది. పెట్రోస్ అంటోనియాడిస్ ఇచ్చిన కెమెరా వర్క్ బాగుంది. మంచి సన్నివేశాలు చూపించారు. అలాగే ఎడిటింగ్ కూడా ఒకే కానీ కొన్ని సీన్స్ ని ట్రిమ్ చేయాల్సింది. డబ్బింగ్ అతెంటిక్‌గా ఉండి సినిమాకి మరింత సహజత్వాన్ని తీసుకొచ్చింది. ఇక సినిమాలో నటి గానే కాకుండా దర్శకత్వ భాద్యతలు తీసుకున్న ప్రవీణ పరుచూరి విషయానికి వస్తే.. ఆమె ఒక బ్యూటిఫుల్ లైన్‌ని ఎంచుకున్నారు. తాను అనుకున్న పాయింట్ ని దాదాపు మంచి ఎమోషనల్ గా అలాగే ఫన్‌తో కూడా చెప్పే యత్నం చేశారు. అయితే ఇందులో కొన్ని చోట్ల మాత్రం ఆ సహజత్వం లోపించింది. అనుకున్న పాయింట్ ని చెప్పే ప్రయత్నంలో కథనాన్ని ఇంకొంచెం బెటర్ సీన్స్ తో డిజైన్ చేసుకొని ఉంటే కొత్తపల్లిలో ఒకప్పుడు మరికాస్త ఫీల్ గుడ్ గా అనిపించి ఉండేది. ఓవరాల్ గా తన వర్క్ ఒకే అని చెప్పొచ్చు.

## సెప్టెంబర్‌లో సైమా



సౌత్ సినీ లోకం ఆసక్తిగా ఎదురుచూస్తున్న సైమా 2025 (సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) వేడుకకు రంగం సిద్ధమైంది. ఈ ఏడాది జరగనున్న 13వ ఎడిషన్ సైమా ఈవెంట్‌కి సంబంధించిన తేదీలను ప్రకటించారు. సెప్టెంబర్ 5, 6 తేదీల్లో దుబాయి వేది కగా ఈ ఉత్సవం జరగనుంది. ఈ విషయాన్ని సైమా నిర్వహణ కమిటీ ఎక్స్‌లో అధికా రికంగా ప్రకటించింది. తెలుగు, తమిళం, కన్నడ, మల యాళ చిత్ర పరిశ్రమల నుంచి ఉత్తమ ప్రతిభను కనబరిచిన చిత్రాలను, నటీనటులను గుర్తించి సత్కరించే అంతర్జాతీయ వేదిక సైమా. గత రెండు సంవత్సరాలు కూడా సైమా వేడుకలు దుబాయి వేదికగానే జరిగాయి. 9వ ఎడిషన్ మాత్రం హైదరాబాద్ వేదికగా జరిగింది. 2012లో మొదలైన సైమా అవార్డుల ఉత్సవం ఇప్పటికీ.. 12 ఎడిషన్ లు పూర్తిచేసుకుంది.

## వరుస సినిమాల జోరు

బాలీవుడ్ ఇండస్ట్రీలో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అందం, యాక్టింగ్ పరంగా సినీప్రియులను కట్టిపడేసింది. తక్కువ సమయంలోనే స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. మాజీ హోంమంత్రి కూతురు.. నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగు పెట్టింది. కెరీర్ తొలినాళ్లల్లో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. ఆమె నటించిన ఫస్ట్ మూవీ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. కానీ ఇప్పుడు వరుస సినిమాలతో గ్లామర్ ప్రపంచాన్ని ఏలేస్తుంది. ఆమె పేరు భూమి పెడ్నేకర్.



# పుట్టినప్పటి నుంచే ప్రణాళిక



బాధ్యతలు మీద పడేకొద్దీ ఆర్థిక ప్రణాళికల్లో జాగ్రత్తలూ ముఖ్యమే. ఆర్థికంగా దృఢంగా ఉన్నప్పుడే భవిష్యత్ బాగుంటుంది. అయితే కొత్తగా అమ్మానాన్నలు అయిన వారిలో ఈ జాగ్రత్తలు కొరవడుతున్నాయి. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందుచూపు లేకపోవడం, భవిష్యత్ అవసరాలపై అలసత్వం తలకి మించిన భారం అవుతున్నాయి. అందుకే పిల్లలు పుట్టాక ఆర్థిక ఇబ్బందులు రావొద్దంటే ఆర్థిక ప్రణాళిక తప్పక వేసుకోవాలి అంటున్నారు. ఆర్థిక నిపుణులు

✪ పిల్లల భవిష్యత్ బాగుండాలని బోలెడు కలలు కంటాం. ఏవేవో ప్లాన్లు వేసుకుంటాం. తీరా ఆచరణలో పెట్టాలంటే వెనకాడతాం దానికి మనం చెప్పే కారణాలు.. సంపాదన సరిపోవడం లేదు, పిల్లలు కాస్త పెద్దయ్యాక మొదలు పెడతాను ఇలా చాలానే ఉంటాయి. కానీ, ఈ అలసత్వం చిన్నారుల భవిష్యత్ అవసరాలపై పడుతుందని తెలుసా! వాళ్ల పెద్దయ్యాక ఒకేసారి వారి ఆర్థిక అవసరాలు తీర్చడం కష్టం అందుకే చిన్నారి పుట్టినప్పటి నుంచి సేవింగ్స్ మొదలు పెట్టాలి. ..

✪ చిన్నపిల్లలంటే పుట్టినప్పటి నుంచీ బోలెడన్ని ఖర్చులు, మధ్య మధ్యలో అనారోగ్యాలు. ఇలాంటి ఖర్చుల కోసం పిల్లలు పుట్టిన వెంటనే బేబీ సేవింగ్స్ ఖాతాని తీసుకుంటే ఏది ప్రత్యుత్తరం మొత్తం అందులో దాచుకుంటే ఆపదలో ఆదుకుంటాయి.

✪ ఈ రోజుల్లో ఉన్నత చదువులంటే లక్షలతో కూడుకున్న పని. అమ్మాయి అయితే పెళ్లి అప్పుడు అదనం. అందుకే భవిష్యత్ అవసరాల కోసం వైల్డ్ ప్లాన్ ఒకటి తీసుకోవాలి. దేనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా పథకాలు అందుబాటులోకి తెచ్చాయి. వాటిలో చిన్నారి భవిష్యతు ఏది మంచిదో చూసి ఏంచుకుంటే సరి. ✪. కుటుంబం సురక్షితంగా ఉండేందుకు టర్మ్ పాలసీ తప్పక ఉండాలంటున్నారు. అంతేకాదు.. పిల్లలకి ఆర్థిక స్వాతంత్రం వచ్చేవరకు కొనసాగించాలని అంటున్నారు నిపుణులు.

✪. కొత్తగా తల్లిదండ్రులు అయినవారు కనీసం ఆరు నెలలకు సరిపడా ఖర్చులను పక్కన పెట్టుకోవాలి. అనుకోని ఇబ్బందుల నుంచి ఇవే కాపాడతాయి.

✪ వీటన్నింటిని చిన్నారి చిన్నవయసులో మొదలు పెడితే ఎక్కువ డబ్బు పొదుపు చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే పిల్లల పొదుపు విషయంలో భార్యాభర్తలిద్దరూ కలిసే నిర్ణయం తీసుకోవాలంటున్నారు నిపుణులు. ◻

# అమ్మాయిలు .. అద్భుతాలు సృష్టించారు

**ఇద్దరూ పేదింటి అమ్మాయిలే. కానీ జీవితాల్ని చదివారు. నాన్నల నుంచి స్ఫూర్తిని పొందారు. వాళ్ల కష్టానికి తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అద్భుతాలు సృష్టించారు. అడపా స్ఫూర్తి, చిట్టోజు స్వర్ణ. ఈ భద్రాద్రి జిల్లా అమ్మాయిల సృజనాత్మక ప్రయాణం తెలుసుకుందాం..**

నాన్న ఇంజిన్లకు మరమ్మతులు చేస్తుంటే ఆసక్తిగా చూసేది **అడపా స్ఫూర్తి.** తోచిన సాయమూ చేసేది. దానికితోడు అన్నయ్య చదివేదీ ఎలక్ట్రికల్ విద్యే. వాళ్లిద్దరినీ చూసి, ఎలక్ట్రికల్ ఇంజినీర్ అవ్వాలనుకుంది స్ఫూర్తి. ఈమెది. మణుగూరు. నాన్న ప్రవీణ్ కుమార్, అమ్మ ప్రీతి. పదో తరగతి తన కల దిశగానే అడుగులేద్దామనుకుంది స్ఫూర్తి. కానీ ఇంటర్‌లో బైపిసిలో చేర్చారు. అది నచ్చక ఐటిఐ కళాశాలలోని అడ్వాన్సడ్ ట్రైనింగ్ సెంటర్‌లో మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ కోర్సులో చేరింది. యూట్యూబ్‌లో హోమ్‌మేడ్ వాహనాల తయారీ చూసి తనూ బ్యాటరీల సాయంతో నడిచే వాహనాన్ని తయారుచేయాలనుకుంది. కానీ దానికి తగ్గ ఆర్థిక స్థితి ఇంట్లో లేదు. దీంతో ఆ ఖర్చు భరించలేమన్నారట. నిరాశ పడలేదామె. కొత్తగా ఆలోచించింది. తండ్రి మెకానిక్ షెడ్‌లో నిరుపయోగంగా ఉన్న ఇనుప సామగ్రిని వాహనం తయారీకి ఉపయోగించాలనుకుంది. ముందు డిజైనింగ్ సిద్ధం చేసుకుని అందుకు అవసరమైన బ్యాటరీలు, ఐరన్ షీట్లు, టైర్లు, ఎలక్ట్రికల్ సామగ్రిని సమకూర్చుకుంది. కానీ తను అనుకున్నట్టుగా రాలేదు. దీంతో మరో డిజైన్ సిద్ధం చేసుకుని తిరిగి ప్రయత్నించింది. రెండు నెలల్లోనే ఇద్దరు ప్రయాణించేలా ఎలక్ట్రికల్ వాహనాన్ని తయారుచేసింది. దానికి 'ఎకో వారియర్' అని పేరు పెట్టింది. ఇది రెండున్నర గంటల ఛార్జింగ్‌తో 40 కి.మీ ప్రయాణిస్తుంది. దానిలో నాన్నతో కలిసి ప్రయాణించడమే కాదు, కళాశాలకీ తీసుకెళ్లింది. దాని చూసిన అధ్యాపకులు, ప్రిన్సిపల్ ఆమె ప్రయత్నాన్ని అభినందించారు కూడా. 'నా ఈవి తయారీకి రూ.40 వేలు ఖర్చయ్యింది. కోరుకుంటే ఎవరికైనా రూ.80వేలతో రెండు నెలల్లో చేసివ్వగలను. ఈ ప్రయత్నం నా ఆత్మవిశ్వాసం పెంచింది. ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన సంస్థ ఏర్పాటుచేయడం, తక్కువ ధరకే ఈవిలను అందించడం నా లక్ష్యాలు' అంటోంది స్ఫూర్తి.



స్ఫూర్తి


స్వర్ణ

**చిట్టోజు స్వర్ణ ....**
తరతరాలుగా కులవృత్తినే నమ్ముకొని జీవిస్తున్న కుటుంబం. దానికి తను చదువుకున్న విద్యను జోడించాలనుకుంది చిట్టోజు స్వర్ణ. ఈమెది ఇల్లెందు మండలంలోని బొజ్జాయిగూడెం. నాన్న మెహనాచారి వడ్రంగి, అమ్మ నిర్మల. ముగ్గురు కూతుళ్లలో చిన్నది స్వర్ణ. అగ్రికల్చర్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది. వడ్రంగి పనులతో కుటుంబాన్ని నడిపిస్తోన్న తండ్రికి సాయంగా నిలవాలనుకుంది. ప్రభుత్వ కొలువులకు ప్రయత్నిస్తే కొద్దిలో చేజారాయి. అప్పుడే సాంకేతికతను ఉపయోగించి రైతులకు ఉపయోగపడేలా కల్టివేటర్లను తయారు చేయాలనుకుంది. ఆలోచనను నాన్నతో పంచుకుంటే ఆయనా ప్రోత్సహించారు. దీంతో పరిశోధన చేసి, వ్యవసాయానికి పనికొచ్చే కల్టివేటర్లను తయారుచేసింది. ఎవరి సాయమూ లేకుండా ఒక్కరే వినియోగించేలా వీటిని తీర్చిదిద్దింది. కూలీల కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో మొక్కజొన్న, మిరప, వేరుశనగ రైతులకు ఇవి ప్రయోజనకరంగా మారాయి. ఈ సంగతులన్నీ యూట్యూబ్‌లో పోస్ట్ చేసేది స్వర్ణ. దీంతో తెలుగు రాష్ట్రాలే కాదు, కర్ణాటక, మహారాష్ట్ర సహా ఇతర ప్రాంతాల నుంచీ అర్డర్లు మొదలయ్యాయి. మార్కెట్లో పేరొందిన 7 హెచ్‌పి మోటార్ల ధర రూ. 40 వేల వరకూ ఉంటుంది. నేను సింగిల్‌వీల్ కల్టివేటర్‌ని రూ.26 వేలు, డబుల్ వీట్ వాటిని రూ.28 వేలకే అందిస్తున్నా. అలాగని నాణ్యతలో రాజీపడలేదు. సొంత పెట్టుబడితో మొదలుపెట్టాం. ఇప్పుడు 60 కల్టివేటర్ల వరకూ తయారుచేస్తున్నా. కుటుంబ పరిస్థితుల రీత్యా తాజాగా రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహిస్తే నేను రాణిస్తూనే మరికొందరికీ ఉపాధి కల్పిస్తానంటోంది స్వర్ణ. ◻

# రెయిన్ కోట్లలో తడిసొద్దామిలా!

ఫ్యాషన్ ఫ్యాషన్

అలా అలా నాలుగు చినుకులు ప్రారంభమయ్యాయంటే తడిసొచ్చేందుకు పిల్లలు ఎంతో సంబర పడుతుంటారు. సరదాగా తడవడాన్ని ఇష్టపడని అమ్మాయిలుండరు. మామూలుగా అయితే కాస్త తడి తగిలితే చిరాకుపడ్తుంటాం. అలాంటిది ఏకంగా తడవడమో? అమ్మ వద్దంటుంది. వాన రమ్మంటుంది. వానస్తోందని ఇల్లు కదలకుండా కూర్చుంటామా? సరదాకైనా తడవాలి. అలా కాలేజీ, ఆఫీసులకు వెళ్లడనికైనా ఎంతో కొంత తండవాలి. ఇప్పుడంటే రకరకాల రంగుల్లో, హంగుల్లో, డిజైన్ల గొడుగులొచ్చాయి. కానీ అంతకంటే రెయిన్‌కోట్ల ధరిస్తే వాననుండి రక్షణ వేషమూ బాగుంటుంది. గాలికి ఎగరిపోతుందన్న బెంగ ఉండదు, జల్లులకు దుస్తులు తడిసే బాధ అంతకన్నా ఉండదు. పైగా హ్యాండ్ బ్యాగ్, ఏమైనా లగేజ్ ఉన్నా సురక్షితంగా తీసుకెళ్లొచ్చు. బైకు మీదా దూసుకెళ్లొచ్చు. మరీ చిన్న పిల్లలు స్కూలుకి వేసుకెళ్తున్నట్లు ఉంటుంది. ఇప్పుడేం వేసుకుంటాం... ఈ రెయిన్‌కోట్లు అంటారా? ఏ మాత్రం ఎబ్బెట్టుగా ఉన్నా అమ్మాయిలకిసూట్ కాదు. అమ్మాయిలకు ప్రత్యేకంగా, స్టైలిష్ రెయిన్ కోట్లను రూపకల్పన చేస్తున్నారు. అచ్చంగా స్టైలిష్ కుర్తీనే వేసుకున్నట్టు లేదూ? వాటర్ ప్రూఫ్ టెక్నాలజీతో కొత్తరకం వస్త్రాలను వీటికోసం వినియోగిస్తున్నారు. పైగా బరువూ తక్కువేనట. అంటే వీటిని వేసుకోవడమూ తేలిక. ఫ్యాషన్‌కి ఏ మాత్రం అంతరాయం కాదు. ఇంకా చినుకు మీద పడకుండా ఎక్కడికైనా వెళ్లిపోవచ్చు. ఇంతకన్నా మనికి మాత్రం చినుకుల్లో ఫ్యాషన్‌లో తడిసిపోవచ్చు. .















# మసాలా స్వీట్ కార్న్ వడ



కావలసినవి:
స్వీట్ కార్న్ : కప్పు
పెనర పిండి కప్పు,
బియ్యపిండి పావుకప్పు, ఉల్లి ముక్కలు పావు కప్పు, క్యాప్సికమ్ ముక్కలు పావు కప్పు, కొత్తిమీర తురుము 2 టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి ముద్ద పావుట స్పూను, కారం టీస్పూను, పసుపు పావుటీస్పూను, నిమ్మరసం టీస్పూను, ఉప్పు తగినంత, చాట్ మసాలా, టీస్పూను, నూనె వేయించడానికి సరిపడా.

**తయారుచేసూ విధానం** : స్వీట్‌కార్న్ కచ్చాపచ్చాగా రుబ్బాలి. అందులోనే మిగిలిన అన్ని దినుసులూ వేసి కలపాలి. ఇప్పుడు మిశ్రమాన్ని కొంచెంకొంచెంగా తీసుకుని వడల్లా వత్తి కాగిన నూనెలో వేయించి ఆపై చాట్‌మసాలా చల్లి గ్రీన్ చట్నీతో అందిస్తే సరి. ◻

**చెలి చిట్కా**

తలకే కాకుండా శరీరానికి కూడా నూనెను పట్టించి మర్దన చేయడం వలన శరీరానికి చక్కని వ్యాయామం లభించి దేహపుష్టి కలుగుతుంది. ◻

# గోంగూర ప్రయోజనం

ఆరోగ్య భాగ్యం


డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఆకుకూరల్లో మిక్కిలి ప్రశస్తమైనది గోంగూర గోగు మరియు కూర అనే రెండు తెలుగు పదాల కలయికనే గోంగూర అని చెప్పువచ్చు. ఆకలిని కల్గించే గోగుని ఫ్లాక్స్ పంటగా ఇండియాలో ఎక్కువగా పండిస్తారు. గోంగూరని ప్రపంచ మాతటా అన్ని వంటకాల్లో వేసే ఆకుకూర. దీని శాస్త్రీయ నామం హైబిస్కస్ సబార్డిఫా. ఇది హైబిస్కస్ కుటుంబానికి చెందినది. గోంగూర ఆంధ్రుల ఇష్టమైన ఆహారం దీన్ని ఆంధ్రమాద, ఆంధ్రమతం, శాకంబరీ వరప్రసాధం, సచ్ఛఫల, ఉష్ఛప్రియ, పుంటికూర, గోగాకు, పులిచకీరై పీలుపులి వెండలాల్ అంబాడీ, పట్వా, మెస్టా, గోర్యూరా, గోగు, పుండిపల్లె, పుల్లని పాలకూర అని వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో దాదాపు 30 రకాల పేర్లతో పిలుస్తారు. గోంగూర అంటే జీవశాస్త్రంలో ఏదో ఒకటి అని అర్థం. గోంగూర కాడల్ని బట్టి గోంగూర రెండు రకాలు. తెల్ల గోంగూర లేదా ఆకుపచ్చ గోంగూరని కెనఫ్ లీవ్స్ అని, ఎర్ర గోంగూరని రోసెల్లా ఆకులు అని అంటారు. అంతేకాకుండా సంస్కృతంలో పీలు, ఆమ్లపీలు, కంటకపీలు అని,హిందీలో లాల్‌బారి అని అంటారు. గోంగూర జాతుల్లో దాదాపు 300 దాకా ప్రపంచమంతటా సంవత్సరం పొడవునా పండిస్తారు. దీన్ని ఎక్కువ వేసవిలో వర్షాకాలంలో ఎక్కువగా పండిస్తారు. దీనిలో దేశవాళీ గోంగూర, పుల్లగోంగూర,ధనానారి గోంగూర (ముళ్ళున్న గోంగూర) అని మూడు రకాలు. పొలాల్లో పెరటిలో, కాల్వగట్లలో, తోటల్లో పండించే గోంగూరని మంచి గోంగూరని, కొండ ఆటవీప్రాంతాల్లో, గిరిజన తెగల్లో పండించే గోంగూరని కొండ గోంగూరని అంటారు. గోంగూర ఆకులు చేదుగా, కొద్దిగా జిగురుగా ఉండి రుచికి ఆమ్లంగా, పుల్లగా ఉండడం వల్ల పులిచింతాకు అని అంటారు. ఎర్రగోంగూర ఆకులో ఎక్కువగా విటమిన్ సి, ఆక్సాలిక్ ఆసిడ్ ఎక్కువగా ఉండడం వల్ల ఇది రుచికరమైన పోషక ఆహారం. గోంగూర ఆకులే కాకుండా పూలు, గింజలు, కాడలు వేర్లు కూడా ఉపయోగపడతాయి. దీనిలో ఉండే పోషకాలు, ఆంటి ఆక్సిడెట్ల వల్ల ఒక ప్రత్యేకమైన టార్ట్‌ఫ్లేవర్‌కి ప్రసిద్ధి చెందింది. ఔషధ గుణాల్లో, రుచిలో దీన్ని తలదన్నే ఆకుకూరే లేదు. ఇది ఒక బహుముఖ మూలిక అని చెప్పవచ్చు.

**పోషక విలువలు :** 10 గ్రా. గోంగూరలో ఉన్న పోషకాలు. తేమ: 86.2, కేలరీలు: 26, ప్రోటీన్స్ : 1.7 గ్రా. కార్బొహైడ్రేట్స్: 10 గ్రా. క్రొవ్వు : 1.1 గ్రా, హైబర్ : 3.1 గ్రా, కాల్షియం : 172 మి.గ్రా. పొటాషియం: 321 మి.గ్రా. సోడియం : 980 మి.గ్రా. ఫాస్పరస్ : 40 మాంగనీస్: 8%, మెగ్నీషియం : 10%, విటమిన్‌లు: 2,900 ఐయు. విటన్ సి : 20 మి.గ్రా. మాలిక్ ఆసిడ్ : 1.25%, పెక్టిన్ : 3.19%, మినరల్స్: 75 మి.గ్రా. ఐరన్ : 11 %

**ఆరోగ్య ప్రయోజనాలు :** వేడి, బలాన్ని కల్గించే గోంగూర రుచిలో ఆరోగ్యంలో శ్రేష్టమైనది. **కాలేయంకు రక్షణ :** లివర్‌లోని టాక్సిన్స్‌ని డీటాక్సిఫై చేసి లివర్ కణాల సంఖ్యను పెంచి లివర్‌కి బలాన్ని చేకూర్చుతుంది. ఇది శరీరంలో వేడిని తగ్గించి శరీరాన్ని చల్లబరిచి లివర్‌పై ఒత్తిడిని తగ్గిస్తుంది. దీనివల్ల జాండీస్, ఫ్యాటీలివర్, ర్రోసిస్ వంటి వ్యాధులు రావు.

**జీర్ణక్రియ :** ఇది చెడు కేలరీల్ని బర్న్ చేయడం, స్టార్చ్‌ని విచ్చిన్నం చేసి జీర్ణక్రియని మెరుగుపరుస్తుంది. ఇది జీర్ణక్రియకి ఎనర్జీ బూష్టర్‌గా పని చేస్తుంది. గోంగూరలోని ఐరన్ వల్ల అధిక ఆకలిని ఫిస్టులా, పొట్ట ఉబ్బరం, కడుపులో మంట తగ్గించి, ప్రేగు కదలికల్ని ప్రోత్సహించి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ప్రేగు కండరాల్ని బలపరిచి గట్‌హెల్త్‌ని మెరుగుపరుస్తుంది.

**రక్తశుద్ధికి:** గోంగూరలోని ఐరన్, విటమిన్ సి రక్తంలో హీమోగ్లోబిన్ శాతాన్ని పెంచి రక్తహీనతని, అధిక రక్తస్రావాల్ని తగ్గిస్తుంది. ఇది లింఫాటిక్ రక్తప్రసరణకి మంచిది. ఫోలేట్స్, విటమిన్ బి6 వల్ల హీమోస్టాసిస్ స్థాయిల్ని నిర్వహిస్తుంది. ఐరన్ లోపాన్ని తగ్గిస్తుంది. ఎర్రరక్తకణాల ఉత్పత్తికి, కణాలకి ఆక్సిజన్ సరఫరా చేసి ఎనర్జీ లెవల్స్‌ని పెంచి రక్తాన్ని శుద్ధిచేస్తుంది. స్ప్లీన్ వ్యాధుల్ని నివారిస్తుంది. ◻

# బియ్యం పురుగు పట్టకుండా..



ఎక్కువ మొత్తంలో బియ్యం కొన్నప్పుడు పురుగు పట్టకుండా ముందుగానే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. మరీ దీనికోసం కొన్ని చిట్కాలు ప్రయత్నించవచ్చంటున్నారు నిపుణులు.

**కర్పూరం..** కర్పూరం వెదజల్లే ఘాటైన సువాసన ఉంటుంది. ఫలితంగా పురుగులు పట్టచ్చు. అందుకే వల్ల బియ్యంలో పురుగులు చేరవు. కొన్ని కర్పూరం బిళ్లలను తీసుకొని మెత్తని పొడిగా చేసుకోవలి. దీన్ని కాస్త మందంగా ఉండే నూలు వస్త్రంలో చుట్టి బియ్యం పెడితే సరిపోతుంది.



**ఇంగువ..** వంటల్లో విరివిగా ఉపయోగించే ఇంగువ కూడా బియ్యంలో పురుగులు చేరకుండా కాపాడుతుంది. దీనికి కారణం ఇది వెదజల్లే ఘాటైన వాసనే. దీన్ని కొద్దిగా బియ్యంలో కలిపితే సరిపోతుంది. బిర్యానీ ఆకులను ఉపయోగించినా ఇదే ఫలితం కనిపిస్తుంది.

**బోరిక్ పౌడర్..** బియ్యంలో పురుగులు పెరగడానికి తేమ కూడా ఒక కారణమే. కొంతమంది బియ్యాన్ని ఒకేసారి తెచ్చి ఇంట్లో నిల్వ చేస్తారు. ఈ అయితే కొన్నిసార్లు బియ్యంలో తేమ చేరే అవకాశం బియ్యంలో తడి చేర కుండా చూసు కోవాలి. దీని కోసం బియ్యంలో కొద్దిగా బోరిక్ పౌడర్ కలపాలి. ఇది బియ్యంలో చేరిన తేమను పీల్చేసుకుంటుంది. అందులో పురుగులు చేరకుండా ఉంటాయి అంటున్నారు. ◻

# శ్రీకృష్ణుడి విశ్వరూపం



కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు విశ్వరూపాన్ని దర్శింపచేశాడు. అంతేనా.. ఆ పరంధాముడు తన విశ్వరూపాన్ని బాల్యావస్థలోనే పెంపుడు తల్లి యశోదకు తొలుత చూపించాడు. మన్ను తిన్నావా? అని దండించ వోయినప్పుడు నోరు తెరిచి తన నిజస్వరూపాన్ని చూపాడు. ఉద్యోగపర్వంలో రాయబారం కోసం ధృతరాష్ట్రుని కొలువుకు వెళ్లినప్పుడు కౌరవులు శ్రీకృష్ణుణ్ణి బంధించాలని ప్రయత్నించారు. వారిని హెచ్చరించటానికి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. విజయుడికి నిజస్వరూపాన్ని ప్రదర్శించాడు. కురుక్షేత్ర యుద్ధసమయంలో భగవద్గీతను బోధిస్తూ విజయుడికి నిజస్వరూపాన్ని ప్రదర్శింపజేయడం జగద్విదితమే! ఇక చివరిసారి మహాభారత యుద్ధం తర్వాత శ్రీకృష్ణుడు సోదరి సుభద్రను తీసుకుని ద్వారకకు బయల్దేరాడు. మార్గమధ్యంలో ఉదంకుడు అనే రుషి అతిథ్యాన్ని స్వీకరించాడు. యుద్ధ విషయం తెలియని ఆ మహర్షి కౌరవుల క్షేమ సమాచారాలు అడిగాడు. వారు సమరంలో చనిపోయారని శ్రీకృష్ణుడు చెప్పాడు. అది విన్న ఉదంకుడు అతడిపై అగ్రహించాడు. నీకు యుద్ధాన్ని ఆపగలిగే శక్తి ఉన్నా! ఆపలేదు అంటూ శపించబోయాడు. అప్పుడు శ్రీకృష్ణ పరమాత్మ ' ఓ మునీ! నీ తపోశక్తిని వృథా చేసుకోవద్దు. నేను సర్వాంతర్యామిని అంటూ తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. ఇలా భారత, భాగవతాల్లో నాలుగుసార్లు శ్రీకృష్ణుడు తన దివ్యమైన విశ్వరూపాన్ని చూపాడు. ◻

ఆధ్యాత్మికం

# ఒంటరితనాన్ని వదిలించుకుందాం

**జీవనశైలి, పని ఒత్తిడి కారణాలేవైనా చాలామంది మహిళలను డిప్రెషన్ వేధిస్తుంటుంది. ఇలాంటప్పుడు ఒంటరితనం బాధించకూడదంటే.. ఈ అలవాట్లు చేసుకోమంటున్నారు నిపుణులు.**

✦ జీవితం ఎవరికీ పూల పాన్పు కాదు.. ఎదురయ్యే సంఘటనల్ని డీల్ చేసుకునే విధానమే వారిని గట్టెక్కిస్తుంది. అలాకాకుండా అన్నింటికీ ఎవరో ఒకరు తోడు కావాలనుకుకోవడం, మనసుకి నచ్చిన వారు పక్కనుంటేనే అన్నీ చేయగలను అనుకోవడం వల్ల. మీ ఒంటరితనం పోగొట్టడానికి ఏవవైనా హాబీలను అలవాటు చేసుకోండి. ఉదాహరణకు మీకు మంచి ముగ్గులు పెట్టడమో, వంట చేయడమో వస్తే.. దానిలోనే ప్రత్యేకత సాధించడానికి ప్రయత్నించండి. సామాజిక మాధ్యమాల వేదికగా వాటిని ప్రదర్శించండి. ఇవన్నీ మీకో గుర్తింపు తేవడమే కాదు.. ఒంటరితనాన్నీ దూరం చేస్తాయి.

✦ నలుగురిలో కలవడానికి బోలెడు మార్గాలు.. వ్యాయామం చేయడానికి రోజూ దగ్గర్లోని యోగా సెంటర్‌కో, పార్కుకో వెళ్లండి. కసరత్తులు మీ ఒంటికి శ్రమనూ, మనసుకు సాంత్వననూ అందిస్తాయి. కొత్త స్నేహాలకూ, ఆలోచనలకూ ఇవి వేదిక అవుతాయి. లేదంటే ఉదయమో, సాయంత్రమో వెల్లండి క్రమంగా మీలోని ఒత్తిడి దూరమవుతుంది.



✦ మీలో ఒంటరితనం అనే భావన రావడానికి మీ చుట్టూ ఉండే వ్యక్తులూ, సమాజం.. ఏదైనా కారణం కావొచ్చు. నిత్యం ఏదో ఒక ప్రతికూల పరిస్థితితో పోరాడాల్సి రావొచ్చు. అంతమాత్రాన మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవద్దు. ఏ రోజుకారోజు మీలోని ఓ నెగెటివ్ అంశాన్ని అధిగమించాలనే లక్ష్యం పెట్టుకోండి. ఏ విషయంలోనైనా వెనకబడి ఉంటే అందులో పట్టు తెచ్చుకోవడానికి ప్రయత్నిం చండి. ఇవన్నీ మీ ఒంటరితనాన్ని దూరంచేసేవే. ◻

# టీమిండియాకు డు ఆర్ డై



న్యూఢిల్లీ: భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్ ఉత్కంఠగా కొనసాగుతోంది. మూడు మ్యాచ్‌లు ముగిసే సమయానికి ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలో ఉంది. ఇప్పుడు నాల్గవ టెస్ట్ మ్యాచ్ ఈ నెల 23 నుంచి మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్ టీమిండియాకు డూ ఆర్ డై మ్యాచ్‌కానుంది. ఈ మ్యాచ్‌లో ఓడినా లేదా డ్రా చేసుకున్నా, సిరీస్‌ను గెలిచే అవకాశం భారత్‌కు ఉండదు. నాల్గవ టెస్ట్ ప్రారంభం కాకముందే, మాంచెస్టర్ మైదానంలో భారత్, ఇంగ్లాండ్, ఎవరికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయనేది ఆసక్తికరంగా మారింది. ముందుగా టెస్ట్ క్రికెట్‌లో భారత్, ఇంగ్లాండ్ మధ్య హెడ్‌టు హెడ్ రికార్డు చూస్తే ఈ రెండు దేశాల మధ్య

## ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో ప్రతికూల రికార్డు
## నాల్గో టెస్టులో హిస్టరీ క్రియేటయ్యేనా?

ఇప్పటివరకు మొత్తం 139 టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో ఇంగ్లాండ్ 53 సార్లు విజయం సాధించగా, టీమిండియా 36 సార్లు గెలిచింది. మిగిలిన 50 టెస్ట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఇక మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో భారత్, ఇంగ్లాండ్ మధ్య ఇప్పటివరకు 9 టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో ఇంగ్లాండ్ 4 సార్లు విజయం సాధించగా, మిగిలిన 5 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. టీమిండియాకు ఈ మైదానంలో టెస్ట్ మ్యాచ్‌లో ఇప్పటివరకు ఎప్పుడూ విజయం దక్కలేదు. ఇక్కడ 1974లో భారత్ గెలుపుకు అత్యంత దగ్గరగా వచ్చింది. అప్పుడు ఇంగ్లాండ్ చేతిలో 113 పరుగుల తేడాతోఓటమిపాలైంది. భారత్, ఇంగ్లాండ్ ఈ మైదానంలో చివరిసారిగా 2014లో తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఒక ఇన్నింగ్స్‌లో 367 పరుగులు చేసింది. దీనికి సమాధానంగా భారత జట్టు రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి కూడా 367 పరుగులు చేయలేకపోయింది. చివరికి టీమిండియా ఆ మ్యాచ్‌ను ఇన్నింగ్స్ 54 పరుగుల తేడాతో ఘోరంగా ఓడిపోయింది. ఇది భారత జట్టుకు ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో ఉన్న ప్రతికూల రికార్డుకు ఒక ఉదాహరణ. ప్రస్తుత భారత జట్టులోనిచాలామంది క్రికెటర్లు ఓల్డ్‌ట్రాఫోర్డ్ మైదానంలో ఇప్పటివరకు టెస్ట్‌మ్యాచ్ ఆడలేదు. ఈ మైదానంలో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాట్స్‌మెన్ సునీల్‌గావస్కర్. ఆయన ఇక్కడ ఐదు ఇన్నింగ్స్‌లలో 242 పరుగులు చేశారు. 21వ శతాబ్దంలో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ఏ భారతీయ బ్యాట్స్‌మెన్ కూడా ఇక్కడ టెస్ట్ మ్యాచ్‌లలో 200 పరుగుల మార్కును చేరుకోలేకపోయారు.





### మహిళల ప్రపంచ కప్.. టైబ్రేకర్లకు చేరిన
## హంపి, హారిక, దివ్య, వైశాలి

న్యూఢిల్లీ: ఫిడే మహిళల ప్రపంచ కప్-2025లో భారత మహిళా చెస్ క్రీడాకారిణులు కోనేరు హంపి, హారిక డి, దివ్య దేశ్‌ముఖ్ మరియు ఆర్ వైశాలి వారివారి రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లలో టైబ్రేక్‌లకు చేరుకున్నారు. జార్జియాలో జరిగిన తొలి క్లాసికల్ మ్యాచ్‌లో చైనాకు చెందిన రెండో సీడ్ ఝు జినర్‌ను మట్టికరిపించిన దివ్య, రెండో మ్యాచ్‌లో బ్లాక్ పావులతో ఓటమిని ఎదుర్కొంది, మ్యాచ్‌ను వేగవంతమైన టైబ్రేక్ గేమ్‌లకు నెట్టింది. ఇంతలో, హంపి, హారిక మరియు వైశాలి వారి వారి క్లాసికల్ మ్యాచ్‌లలో వరుసగా రెండు డ్రాలు ఆడారు. క్వార్టర్ ఫైనల్స్‌లో స్థానం కోసం టైబ్రేక్ మ్యాచ్‌లపై ఆధారపడవలసి ఉంటుంది. ఇక హంపి మరియు దివ్యలకు ఈ టోర్నమెంట్‌లో ఇది తొలి టైబ్రేక్‌లు కాగా, వైశాలి మరియు హారిక వరుసగా రెండవ రౌండ్‌లో టైబ్రేక్ మ్యాచ్‌లు ఆడనున్నారు. యాదృచ్ఛికంగా, నాలుగు భారత మ్యాచ్‌లు టై బ్రేక్‌లోకి వెళ్ళాయి, అయితే మిగిలిన నాలుగు ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో రెండు క్లాసికల్ మ్యాచ్‌ల విజేతలు ఉన్నారు. లీ టింగ్జీ, నానా జాగ్నిడ్జ్, సాంగ్ యుక్సిన్, టాన్ జోంగీ టైబ్రేక్ మ్యాచ్‌లు ఆడనున్నారు.

## అంతర్జాతీయ రెజ్లింగ్ సర్క్యూట్‌లో..
## సుజీత్‌కు స్వర్ణ పతకం



న్యూఢిల్లీ: పాలియాక్ ఇమ్రే వర్గా జానోస్ మెమోరియల్ ర్యాంకింగ్ సిరీస్‌లో సంచలనాత్మక బంగారు పతక ప్రదర్శనతో భారత్‌కు చెందిన సుజీత్ కల్కల్ అంతర్జాతీయ రెజ్లింగ్ సర్క్యూట్‌లో తన వేగవంతమైన ఆరోహణను కొనసాగించాడు. ఎఫ్‌మెన్ 65 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో పోటీ పడుతున్న సుజీత్, అత్యున్నత గౌరవాలను గెలుచుకోవడమే కాకుండా, శుక్రవారం తెల్లవారుజామున ఒలింపిక్ పతక విజేత ఇస్లాం దుదేవ్‌పై అద్భుతమైన గెలుపుతో వార్తల్లో నిలిచాడు. ఫైనల్లో, సుజీత్ అజర్‌బైజాన్‌కు చెందిన, మూడుసార్లు యూరోపియన్ కాంస్య పతక విజేత అయిన అలీ రహీమ్‌జాదేను 5-1 స్కోరుతో ఓడించాడు. కానీ ఈరోజు ప్రీక్వార్టర్ ఫైనల్‌లో అల్బేనియాకు చెందిన ఇస్లాం దుదేవ్‌పై అతని ఆధిపత్య 11-0 టెక్నికల్ సుపీరియారిటీ విజయం ప్రత్యేకంగా నిలిచింది. పారిస్ 2024 ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత అయిన దుదేవ్ పూర్తిగా వెనుకబడ్డాడు. బుడాపెస్ట్‌లో ఈ విజయం సీనియర్ సర్క్యూట్‌లో సుజీత్ సాధించిన అతిపెద్ద విజయాలలో ఒకటిగా నిలుస్తుంది. ఇటీవల జూన్‌లో తనరెండవ అండర్ 23 ఆసియా ఛాంపియన‌షిప్ టైటిల్‌ను గెలుచుకున్నాడు, మరో సాంకేతిక సుపీరియారిటీ ప్రదర్శనతో ఫైనల్‌ను గెలుచుకున్నాడు. 2024లో,అతను టిరానాలో జరిగిన అండర్23 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 70కిలోల విభాగంలో పోటీపడి కాంస్యంసాధించాడు. అదే సంవత్సరం, అతను వరుసగా రెండవ సీనియర్ జాతీయ టైటిల్‌ను కూడా కైవసం చేసుకున్నాడు.



### ఫ్రీస్టైల్ గ్రాండ్ స్లామ్‌లో..
### తొలి భారతీయునిగా
## అర్జున్ రికార్డు

న్యూఢిల్లీ: అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరిగిన ఫ్రీస్టైల్ గ్రాండ్‌స్లామ్ టూర్‌లో సెమీఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయుడిగా గ్రాండ్‌మాస్టర్ అరిగైసి అర్జున్ నిలిచాడు. ఫ్రీస్టైల్ ఫార్మాట్ చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ అర్జున్ తన ఘన ఫామ్‌ను కొనసాగించాడు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లోని మొదటి రెండు ఆటలలో అతను ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్‌ను ఓడించాడు, మొట్ట మొదటి ఫ్రీస్టైల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లోని ఈ నాల్గవ మరియు చివరి లెగ్‌లో టాప్‌నాలుగు స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. నోడిర్బెక్‌తో జరిగిన మ్యాచ్‌లో నల్ల పావులతో ఘనమైన డ్రాతో అర్జున్ రోజును ప్రారంభించాడు, ఆపై ఆటలో తన ఎక్స్ఛేంజ్ ప్రయోజనాన్ని మార్చుకున్న తర్వాత తెల్ల పావులతో బలంగా తిరిగి వచ్చి 1.5-0.5 విజయాన్ని నిర్ధారించాడు. సెమీఫైనల్లో అర్జున్ ఏకైక అమెరికన్యేతర ఆటగాడు అవుతాడు, తన మొట్టమొదటి ఫ్రీస్టైల్ గ్రాండ్ స్లామ్ ఫైనల్‌కు అర్హత సాధించాలని పట్టుదలతో ఉన్నాడు. మరోవైపు, గ్రాండ్ మాస్టర్ ఆర్ పర్గనంద తన 7గేమ్‌లో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అనుభవజ్ఞుడైన అమెరికన్ ఆటగాడు ఫాబియానో కరువానా చేతిలో టైబ్రేకర్లలో 3-4 తేడాతో ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్నాడు. ఫ్రీస్టైల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో ప్రాగ్‌కు ఇది మొదటి క్వార్టర్ ఫైనల్, కానీ అతను దానిని విజయంగా మార్చలేకపోయాడు. అయినప్పటికీ, దిగువ బ్రాకెట్ ప్లేఆఫ్ మ్యాచ్‌ల ద్వారా అతను ఇప్పటికీ మూడవ స్థానాన్ని కొనసాగిస్తున్నాడు.

## ఉమెన్స్ గోల్ఫ్‌లో నేహా ఆధిక్యం
### 1 నుండి 9కి అమన్‌దీప్ పతనం



న్యూఢిల్లీ: భారత మహిళల సర్క్యూట్‌లో అత్యంత అనుభవజ్ఞులైన స్టార్లలో ఒకరైన నేహా త్రిపాఠి, క్లోవర్ గ్రీన్స్‌లో జరిగిన మహిళల ప్రో గోల్ఫ్ టూర్ తొమ్మిదవ లెగ్‌లో రెండవ రౌండ్ తర్వాత 7అండర్ 65తో అద్భుతమైన ప్రదర్శనను అందించింది, ఇది ఆమెను 3షాట్‌ల ఆధిక్యంలోకి నెట్టివేసింది. 33 ఏళ్ల నేహా అగ్రస్థానానికి చేరుకున్నప్పటికీ, ఓవర్‌నైట్ లీడర్ అమన్‌దీప్ డ్రాల్ 4 ఓవర్ల 76 రౌండ్‌తో పెద్ద పతనాన్ని చవిచూసింది, ఆమె మొదటి రౌండ్ కంటే ఏడు షాట్లు దారుణంగా ఉన్నాయి. దీంతో క్లోవర్ గ్రీన్స్ పార్ 72 లేఅవుట్‌లో అమన్‌దీప్ ఇప్పుడు మొదటి స్థానం నుండి తొమ్మిదో స్థానానికి పడిపోయింది. 2023 నుండి గెలవని నేహా, ఆ సంవత్సరంలో ఆమె మూడుసార్లు ట్రోఫీని ఎత్తింది, ఆమె 1అండర్ 71 లో తన మొదటి రౌండ్‌ను 65తో పూర్తి చేసింది, ఇందులో ఆరు బర్డీలు మరియు ఒక బోగీకి వ్యతిరేకంగా ఒక ఈగిల్ ఉన్నాయి. గత సీజన్‌లో గాయాలతో పోరాడి, తన సరైన ఫామ్ మరియు లయను కనుగొనడానికి ప్రయత్నిస్తున్న నేహా, కోర్సులో ముందు తొమ్మిది స్థానాల్లో నాలుగు బర్డీలను కలిగి ఉంది, వెనుక తొమ్మిది స్థానాల్లో, ఆమె ఒక ఈగిల్‌ను ల్యాండ్ దాని తర్వాత బర్డీలతో 65 పరుగులు చేసింది. బోగీ లేకుండా రెండవ రౌండ్ సాధించిన జాస్మిన్ శేఖర్ (72-67) కంటే నేహా మూడు షాట్ల ఆధిక్యంలో ఉంది. జాస్మిన్ ముందు తొమ్మిది స్థానాల్లో మూడు బర్డీలు కొట్టగా, వెనుక తొమ్మిది స్థానాల్లో మరో రెండు షాట్లు కొట్టింది. మూడవ స్థానంలో ఉన్న కృతి చౌహాన్, ప్రోగా మొదటి రౌండ్ 73 తర్వాత 69 పాయింట్లతో మంచి పురోగతి సాధించింది. అమెచ్యూర్ సాన్వి సోము (73-70) ఏకైక నాల్గవ స్థానంలో నిలిచింది. రిధిమా దిలావారి (74-71), లావణ్య జాడన్ (73-72), అమన్‌దీప్ డ్రాల్ (69-76) 1ఓవర్ 145 వద్ద తొమ్మిదో స్థానంలో నిలిచారు.

# వాణిజ్యం

## మరోసారి ఆర్‌బిఐ నుంచి గుడ్‌న్యూస్!

న్యూఢిల్లీ, జూలై 18: ఈ ఏడాది అంచనాలకు మించి ఆనందాన్ని ఇచ్చిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆ సంతోషాన్ని మరికొంత కాలం పొడిగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఆగస్టులోనూ వడ్డీ రేట్ల కోత ఉండొచ్చని సమాచారం. వచ్చే నెలలో జరగనున్న ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపో రేటును మరో 25 బేసిస్ పాయింట్లు (0.25శాతం) తగ్గించే అవకాశం ఉన్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ అంచనా వేసింది. ప్రస్తుతం భారత్‌లో వృద్ధి అవుట్‌లుక్ మిశ్రమంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో వినిమయ డిమాండ్ బలహీనంగా ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం పటిష్టంగా కొనసాగుతోంది. అమెరికాకు ఎగుమతులు నెమ్మదిగా పెరుగుతున్నాయి. కానీ, ఇతర ప్రాంతాలకు మాత్రం ఇంకా ఆశించిన స్థాయిలో ఎగుమతులు జరగట్లేదు. ఈ పరిణామాలతో పాటు ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకుంటే.. రేట్ల కోతకు ఆగస్టు సరైన సమయమని ఆర్‌బీఐ భావించే అవకాశం ఉంద్ది అని ఐసీఐసీఐ తమ నివేదికలో పేర్కొంది. వచ్చే నెలలో జరిగే ఎంపీసీ సమావేశంలో రెపో రేటును మరో 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించి.. 5.25 శాతానికి తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. గత ద్రవ్య పరపతి విధాన సమీక్ష తర్వాత నుంచి ద్రవ్యోల్బణం అంచనాలను మించి తగ్గుముఖం పట్టిందని, 202526 ఆర్థిక సంవత్సరంలో ఇది 2.9 శాతం ఉండొచ్చని ఐసీఐసీఐ అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 3.7 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ గతంలో అంచనా వేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో 0.25శాతం చొప్పున కీలక రేట్లను తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన సంగతి తెలిసిందే. అలా మూడు వరుస సమీ క్షల్లో కలిపి రెపోరేటు తగ్గింది. ఈ రేటు ఆధారంగా బ్యాంకులు గృహ, వాహన, ఇతర రుణాలపై వడ్డీరేట్ల సవరిస్తాయి. ఆర్‌బీఐ కల్పించిన ప్రయోజనాన్ని బ్యాంకులు పూర్తిగా తమ ఖాతాదార్లకు బదలాయిస్తే, సామాన్యులకు ఆయా రుణాలపై నెలవారీ కిస్తీల భారం తగ్గుతుంది. ఇప్పుడు వచ్చే నెలలోనూ రెపో రేటులో కోత ఉంటే.. ఈ రుణగ్రహీతలకు మరింత ఉపశమనం లభించనుంది.



## విఐపి ఇండస్ట్రీస్ అధిపతి సంచలన వ్యాఖ్యలు
### నా వ్యాపార సామ్రాజ్యంపై వారసులకు నిరాసక్తి..

న్యూఢిల్లీ, జూలై 18: ప్రముఖ లగేజీ కంపెనీ విఐపిఇండస్ట్రీస్ అధిపతి దిలీప్ పిరమల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. రూ.6,800 కోట్ల విలువైన కంపెనీలో ప్రమోటర్ల గ్రూప్ 32 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తమ సంస్థలో ఉన్న 51.73 శాతం వాటాలో 32 శాతం షేర్లను ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడిదారులు, ఇతరులకు విక్రయించేందుకు ప్రమోటర్ల గ్రూప్ సిద్ధమైందని స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో వీఐపీ ఇండస్ట్రీస్ వెల్లడించింది. ఈ ఫైలింగ్ అనంతరం దిలీప్ పిరమల్ మాట్లాడుతూ, మాది కుటుంబ యాజమాన్యంలో ఉన్న వ్యాపారం. తర్వాతి తరం దీనిని నడిపించడంలో ఆసక్తి చూపడం లేదు. ఐదు దశాబ్దాలుగా నడుస్తోన్న వ్యాపారంలో వీఐపీ మార్కెట్ లీడర్‌గా ఉంది. కానీ గత ఐదు సంవత్సరాల కాలంలో మేం మార్కెట్ వాటాను కోల్పోతున్నాం. గతఏడాది మేం నాలుగు త్రైమాసికాల్లో నష్టాలు చవిచూశాం. నిర్వహణ పరమైన సమస్యల కారణంగా మొదటి సారి మేం ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. రానున్న రెండు, మూడు సంవత్సరాల్లో మేం బాగా పని చేయాల్సిన అవసరం ఉంది. నా వరకు షేర్ హోల్డర్ల ప్రయోజనాలు కాపాడటం ముఖ్యం. కొత్త యాజమాన్య బృందాన్ని తీసుకురావడమే ఈసంస్థ ముందుకు సాగడానికి ఉన్న ఏకైక మార్గం. ఈ సంస్థ బలమైన పునాదులతో నిర్మితమై ఉంది. తర్వలోనే వేగంగా పుంజుకుంటుంది. పెట్టుబడిదారులంతా సహనం వహించాలని కోరుతున్నాను. మేనేజ్‌మెంట్ మార్పు అంత సులభం కాదు అని అన్నారు. అలాగే తమ కుటుంబ సభ్యుల్లో ఒకరు బోర్డులో భాగంగాఉంటారని చెప్పారు. ఆ గ్రూప్‌లో దిలీప్ పిరమల్, కెంప్ అండ్ కంపెనీ లిమిటెడ్, డీజీపీ సెక్యూరిటీస్ లిమిటెడ్, కిడ్డీ ప్లాస్ట్‌లిమిటెడ్, పిరమల్ వైభుతి ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్, ఆల్కన్‌ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్‌లిమిటెడ్ భాగం. ఈ విక్రయం తర్వాత వాటా విలువ 19.73 శాతానికి పడిపోనుంది.



## రిలయన్స్ రిటైల్ చేతికి కెల్వినేటర్

న్యూఢిల్లీ, జూలై 18: దేశీయ కన్జ్యూమర్ డ్యూరబుల్ బ్రాండ్ కెల్వినేటర్‌ను కొనుగోలు చేసినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ శుక్రవారం ప్రకటించింది. ఎంత మొత్తానికి కొనుగోలు చేసిందీ మాత్రం వెల్లడించలేదు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ప్రీమియం హోమ్ అప్లయన్సెస్ మార్కెట్‌లో తమ వృద్ధికి ఈ కొనుగోలు ఉపయోగపడుతుందని రిలయన్స్ రిటైల్ ఓ ప్రకటనలో తెలిపింది. ఇంట్లో వినియోగించే ఎలక్ట్రిక్ రిఫ్రిజిరేషన్ విభాగంలో కెల్వినేటర్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. దేశీయంగా అత్యాధునిక సాంకేతికత, మెరుగైన పనితీరు, నాణ్యత విషయంలో పేరెన్నికగన్న కెల్వినేటర్ 1970, 80ల్లో ది కూలెస్ట్ వన్ ట్యాగ్‌లైన్‌తో ఐకానిక్ బ్రాండ్ గుర్తింపు పొందింది. అలాంటి బ్రాండ్ దేశంలో విస్తృత రిటైల్ నెట్‌వర్క్ కలిగిన రిలయన్స్‌తో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని రిలయన్స్ వెంచర్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ పేర్కొన్నారు. దీనివల్ల ప్రీమియం గృహోపకరణాల మార్కెట్‌లో కంపెనీ గణనీయమైన వృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.




## విద్యుత్ వాహనాల బ్యాటరీలపై చైనా ఆంక్షలు!

చైనా, జూలై: ప్రపంచ విద్యుత్తు వాహనాల మార్కెట్‌ను చైనా తన గుప్పిట బంధించే ప్రయత్నాన్ని వేగవంతం చేసింది. ఈక్రమంలో డ్రాగన్ ఈవీలకు గుండె వంటి బ్యాటరీ టెక్నాలజీలను బంధిస్తోంది. తాజాగా ఎనిమిది రకాల వాహన బ్యాటరీలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం చైనా సరిహద్దులు దాటకుండా ఆంక్షలు విధించింది. వాస్తవానికి ఆరు నెలల క్రితమే ఆ దేశం కొన్ని ఆంక్షలను అమల్లోకి తీసుకొచ్చింది. అయితే.. ఇప్పుడు ఆ టెక్నాలజీలను వాడి బ్యాటరీలను ఉత్పత్తి చేసేవారు వాటిని విదేశాలకు ఎగుమతి చేసే ముందు చైనా ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందే. చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రకటన ప్రకారం, వాణిజ్యం, ఇన్వెస్ట్‌మెంట్, సాంకేతికత సహకారం రూపంలో ఇతర దేశాల్లోని సంస్థలకు టెక్నాలజీ బదిలీలకు కచ్చితంగా ప్రభుత్వం జారీ చేసే లైసెన్స్‌లు అవసరం అని వెల్లడించింది. చైనా ఆంక్షలు విధించిన టెక్నాలజీల్లో కొన్ని లిథియం అయాన్ బ్యాటరీలో కీలకమైన కాథోడ్స్ తయారీకి వినియోగిస్తారు. అదే శక్తి బ్యాటరీ పనితీరును నిర్ణయిస్తుంది. దీంతోపాటు కాథోడ్స్ తయారీ వినియోగించే కొన్ని పదార్థాలకు వాడే సాంకేతికతను కూడా చైనా అణిచిపెట్టింది. వీటిల్లో లిథియం అయాన్ పాస్ఫేట్ (ఎల్ఎఫ్‌పీ), లిథియం మాగ్నెస్ ఐరన్ పాస్ఫేట్ (ఎల్ఎంఎఫ్‌పీ), ఇతర పాస్ఫేట్ ఆధారిత మెటీరియల్ తయారీకి వాడేవి, పనితీరు అంచనావేసే ప్రమాణాలు, ఇతర రసాయన సమ్మేళనాలపై ఆంక్షలు వర్తింపజేసింది. లిథియం ఉత్పత్తి, ప్రాసెసింగ్‌ను బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకొంది. ఇక సెమీకండక్టర్ల తయారీ మెటీరియల్‌కు వినియోగించే గాలియం ఉత్పత్తి, ఐయాన్ ఎక్స్ఛేంజీ టెక్నాలజీని నియంత్రిస్తోంది. చైనాలోనే అత్యధిక విద్యుత్తు వాహనాల ఉత్పత్తి వాస్తవానికి ప్రపంచ విద్యుత్తు వాహనాల బ్యాటరీ పరిశ్రమలో చైనా ఆధిపత్యానికి ఈ ఆంక్షలే పునాదులుగా మారాయి. వీటిల్లో ముఖ్య పాత్రను కాథోడ్ టెక్నాలజీలే పోషిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఎల్ఎఫ్‌పీ, ఎల్ఎంఎఫ్‌పీ 95 శాతం ఉత్పత్తి సామర్థం చైనాలో ఉంది. ఇక ఎల్ఎఫ్‌పీ ఆధారిత 76.6శాతం విద్యుత్తు వాహనాలు ఇక్కడే ఉత్పత్తి అయ్యాయి.



## జియో ఫైనాన్స్ నికరలాభం రూ.325 కోట్లు

ముంబై, జూలై 18: డైవర్సిఫైడ్ దిగ్గజం ఆర్ఐఎల్ నుంచి విడివడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలను సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్ మొదటి త్రైమాసికంలో నికర లాభం 4శాతం పెరిగి రూ.325 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో రూ.313 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.418 కోట్ల నుంచి రూ.619 కోట్లకు చేరింది. అయితే మొత్తంవ్యయాలు సైతం రూ.79 కోట్ల నుంచి రూ.261 కోట్లకు భారీగా పెరిగాయి. వడ్డీ ఆదాయం రూ.162 కోట్ల నుంచి రెట్టింపై రూ.363 కోట్లకు చేరింది. ఈ కాలంలో జియో పేమెంట్స్‌లో 14.96 శాతం వాటాకు సమానమైన 7.9 కోట్ల ఈక్విటీ షేర్లను ఎస్‌బిఐ నుంచి సొంతం చేసుకుంది. ఇందుకు రూ.104.54 కోట్లు వెచ్చించింది. వెరసి 2025 జూన్ 18 నుంచి జెపిబిఎల్ పూర్తి అను బంధ సంస్థగా అవత రించినట్లు వెల్లడించింది.




### సౌత్ ఇండియన్ బ్యాంకు లాభం రూ.322 కోట్లు

ప్రైవేట్ రంగ సంస్థ సౌత్ ఇండియన్ బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధిం చింది. ఏప్రిల్-జూన్ తొలి త్రైమాసికంలో నికర లాభం 10శాతం వృద్ధితో రూ.322 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో రూ.294 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ.2,736 కోట్ల నుంచి రూ.2,984 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.2,314 కోట్ల నుంచి రూ.2,362 కోట్లకు చేరింది. నిర్వహణ లాభం రూ.508 కోట్ల నుంచి రూ.672 కోట్లకు చేరింది.స్థూల మొండిబకాయిలు 4.5శాతం నుంచి 3.15శాతానికి, నికర ఎన్‌పిఎలు 1.44 శాతం నుంచి 0.68శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి 18.11 శాతం నుంచి 19.48 శాతానికి మెరుగు పడింది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై, జూలై 18: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ఈ వారాంతాన్ని ముగించాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఉదయం 82,193.62 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. క్రమంగా భారీ నష్టాల్లోకి వెళ్లింది. ఇంట్రాడేలో 650 పాయింట్ల నష్టంతో ఓ దశలో 81,608.13 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 501.51 పాయింట్ల నష్టంతో 81,757.73 వద్ద ముగిసింది. నిఫ్టీ 143.05 పాయింట్ల నష్టంతో 24,968.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.16గా ఉంది. యాక్సిస్ బ్యాంక్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70.16 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,355 డాలర్ల వద్ద ట్రేడయింది. మే, జూన్ నెలల్లో మన మార్కెట్లకు దన్నుగా నిలిచిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు జులైలో సెల్లర్లుగా నిలవడం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. మే నెలలో రూ.19,860 కోట్లు, జూన్‌లో రూ.14,590 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొనుగోలు చేసిన ఎఫ్ఐఐలు.. జులైలో మాత్రం ఇప్పటి వరకు నికరంగా రూ.2660 కోట్ల షేర్ల విక్రయాలు జరిపారు. యాక్సిస్ బ్యాంక్ నికర లాభంలో 3 శాతం క్షీణత నమోదు చేసింది.ఇంట్రాడేలో 6 శాతం మేర నష్టపోయిన యాక్సిస్ బ్యాంక్ షేరు చివరికి బీఎస్ఈలో 5.24 శాతం నష్టంతో 1099 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లపైనా పడింది. అమెరికాతో ట్రేడ్‌డీల్‌పై రోజులు గడుస్తున్నా స్పష్టత రాకపోవడం, అంతర్జాతీయంగా చమురు ధరలు మళ్లీ 70 డాలర్లకి చేరడం కూడా సూచీల పతనానికి కారణం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.